
జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక
RNI Regn No. 52879/93
2020 డిసెంబర్ 1-31




## సాహితీ మృత్యుంజయుడు
# బొల్లిముంత శివరామకృష్ణ శత జయంతి

### ప్రత్యేక వ్యాసాలు

పెనుగొండ లక్ష్మీనారాయణ ❖ దేవరాజు మహారాజు
ప్రొ. ఎస్వీ సత్యనారాయణ ❖ మందలపర్తి కిషోర్

---

### ఇతర వ్యాసాలు

దారి చూపించే రచన ❖ అక్షర ప్రేమికుడి ముత్యాల కోవ
కార్పొరేట్ మీడియా కపట నాటకం ❖ రైతు బంద్
అశ్వమేధం తరువాత ఇక రాజసూయమే!
ఎవరి మనోభావాలు నిజంగా దెబ్బతింటున్నాయి?
ప్రపంచపు తొలి మార్క్సిస్టు శాస్త్రీయ విప్లవకారుడు, మహామేధావి ఏంగెల్స్
వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమం

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2020 డిసెంబర్ 1-31 సంపుటి : 29 సంచిక : 5,6

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

## ఈ సంచికలో...

3 కమ్యూనిస్టు రచయిత బొల్లిముంత శివరామకృష్ణ -పెనుగొండ లక్ష్మీనారాయణ
8 'మృత్యుంజయుడు' బొల్లిముంత డాక్టర్ దేవరాజు మహారాజు
10 సాహితీ మృత్యుంజయుడు బొల్లిముంత ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
12 అక్షరాల అభ్యుదయ రచయిత బొల్లిముంత మందలపర్తి కిషోర్
14 దారి చూపించే రచన కె రామచంద్రమూర్తి
16 అక్షర ప్రేమికుడి ముత్యాల కోవ ఆర్వీ రామారావు
18 కార్పొరేట్ మీడియా కపట నాటకం డి. పాపారావు
21 రైతుల ఆందోళన : బిజెపి-అండ్ కో వంచనాపూరిత వాదనలు -వాస్తవాలూ! ఎం కోటేశ్వరరావు
24 రైతు బంద్ డాక్టర్ సుద్దాల అశోక్ తేజ
25 అశ్వమేధం తరువాత ఇక రాజసూయమే! కె. శ్రీనివాస్
27 ఎవరి మనోభావాలు నిజంగా దెబ్బ తింటున్నాయి? రామ్ పునియాని
29 ప్రపంచపు తొలి మార్క్సిస్టు సీతారాం ఏచూరి
32 శాస్త్రీయ విప్లవకారుడు, మహామేధావి ఏంగెల్స్ అనిల్ రాజింవాలె
35 వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమం డి. జయప్రకాష్
37 మార్క్స్ థీసిజ్ ఆన్ ఫ్యూయర్బాక్ పుస్తక సమీక్ష

# రైతుల బోనులో కార్పొరేట్ శక్తులు

**సంపాదకీయం**

కార్పొరేట్ శక్తులు మన జన జీవనంలోని వివిధ రంగాలను వాతాపి జీర్ణం చేసుకున్న తిమింగలాలు. అవి ఆర్థిక, పారిశ్రామిక, సేవా, వాణిజ్య రంగాలను ఆక్రమించాయి. మీడియా మీద పెత్తనం చలాయిస్తున్నాయి. రాజకీయ రంగాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా శాసిస్తున్నాయి.

వ్యవసాయ రంగంలోని పరోక్ష రంగాలైన వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, పురుగు మందులు, ఎరువులు వగైరాలన్నింటా ఈ శక్తులు కీలకం అయ్యాయి. ఇక మిగిలింది రైతులు పండించే పంటలు, వ్యవసాయ భూముల మీద ప్రత్యక్ష ఆధిపత్యం పొందడం మాత్రమే.

ప్రభుత్వం ప్రపంచీకరణలో భాగంగా ఆర్థిక నియమాలను సరళీకృతం చేసింది. ప్రభుత్వ రంగాన్ని అమ్మకానికి అంగట్లో పెట్టింది. వీటన్నింటినీ కార్పొరేట్ శక్తులు హస్తగతం చేసుకుంటున్నాయి. ఉన్నతశ్రేణి మధ్యతరగతి వర్గాలలో ప్రారంభమైన వస్తు వినియోగ సంస్కృతి వారిని కార్పొరేట్ భక్తుల్ని చేసింది. సాధారణ మధ్యతరగతి ఈ వ్యామోహానికి గురై కార్పొరేట్ శక్తుల బోనులో చిక్కుకున్నాయి. ఈ వ్యామోహంతో పాటు విద్య, వైద్య సేవలు కార్పొరేట్ గుప్పిటకు చేరడంతో మధ్యతరగతి దానిని ప్రతిఘటించలేక మరో పక్క దాని దాడికి తట్టుకోలేక సతమతమవుతున్నది. అడపా దడపా తమ నిరసనలతో సరిపెట్టుకుంటున్నది.

ఇప్పుడు వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తుల గుప్పిటలో పెట్టడానికి తెచ్చిన చట్టాలు, రైతులను కలవరపరుస్తున్నాయి. ఇప్పటికీ కార్పొరేట్ శక్తులు ఆక్రమించుకున్న పారిశ్రామిక, సేవా వాణిజ్య రంగాల దుష్ఫలితాలు అవి ప్రజలకు చాలా దూరంగా జరిగే పరిణామాలుగా వున్నాయి. దీనికి భిన్నంగా ఈ వ్యవసాయ చట్టాలు గ్రామీణ ప్రాంతాన్ని చుట్టుముట్టడంతో వాటిని తేరిపార చూసే అవకాశం రైతులకు కలిగింది. పంజాబులో స్థిరపడిన మండీల వ్యవస్థ, దేశంలో అరకొరగానైనా అమలు జరుగుతున్న కనీస మద్దతు ధర హుళక్కి కావడాన్ని వారు వెంటనే గమనించగలిగారు. ఇది జీవన్మరణ సమస్య కావడంతో సాహసోపేతమైన ఉద్యమానికి పూనుకున్నారు. ఇంతవరకు ఇతర వర్గాల ప్రజలను బోనులోకి లాగిన కార్పొరేట్ శక్తులను ఇప్పుడు రైతాంగం ఈ కార్పొరేట్ శక్తులను బోనులో నిలబెడుతున్నారు. ఇప్పుడు దేశ ప్రజలందరి ఉమ్మడి శత్రువుగా కార్పొరేట్ శక్తుల మీద అందరి దృష్టి పడింది.

ఈ పరిణామాలలో ప్రస్తుతం ప్రధాన పాత్రధారిగా వున్న మోదీ ప్రభుత్వ విధానాల వైపు ప్రజల దృష్టి కూడా మళ్ళుతున్నది. పాలన బి.జె.పీ.ది దేశం కార్పొరేట్లదీ అన్న సత్యాన్ని గ్రహించడం ప్రారంభమైంది. బి.జె.పి. ముందుకు తెస్తున్న ఒకే దేశం, ఒకే మార్కెట్, ఒకే భాష, ఒకే మత సంస్కృతి వగైరా నినాదాల నిజస్వరూపం బైటపడుతున్నది. మన దేశం పలు భాషల, బహుళ మతాల సమ్మేళనం. ఒక భాషను దేశంలో రుద్దితే ఇతర భాషలు అంతరించిపోవు. ఒకే మార్కెట్‌ను రుద్దాలనుకున్నా మన సంతలు, మండీలు మంటగలసిపోవు. మళ్ళీ మళ్ళీ ప్రతిఘటిస్తూనే బహుళత్వం తన అస్థిత్వాన్ని నిలబెట్టుకుంటుంది. రైతుల ఉద్యమం దానికి నాంది మాత్రమే. ❑

# కమ్యూనిస్టు రచయిత బొల్లిముంత శివరామకృష్ణ

పెనుగొండ లక్ష్మీనారాయణ
అరసం జాతీయ కార్యదర్శి



"కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలు, లక్ష్యాలూ దాచుకోవడమంటే అసహ్యం. సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ బలవంతంగా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్లు బహిరంగంగానే ప్రకటిస్తారు." (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక).

ఉత్తమ కమ్యూనిస్టు ఉత్తమ ప్రచారకుడు కావాలనే ఆదర్శానికి నిదర్శనగా బొల్లిముంత శివరామకష్ణ తన అభిప్రాయాలను, లక్ష్యాలను ఏ మాత్రం దాచుకోకుండా తను ఆశించిన సమ సమాజ లక్ష్యంగా జీవించారు. జీవితకాలంలో కచ్చితంగా అటువంటి నికార్సయిన సాహిత్యాన్నే సృష్టించారు.



బొల్లిముంత శివరామకృష్ణ గుంటూరు జిల్లా వేమూరు మండలం చదలవాడ గ్రామంలో నూరేళ్ల క్రితం 27 నవంబర్ 1920న జన్మించారు. తల్లి దండ్రులు మంగమ్మ, అక్కయ్య. తండ్రి వద్దనే ప్రాథమిక విద్యతో పాటు సంస్కృతం నేర్చుకున్నారు. 8వ తరగతి చదివిన తరువాత హయ్యర్ గ్రేడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. 13 ఏళ్ల వయస్సులోనే నాటక రంగంలో ప్రవేశించిన బొల్లిముంత యువకునిగా 'అమ్మ' నవల చదివిన ప్రేరణలో కమ్యూనిస్టు ఉద్యమంలో కలిసి సాగారు. తెనాలి తాలూకా పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. భూపోరాటాల్లో పాల్గొన్నారు. జైలుశిక్షలు అనుభవించారు. అజ్ఞాతవాస జీవితం గడిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆదేశం మేరకు 1967లో బందరు పార్లమెంటు నియోజక వర్గానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అభ్యుదయ సాహితోద్యమంలో, ప్రజా సాంస్కృతిదోద్యమంలో క్రియాశీలంగా వున్న బొల్లిముంత భీమవరంలో 1988 అక్టోబర్ 8,9 తేదీలలో జరిగిన అరసం రాష్ట్ర 10వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎంపికై గుంటూరులో 1992 నవంబర్ 14, 15 తేదీలలో జరిగిన 11వ మహాసభ వరకూ కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులుగా కూడా సేవలందించారు.

కమ్యూనిస్టుగా రాజకీయోద్యమాలలో క్రియాశీలంగా పాల్గొంటూ సాహిత్య రచనకుపక్రమించిన బొల్లిముంత 1947లో ప్రారంభమైన తెలంగాణ విమోచన పోరాటాన్ని ప్రతిబింబిస్తూ ఆ ఏడాదే 'మృత్యుంజయులు' నవలను వెలువరించారు. పోరాట ప్రాంతం వాడిగా కాకుండా ఆంధ్ర ప్రాంతానికి చెందిన బొల్లిముంత చేసిన ఈ రచన ఆ సాయుధ పోరాట కాలంలో వెలువడిన తొలి నవలగా సాహిత్య చరిత్రకెక్కింది.

"యువకుడుగా తన కాలంలో తన సమీప ప్రాంతం తెలంగాణాలో ప్రారంభమైన ప్రజా పోరాట నేపథ్యాన్ని అవగాహన చేసుకుని, దాని ఆంతర్యాన్ని అర్థం చేసుకొంటూ ఆ పోరాటం జరుగుతున్న తీరుతెన్నుల్ని గమనిస్తూ, ప్రజల పక్షమే అంతిమ విజయమని వైతాళిక గీతికగా ఆవిష్కరించిన కథాకథనం 'మృత్యుంజయులు' నవల" అని పుస్తక ప్రచురణ కర్తలు (ప్రజాశక్తి ప్రచురణాలయం, బెజవాడ-25 అక్టోబర్ 1947) అభిప్రాయం ప్రకటించారు. ఈ నవలను ప్రజా ఉద్యమాలకు ఒక సందేశంగా తెలంగాణా సమరసేనాని రావి నారాయణరెడ్డి అభివర్ణిస్తే, ప్రముఖ అభ్యుదయ రచయిత తుమ్మల వెంకట్రామయ్య 'ఈనాటికీ వీరగాథమే!' అని కొనియాడారు. 2015 వరకూ ఆరు ముద్రణలు పొందిన చిరస్మరణీయ నవల మృత్యుంజయులు. తెనాలిలో 2015 నవంబర్‌లో జరిగిన బొల్లిముంత జయంతి సభలో ఆరవ ముద్రణను ఆవిష్కరించే గౌరవం నాకు లభించింది.

"ఆనాటి నైజాం రాజ్యంలో నెలకొన్న పరిస్థితుల్ని, దేశముఖులు, పటేళ్ళ ఆగడాల్నీ; సామాన్య ప్రజలు - ముఖ్యంగా గ్రామీణ రైతాంగ ప్రజానీకం అనుభవిస్తున్న కష్టాల్నీ, యువకుల్లో తలెత్తుతున్న తిరుగుబాటు ధోరణుల్నీ అక్షరీకరించి; ఇక్కడి ప్రజల్లో చైతన్యాన్నీ, బైటివారిలో సంఘీభావాన్ని రేకెత్తించి ఉద్యమ దిశగా జనాన్ని సమాయత్తం చేయడానికి జరిగిన ప్రయత్నమిది" అని మృత్యుంజయులు నవలను వివరిస్తూ ప్రసిద్ధ రచయిత శీలా వీర్రాజు

'ప్రజాఉద్యమానికి అద్దంపట్టిన బొల్లిముంత శివరామకృష్ణ నవల, మృత్యుంజయులు'వ్యాసం (మహోజ్వల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నవలా సాహిత్యం – పరిచయాలు – పరిశీలన; జనసాహితి జంటనగరాల శాఖ ప్రచురణ–మే 2010) లో రాశారు.

బొల్లిముంత సృజనాత్మక రచయితేగాక కళాకారుడు కూడా. అభ్యుదయ సాహిత్యోద్యమంతో, అరసంతో, ప్రజా సాంస్కృతికోద్యమంతో, కమ్యూనిస్టు కార్యాచరణతో పెనవేసుకుపోయిన జీవితమాయనది, జీవనయానమాయనది. అనేక నాటికలు, నాటకాలు రచించి తెలుగునాట ఉద్యమస్ఫూర్తిని వెదజల్లారు. 1954లో వీరి తొలి కథాసంపుటి ప్రముఖ అభ్యుదయ సాహితీవేత్త అవసరాల సూర్యారావు 'పరిచయం'తో వెలువడింది. ఆ సంపుటిలోని కథలతోపాటు మొత్తం 31 కథలతో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 1990లో మళ్లీ అవసరాలవారి పరిచయంతో 'బొల్లిముంత శివరామకష్ణ కథలు' సంపుటిని ప్రచురించింది.

## రచనా వైఖరి

"రచనలో ఉద్వేగం ఉండాలి. ఉత్త ఉద్వేగం చాలదు. భావనాశక్తి, శిల్ప ప్రావీణ్యం, సజీవ భాష, పాఠకుణ్ణి ఉరకలు పెట్టించి మనసును వూటలూరించే సంవిధానం, సందేశం... ఒకటా? వీటన్నిటికంటే ముఖ్యంగా ప్రజాజీవిత చిత్రణ – అదీ అభ్యుదయ మార్గంలో ఉండాలి" అని 'తెలుగుప్రాణి' కథానికలో తన సాహిత్య దశ, దిశా నిర్దేశాన్ని స్పష్టం చేసిన బొల్లిముంత ఆ విధంగానే కథా సాహిత్యాన్ని సృష్టించారు. విశాలాంధ్ర పక్షపత్రిక, నగారా, ప్రతిభ, జయశ్రీ వంటి పలు పత్రికలలో ప్రచురితమైన 26 కథానికలు, 5 గల్పికలు ఈ సంపుటిలో చోటుచేసుకున్నాయి. 1948 నుండి 1969 వరకు రచనాకాలంగా కనిపిస్తుంది. తన 15వ ఏటనే రాసిన 'ఏటొడ్డు' కథ ఈ సంపుటిలో చోటు చేసుకోలేదు. బొల్లిముంత మరేమైనా కథలు రాశారేమో వెతకాల్సి ఉంది. స్వాతంత్ర్యంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న, పెంచుకున్న ప్రజానీకానికి దానివల్ల వొరిగిందేమీ లేదని, అదొక మేడిపండని స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే కథారచన ప్రారంభించిన బొల్లిముంత తన కథల్లో స్పష్టం చేశారు. వర్గసమాజంలోని స్వాతంత్ర్యానికి అర్థం నిజమైన స్వేచ్ఛ లేకపోవటం, దోపిడీకి గురికావటమే అని విశదీకరించారు ('స్వాతంత్ర్యం' గల్పికలో). నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వర్గరహిత సమాజంలోనే సాధ్యమన్నారు. ఆ సమాజం పోరాటం ద్వారానే సాధ్యమని సందేశించారు. "రండోరు! రండోరు! పేదల్లారా! పోరాడాం మన హక్కులకై... పోయేదేముందోరు మనకింకా/పోతే ఈ పేదరికమేనోరు! ... ఉక్కు ముక్కలుగ ఒక్కుమ్మడిగా, పోదాం రండోరు పేదల్లారా!" అని 'సమ్మెపిలుపు' కథానికలో సమరనాదం మ్రోగించారు. మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో పేర్కొన్న "కార్మికులు పోగొట్టుకునేది ఏమీ లేదు, తమ శృంఖలాలు తప్ప. వాళ్లు పొందవలసింది ఎంతైనా ఉంది" మాటలను బొల్లిముంత ఉటంకించారు. బొల్లిముంత కథల్లో శ్రీశ్రీ చెప్పిన పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులు, దగాపడిన తమ్ముళ్లు కనిపిస్తారు. అన్నార్తుల ఆక్రందనలు వినిపిస్తాయి. 'తీవ్ర శ్రుతిలో, తీవ్ర ధ్వనితో వారు చేసే నినాదాలు మిన్నంటుతాయి. మరోపక్క నిస్సహాయతతో కూడిన దయనీయమైన జీవితాలు, భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాల దోపిడీ, పాలక కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలపై, ప్రజా సంస్కృతిపై ప్రభుత్వ దమనకాండ వంటి ఎన్నో విషయాలు ఈ కథల్లో కనిపిస్తాయి. సామ్యవాద వ్యవస్థ కొరకు పోరాడే ప్రజా శక్తుల పక్షాన నిలిచి వారికి స్ఫూర్తినీ, చైతన్యాన్ని అందించే కథలను రాశారు బొల్లిముంత.

## బ్రతుకు బాటలో పోరాటాలు

పద్దెనిమిదేళ్ల పాలేరు రంగడు పంటజొన్న చేను మంచెపై నిలబడి వడిసెల తిప్పుతూ, కేకలు పెడుతూ పక్షుల్ని తోలుతుంటాడు. ఆ మంచెపై వాలిన ముసలి కాకొకటి రంగడికి 'జీవనగీత'ను బోధిస్తుంది. "నీవూ నీలాంటి వాళ్లూ మమ్మల్ని డబ్బాలు మోగించి జడిపించ చూస్తున్నారు. నల్లటి గుడ్డల్ని వేలాడగట్టి, కాకినే చంపి గుంజకు వేలదీని 'మీరూ యిలాగే చస్తారు. కనుక మా పొలాల మీదికి రాబోకండి' అని భయపెట్టబోతున్నారు... కానీ మేం తిండికి మాడి చస్తామా? బ్రతుకు పోరాటం మానుకుంటున్నామా? బ్రతికి తీరుతాం. మేం కాకులం కానీ భీరువులం కాం... మీరూ మాలాగే పోట్లాడండి.. చావుకు భయపడి చచ్చిపోకండి. బ్రతుకు కోసం పోరాడ్డంలో చచ్చిపోయినా ఫర్వాలేదు. మిగతావాళ్లకైనా బ్రతుకు బాటలు ఏర్పడతాయి." వామపక్ష భావజాలప్రచారానికి కథా ప్రక్రియను బొల్లిముంత ఎంత చక్కగా ఆశ్రయించారో ఈ కథ 'జీవనగీత' ద్వారా అర్థం చేసుకోవచ్చు. పక్షులు, జంతువులు పాత్రలుగా మారి మాట్లాడటం, మాట్లాడే భావన కలిగించే 'యాంత్రియో మార్ఫిజమ్' శిల్ప విధానాన్ని ముసలికాకి పాత్ర ద్వారా ఈ కథలో చక్కగా ప్రయోగించారు బొల్లిముంత. కుహనా ప్రజాస్వామికవాది, భూస్వామి శ్రీరాములు దోపిడీని ముసలినక్క ఎలా తన చతురతతో ప్రతిఘటించిందో వివరించిన కథ 'చేప చెట్టెక్కింది'. 'చందమామ' లోని జానపద కథలా పాఠకులను ఆకట్టుకుంటుంది. బ్రతుకు బాటలు ఏర్పాటు చేసుకోవటానికి సంఘం పెట్టుకొని సమ్మెకట్టిన పాకీ పనివాళ్ల ధైర్యాన్ని 'సమ్మె పిలుపు' కథ వివరిస్తుంది. పాకీ

పనివాళ్ల జీవితచిత్రణ, వాళ్ల పనిలో ఉండే నికృష్టాన్ని, వాళ్ల జీవన దైన్యాన్ని, హైన్యాన్ని ఈ కథ కళ్లకు కడుతుంది. అదే బ్రతుకు బాటలో ఉద్యమించి హతుడైన సాలమన్ జీవితాన్ని చిత్రించిన కథ 'గోరీల దొడ్లో', 'హరిజనుడే మన రాజ్యం ఏలుతాడ'ని చెప్పిన గాంధీ మాటలు స్వాతంత్ర్యానంతరం ఎంత బూటకంగా, సత్యదూరంగా మారాయో ఈ కథ వివరిస్తుంది. దళితులపై సాగుతున్న దోపిడీని ఈ కథ ఆర్ధంగా చిత్రించింది. చదువుల కోసం హిందూ మతం నుండి క్రిష్టియన్ మతం స్వీకరించి మతాంతీకరణ చెంది స్వామి సాలమన్‌గా మారి తనవారికోసం ఉద్యమించటం, ఆ ఉద్యమంలో దోపిడీదారుల పక్షాన కొమ్ము గాసిన పోలీసులు సాలమన్ను హత మార్చటం ఈ కథాంశం.

మా పాపమిట్టాపండి మనుషులం మార్కెట్టులో సరుకులాగా అయిపోయాం. అంతా బేరమే. మీకు ఇష్టమైతే కొంటారు. మాకు ఇష్టమైతే అమ్ముతాం. అంతేనా?" మనిషి తన సమస్త సహజ అస్తిత్వాలను కోల్పోయి మార్కెట్ సరుగ్గా మారటాన్ని తెలుపుతున్న ఈ కథలోని మాటలు నేటికీ వాస్తవమే కదా!

"...ఇరవై ఏళ్ల స్వరాజ్య జీవనంలో కూడా కూడూ గుడ్డా లేకపోవటమే ఈ కథకి కారణాలుగా బైటపడేవి. హృదయం ఉండి ఆలోచిస్తే, ఆచరణలోకి తెస్తే, ముందు ముందు జనవరి 26 లయినా ఇట్లాంటి కథలు లేనివిగా, కనీసం కథలకి కారణాలు కానివిగా ఉండేవి. కానీ, "అయితే-గియితే"- అని మన ఆశలే తప్ప అవేవీ జరుగలేదు... యిక జరుగుతాయన్న ఆశాలేదు.." స్వాతంత్ర్యం వచ్చిన ఇరవై ఏళ్ల అనంతరం 1969లో రాసిన 'జరగని కథ కోసం'లో దేశ వాస్తవ భౌతికపరిస్థితులను పేర్కొంటూ 'మన స్వతంత్రమొక మేడిపండు, మన దరిద్రమొక రాచపుండు' అని వివరిస్తారు బొల్లిముంత. స్వాతంత్ర్యానంతరం ఆకలిచావులపై రాసిన మరోకథ 'అంతరాత్మ అంత్యక్రియలు'.

బొల్లిముంత రాసిన 'ప్రాణం వెల'ను గురించి కొంత చెప్పుకోవాల్సి ఉంది. సింహాద్రి నాగావళి నదిలో పడవతోటి జనాన్ని ఆ ఒడ్డుకు, ఈ ఒడ్డుకు చేరుస్తూ కుటుంబాన్ని పోషించుకునే శ్రమజీవి. గజ ఈతగాడు కూడా. ఒకానొక వరద సందర్భంలో పడవ నడపలేని అస్సహాయ స్థితి. ఇంట్లో ఆకలి కేకలు. షావుకారు గుర్నాథం వద్దకు నూకల కోసం వెళ్లినప్పుడు వరదకు నదిలో పైనుంచి కొట్టుకు వచ్చే కలప ఏరుకొని వస్తే దానికి డబ్బు చెల్లిస్తానంటాడు. కొద్దిగా నూకలు కొలుస్తాడు. వరద ఉధృతిలో ఉన్న నాగావళి నదిలోకి దుస్సాహసంతో దూకి అందిన కాడికి కలపను ఒడ్డుకు చేరుస్తాడు. కానీ, ప్రవాహ ప్రమాదంలో చనిపోతాడు. ఇదీ కథాంశం. బ్రతుకు తెరువుకోసం దుస్సాహసానికి దిగి ప్రాణం కోల్పోయిన సింహాద్రిని మన కళ్ల ముందు కనబడేట్టు చిత్రించారు. ఈ కథలో వేగం వరద నాగావళి అంత వేగాన్ని సంతరించుకుని ప్రవాహరీతిలో సాగుతూ పాఠకుని లో క్షణక్షణమూ ఉత్సుకతను, ఉత్కంఠను రేకెత్తిస్తుంది. తెనాలి ప్రాంతానికి చెందిన బొల్లిముంత ఉత్తరాంధ్రకు చెందిన నాగావళి నదిని, అక్కడ ఎక్కువగా వినబడే పేర్లలో ఒకటైన సింహాద్రిని ఈ కథలో చేర్చటం విశేషం. మా గోఖలే రాసిన ప్రసిద్ధమైన కథ 'బల్లకట్టు పాపయ్య'ను గుర్తుకు తెస్తుంది ఈ కథ.

## ప్రజా సంస్కృతిపై దాడులను నిరసిస్తూ...

'ఏకపుత్రులు' అందరిలాగానే అతి గారాబంగా పెరిగిన సీతారాముడులో ఆ ఊళ్లో ఏర్పడిన యువజన సంఘం ద్వారా మార్పులు చోటు చేసుకున్నాయి. సీతారాముడు కళాకారు డవుతాడు. 'ఈ నాటకం ఆడితే ప్రజలు చెడతారు. శాంతిభద్రతలు ఇరుకున పడతాయి' అనే అభియోగంతో హెడ్ కానిస్టేబుల్ సీతారాముడి బృందం ఆడే నాటకాన్ని నిషేధిస్తాడు. తన అభియోగానికి సాక్ష్యంగా "ఈ తెరలు చూడండి. లక్ష్మి గాని, సరస్వతి గాని, చివరకు మన హనుమంతుడు గానీ ఉన్నారేమో!... ఈ తబలాకి చుట్టిన గుడ్డ చూడండి ఎర్రగా" అని చూపుతాడు. ఇవి నవ్వు తెప్పించే విషయాలుగా మనకు కనపడతాయి. అదే సమయంలో పాలకపక్ష చౌకబారుతనాన్ని, డొల్లతనాన్ని చూపుతాయి. నాటక ప్రదర్శన సందర్భంలో దర్శకుడిని అరెస్ట్ చేస్తాడు హెడ్డు. తరువాత సీతారాముడి గ్రామంపై పోలీసుల దాడి. ఎక్కడెక్కణ్ణుంచో, ఎవరెవర్నో పట్టుకొచ్చి ఆ వూరి పొలిమేరలో కాలుస్తారు. సీతారాముణ్నీ పట్టుకెళ్లి దాడులు, హత్యలు ఆరోపణలపై పోలీసులు చంపుతారు. 'తెలుగు ప్రాణి' అనే ఈ కథ 1954లో ప్రచురితమైంది. అయితే అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో తెలుగు నేలమీద అనేక గ్రామాల్లో కాంగ్రెస్ పాలకపక్షం సాగించిన దారుణ మారణకాండ ను బలీయంగా చిత్రించిందీ కథ. ఈ కథ 1950 ప్రాంతాలలో ప్రజా సాహిత్య, సాంస్కృతికోద్యమాలపై ప్రభుత్వం చేసిన దాడులను, విధించిన నిషేధాలను గుర్తుకు తెస్తుంది. విశాలాంధ్ర పక్షపత్రిక, మా భూమి నాటకం, సోమసుందర్ వజ్రాయుధం కవితా సంపుటం వంటి రచనలపై నిషేధం, మా భూమి ప్రదర్శనపై, బుర్రకథ కళారూపంపై ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన నిషేధాలను కళాకారులు, రచయితలు, సంపాదకులపై దాడులు చేయటాన్ని ప్రజాస్వామిక స్వభావమున్న వారెవరూ మరచిపోలేని సత్యాలు. కమ్యూనిస్టులపై పోలీసు వ్యవస్థ సాగిస్తున్న హత్యాకాండను వివరించిన మరో కథ 'పరిశోధన'.

## అవకాశవాదాన్ని ఎండగడుతూ...

అంతవరకూ స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన జస్టిస్

పార్టీకి చెందినవారు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ జెండాలు పట్టుకొని, గాంధీ టోపీలు పెట్టుకొని 'ఏ యెండకు ఆ గొడుగు పట్టడా'న్ని, బీద ప్రజలను తమ పాత పద్ధతులలోనే దోచుకుంటున్న 'షావుకారు నారయ్య'లాంటి వారి నిజ స్వరూపాలను 'ప్రజాసేవ' కథ (1948 విశాలాంధ్ర పక్షపత్రిక) బహిర్గతం చేసింది. ఇటువంటిదే మరో కథ 'దేశం ఏం కావాలి?. "స్వాతంత్ర్య సమర యోధుడు చక్రపాణి జైలునుంచి విడుదలై స్వగ్రామం తిరిగొస్తుంటే అంతకు ముందు చక్రపాణిని స్వాతంత్ర్యోద్యమాన్ని ద్వేషించిన, నిరసించిన రౌడి వెంకయ్య, షావుకారు నారయ్య, గమళ్ళ సోములు, ప్రైవేట్ బాపినీడు, పెత్తందారు, ప్రక్కవూరు గ్రామ మునసబు వంటివారు ఎదురేగి స్వాగతమివ్వటం ద్వారా వాళ్లలో ఏర్పడ్డ అవకాశవాద తత్వాన్ని, ఆ కాలంలో నడిచిన కాంగ్రెస్ మార్కు దుష్ట సంస్కృతిని ఎండగట్టింది. ఈ కథ చక్రపాణి కలలో సాగిన ఈ కథలోని సంఘటనలను తలచుకొని 'దేశం ఏం కావాలి?" అని బొల్లిముంతతో పాటు మనమూ ఆవేదనకు గురవుతాం.

## ఎర్ర దెయ్యాలు

1950లలో తెలుగునాట తీవ్రతరమైన కమ్యూనిస్టు ఉద్యమాలు సామాన్య, కార్మిక మధ్య తరగతి, రైతాంగం, అట్టడుగు అణగారిన వర్గాలపై చూపిన తీవ్ర ప్రభావాన్ని ఎర్ర దయ్యాలు' కథలో బొల్లిముంత చిత్రీకరించారు. కమ్యూనిస్టు ఉద్యమానికి భయపడిన వాళ్లు దానిని 'ఎర్రదెయ్యం'గా 'ఎర్రభూతం'గా ఎలా నిందించారో, దుష్ప్రచారం చేశారో ఈ కథలో పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ప్రారంభంలో "యూరప్‌ను ఒక భూతం ఆవహించింది- కమ్యూనిజం అనే భూతం" అనే వాక్యాలు దర్శనమిస్తాయి. ఆ మాటల స్ఫూర్తితోనే బొల్లిముంత 'ఎర్ర దయ్యాలు' కథ రాశారని పాఠకునికి అవగతమవుతుంది.

'అంతకన్నా విషమ పరిస్థితులు రానందుకు ఆనందించండి' అన్నాడు చెకోవ్. ఈ సూత్రాన్ని మన చలనచిత్ర రంగానికి అన్వయిస్తూ 'సూక్ష్మంలో మోక్షం- నిత్యానందానికి' అనే కథ రాశారు బొల్లిముంత. ఈ కథలో ఏడ్చేవాళ్ల చేత మాత్రమే పాడిస్తున్నారనీ, చచ్చిన వాళ్ల చేత సైతం పాడించేంత సాహసానికి ఇంకా తెలుగు సినిమా రంగం దిగలేదనీ ఆనందించుదాం" అంటారు మన తెలుగు చలనచిత్ర రంగాన్ని గురించి. 1960లో చలన చిత్ర రంగంలో రచయితగా ప్రవేశించిన బొల్లిముంత తిరిగి 1969లో మద్రాసు చేరి రచయితగానే కొనసాగారు. మనుషులు మారాలి, పేదల బ్రతుకులు, ప్రజా నాయకుడు మొదలు 38 చలన చిత్రాలకు కథ, మాటలు రాసిన బొల్లిముంత ప్రభుత్వం నుండి అవార్డులతో సహా అనేక సత్కారాలు, పురస్కారాలను స్వీకరించారు. కూడబెట్టిందేమీ లేదు కీర్తి ప్రతిష్టలు తప్ప, కానీ వారసత్వంగా విలువైన సాహిత్య సంపదను మాత్రం మనకు అందించారు. అభ్యుదయ సాహిత్యోద్యమం, ప్రజా సాంస్కృతికోద్యమంలో చిరంజీవిగా మిగిలారు. మన సినిమా ఎప్పుడైతే వినోదం, విజ్ఞానం పరిధులను దాటి ప్రమాదకరస్థాయికి దిగజారిందో అప్పుడే బొల్లిముంత ఆ రంగం నుండి పూర్తిగా వైదొలిగారు. రచయితగా ఒక ఆదర్శాన్ని పాటించారు.

## రాజకీయ చైతన్యంతో...

"పెద్ద మనుషులని అనబడే వారిలో ఉండే స్వార్థం, సంకుచితత్వం, అసూయ, నైచ్యం, ద్రోహబుద్ధి- నికృష్ట మానవులనబడే వారిలో ఉండవు" అని శ్రామికవర్గ తొలి మహా రచయిత మాక్సింగోర్కీ చెప్పిన సత్యాన్ని ఆయన వారసుడైన బొల్లిముంత తన కథలలోని అణచివేతకు గురవుతున్న, కాయకష్టంపై ఆధారపడి బ్రతుకుతున్న శ్రమజీవులు, బడుగు, బలహీనవర్గాలకు చెందిన పాత్రల ద్వారా నిరూపించారు. బొల్లిముంత కథానికల్లో, గల్పికల్లో అధిక్షేపణ, వ్యంగ్యం, ప్రధానంగా కనిపిస్తాయి. గుంటూరు, తెనాలి ప్రాంత భాష ఇంపారింది. కొడవటిగంటి కుటుంబరావు ప్రయోగశీలతతో ప్రవేశపట్టిన 'గల్పిక ప్రక్రియను కొనసాగించిన రచయిత బొల్లిముంత. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కేవలం సంభాషణలతోటే కథలు రాశారు. బొల్లిముంత కూడా అదే రీతిలో 'అనాథ ప్రేత సంస్కారం' కథను నడిపారు.

రాజకీయ చైతన్యం, అనుభవ జ్ఞానంతో కమ్యూనిస్టు సూత్రాలను తన కథా సాహిత్యంలో నేరుగా ప్రవేశపెట్టిన రచయిత బొల్లిముంత. వామపక్ష భావజాల వ్యాప్తికి తోడ్పడే కథలు రాసిన బొల్లిముంత వందేళ్ల తెలుగు కథా చరిత్రలో ద్వితీయ తరానికి చెందిన ఉత్తమ రచయిత. పాసిస్టు వ్యతిరేక గీతాలు, బెంగాల్ కరువు (బుర్రకథ), రైతుబిడ్డ (హరికథ), సూక్ష్మంలో మోక్షం; అంతరాత్మ అంత్యక్రియలు (కథా సంపుటాలు); ఏ యెండకా గొడుగు, పత్రికా న్యాయం, తెలంగాణ స్వతంత్ర ఘోష, క్విట్ కాశ్మీర్, ధర్మ సంస్థాపనార్థాలను (నాటికలు); రాజకీయ గయోపాఖ్యానం, రాజకీయ కురుక్షేత్రం (పద్యనాటికలు); దొంగ దొరికింది, భలేమంచి చౌకబేరం (రేడియో నాటికలు); నేటి భారతం (మూకీ నాటిక). నగారా (నిషేధానికి గురైన పత్రిక), ప్రతిభ, ప్రగతి ప్రజాపక్షం పత్రికలకు సంపాదకత్వం వహించారు. వారి సాహిత్య సేవలను గౌరవిస్తూ అరసం-గుంటూరు జిల్లా శాఖ 1988 సెప్టెంబరులో అమరజీవి కొండేపూడి శ్రీనివాసరావు సాహితి సత్కారం గుంటూరులో అందించింది. బొల్లిముంత శివరామకృష్ణ 7 జూన్ 2005న తన జన్మభూమిలో కన్ను

మూశారు. వారి అంత్యక్రియలకు హాజరై అరసం పక్షాన శ్రద్ధాంజలి ఘటించాను.

అరసం తెనాలి శాఖ అరసం గుంటూరు జిల్లా శాఖ ప్రస్తుత అధ్యక్షులు బొల్లిముంత ప్రియ శిష్యుడు చెరుకుమల్లి సింగారావు కార్యకర్తృత్వంలో 'అమరజీవి బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ సత్కార కార్యక్రమాలను 1997 నుంచి 2009 వరకూ నిర్వహించారు. 2002లో ఈ సత్కారాన్ని నేను స్వీకరించాను. బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ తెనాలిలో సాహితీ సత్కార కార్యక్రమాలతో పాటు, నాటకోత్సవాలనూ నిర్వహిస్తూ వుంది. శతజయంతి ప్రారంభ సందర్భంలో సదస్సులు, సమావేశాలనూ నిర్వహించింది. శతజయంతి ముగింపు సందర్భంలో వారి రచనల పునర్ముద్రణలను కొనసాగిస్తోంది. జనసాహితీ వారు బొల్లిముంత మరణానంతరం వారి ముఖచిత్రం, సాహితీ విశ్లేషణలతో జులై 2005 ప్రజాసాహితీ ప్రత్యేక సంచికను వెలువరించింది. బి.ఎల్. నారాయణ రచించిన 'మార్క్సిస్టు గాంధీ బొల్లిముంత శివ రామకృష్ణ పుస్తకాన్ని కూడా బొల్లిముంత ఫౌండేషన్ నవంబర్ 2017లో ప్రచురించింది. గతంలో శివరామకృష్ణ అభినందన సంచిక కూడా తెనాలి నుంచి వెలువడింది.

**నివాళి**

"నాటికీ నేటికీ ప్రగతి, అభ్యుదయం పేరిట ప్రజావిముక్తి అంటూ లక్ష్యాన్ని విడవకుండా సాహిత్య సేవ చేస్తున్న శివరాం నిజంగా అభినందనలకు అర్హుడు... ఇలాంటివాళ్లని విస్మరిస్తే సాహిత్యం మాట అటుంచి..."దేశం ఏం కావాలి" అన్న తుమ్మల వెంకట్రామయ్య గారి మాటలతో నేనూ గళం కలుపుతూ మరో మాట చేరుస్తున్నాను.

నిబద్ధత, నిమగ్రత, నిజాయితీ, నిరాడంబరతలతో ఏడు దశాబ్దాల పాటు ప్రజా జీవితాన్ని ఆదర్శవంతంగా గడిపిన మహనీయ వ్యక్తి, లోకహితమైన జీవితాన్ని గడిపిన ఉత్తమ కమ్యూనిస్టు, ఆదర్శ అభ్యుదయ రచయిత, ప్రజా కళాకారుడు బొల్లిముంత శివరామకష్ణవారికిదే శతజయంతి నివాళి. ❑

## జాతీయ స్ఫూర్తి ప్రత్యేక ప్రకటన

### ఉచితంగా జాతీయ స్ఫూర్తి

జాతీయ స్ఫూర్తి పత్రికను ఆసక్తి గలవారందరికీ ఉచితంగా అందించాలని భావించాం. అందువల్ల ఆసక్తి గల మిత్రులందరూ తమ పోస్టల్ అడ్రసును 8500678977 నెంబరుకు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా పంపించండి.

### సంవత్సర చందాలకు స్వస్తి

ఆసక్తి గల వారందరికీ జాతీయ స్ఫూర్తి పత్రికను ఉచితంగా అందించాలని భావించినందున వార్షిక చందాల పద్ధతికి స్వస్తి చెబుతున్నాం. ఇకపై సంవత్సర చందాలు పంపవద్దని తెలియజేస్తున్నాం. గతంలో చందాదారులుగా వున్న వారికి పత్రికను పంపిస్తాం.

### విరాళాలను పంపండి

పత్రిక నిర్వహణలో వున్న వ్యయప్రయాసలు అందరికీ తెలిసినవే. ఈ పత్రిక పది కాలాలు నిలబడడానికి, ఆసక్తి గల వారందరికీ ఉచితంగా పంపించడానికి అందరి ఆర్థిక తోడ్పాటు అవసరం. మీరు నగదు రూపంలో, ప్రకటనల రూపంలో మీ విరాళాలను జాతీయస్ఫూర్తి అకౌంటుకు పంపండి. మీరు పంపిన మొత్తం వివరాలు, మీ పోస్టల్ అడ్రసులను 8500678977 నెంబరుకు మెసేజ్ / వాట్సాప్ ద్వారా తెలియచేయండి.

***NEFT లేదా RTGS పంపడానికి***
**JAATEEYA SPURTHI**
**A/c No.3620 101 0000 380**
**Syndicate Bank, Eluru Main Branch**
**IFSC Code : SYNB0003620**

***జాతీయ స్ఫూర్తి పత్రికకు మీ సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరుతున్నాము.***

ఇట్లు

**జాతీయ స్ఫూర్తి సంపాదక వర్గం**

# 'మృత్యుంజయుడు' బొల్లిముంత



డాక్టర్ దేవరాజు మహారాజు

తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమం తొలిదశలో ఉన్నప్పుడే బొల్లిముంత శివరామకృష్ణ (1920-2005) సాహిత్య సృజన ప్రారంభించారు. బాల్యంలో ఈయనపై జస్టిస్ పార్టీ ప్రభావం, త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రభావం ఎక్కువగా ఉండేది. అందుకు కారణం, వారి తండ్రి గారికి రామస్వామి చౌదరి నడిపే బ్రాహ్మణ వ్యతిరేకోద్యమంతోనూ, జస్టిస్ పార్టీతోనూ సన్నిహిత సంబంధాలుండేవి. ఆ ప్రభావం కొడుకు శివరామకృష్ణపై బాగా పడింది. త్రిపురనేని రామస్వామి చౌదరి పద్యకవిత్వం రాస్తూ ఉండేవారు. అయితే పత్రికలకు పంపేవారు కాదు. బొల్లిముంత, గోపీచంద్, పి.వి.సుబ్బారావు లాంటి కుర్రాళ్లంతా ఆయనకు శిష్యులై పోయి ఆయనలాగా పద్య కవిత్వం రాయాలని ఉబలాట పడేవాళ్లు. వీళ్ల కవిత్వాన్ని ఆయన సరిచేసి సూచనలిస్తూ ఉండేవారు. ఈలోగా గోపీచంద్ తన తండ్రి గారి పద్య కవిత్వాన్ని పక్కన పెట్టి వచనంలోకి మారారు. కథలు రాసిన పత్రికల్లో అచ్చేస్తూ ఉండేవారు. మంచి పేరు వస్తూ ఉండేది. అది చూసి శివరామకృష్ణ కూడా వచనంలోకి మారారు. తనూ కథలు రాసి పత్రికలకు పంపాలని నిశ్చయించుకున్నారు. ఫలితంగా 1936లో మద్రాసు నుంచి వెలువడే 'చిత్రాంగి' పత్రికలో తన తొలి కథ 'ఏటొద్దు' ప్రచురించారు. అప్పుడాయన వయసు పదహారేళ్లు!

## ఉద్యమాలతో మమేకం

కథలు రాసి ప్రచురించడం ప్రారంభించిన తర్వాత కొన్నేళ్ల వరకు ఆయనకు అభ్యుదయ రచయితల సంఘంతో సంబంధాలు ఏర్పడలేదు. 1938-39లో గుంటూరులో హయ్యర్ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్‌కు వెళ్లినప్పుడు అక్కడ విద్యార్థి ఉద్యమంతో, ఆ తర్వాత చదలవాడలో ఉద్యోగంలో చేరినప్పుడు కమ్యూనిస్టు ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. ఆ రోజుల్లోనే ఆయన 'దేశం ఏమయ్యేట్టు?', 'వ్యక్తి స్వాతంత్ర్యం' వంటి కథలు రాసి ప్రచురించారు. కమ్యూనిస్టు కార్యకర్తగా ఆయన తన అనుభవంలోకి వచ్చిన విషయాల్ని కథలుగా మలచడం తప్ప, పని కట్టుకుని కథలు రాయాలని రాయలేదు. వ్యవసాయ కూలీలు, ఇతర నిరుపేదలపై దృష్టి సారించి, కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రతిబింబిస్తూ రాసేవారు. ఆ రోజుల్లో చదలవాడ పిచ్చయ్య చౌదరి అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నాయకుడు. ఆయన ఇటు త్రిపురనేని రామస్వామి చౌదరి, అటు కృష్ణశాస్త్రి లాంటి వారందర్ని కలుపుకుని అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని ముందుకు తీసుకెళ్తూ ఉండేవారు. 1943లో తెనాలిలో అరసం తొలి మహాసభ జరపడంలో పిచ్చయ్య చౌదరి కృషి ఎంతో ఉంది. ఆ సభకు అధ్యక్షులు తాపీ ధర్మారావు. బొల్లిముంత శివరామకృష్ణ అప్పటికి ఇరవై మూడేళ్ల యువకుడు. ఆ మహాసభకు కార్యకర్తగా పనిచేశారు.

## మృత్యుంజయుడు నవల

అవి కమ్యూనిస్టు ఉద్యమం ఉధృతమైన రోజులు. బొల్లిముంత 1945లో టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తి సమయం పార్టీకి అంకితం చేశారు. పార్టీ పనుల మీద తిరుగుతూ, మునగాల పరిగణాలోని జగ్గయ్యపేటకు వెళ్లి రావడం జరుగుతూ ఉండేది. అక్కడే తెలంగాణా పోరాటం గురించి వినడం, అందిన రిపోర్టులు చదువుకోవడం, విషయాలు తెలుసుకోవడం జరుగుతూ ఉండేది. వాటితో ఉత్తేజితుడైన బొల్లిముంత ఇరవై ఏడేళ్ల వయసులో 'మృత్యుంజయులు' నవల రాశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన 1946-51 మధ్య అర్ధ దశాబ్ద కాలం పాటు తెలంగాణ రైతులు సాయుధులై దోపిడి వర్గాలపై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటులో కవులు, రచయితలు, కళాకారులు, ఎంతో మంది భాగస్వాములయ్యారు. యాదగిరి, సుద్దాల, తిరునగిరి, నాజర్, సుంకర, వాసిరెడ్డి, కాళోజి, దాశరథి, కుందుర్తి, సోమసుందర్, గంగినేని వంటి కవులు తమ అక్షరాయుధాలతో ముందు నిలిచారు. తెలంగాణ పోరాటం ప్రారంభమైన ఒక సంవత్సరానికి బొల్లిముంత 'మృత్యుంజయులు' నవల 1947 అక్టోబర్ 25న విడుదల చేశారు. ఒక రకంగా కవులకంటే కూడా తన నవలాయుధంతో ఆయన ముందు నిలిచారు. ఆ తర్వాత గంగినేని 'ఎర్రజెండాలు', వట్టి కోట 'ప్రజల మనిషి', 'గంగు'; 'మహీధర రామ్మోహనరావు' 'ఓనమాలు', 'మృత్యునీడల్లో', 'తిరునగిరి' 'సంగం' వంటి నవలలు వెలువడ్డాయి. అయితే అవన్నీ పోరాటం విరమించిన తర్వాత వెలువడ్డాయి. పోరాట విరమణకు ముందు, బొల్లిముంత నవల తర్వాత వెలువడింది లక్ష్మీకాంత మోహన్ 'సింహగర్జన'.

దేశంలోని ఇతర ప్రాంతాల్లో రైతులు పంటలు పండించు కున్నందుకు శిస్తులు కడతారు. కాని, నాటి తెలంగాణాలో శిస్తులు కట్టడానికి మాత్రమే పంటలు పండించాల్సి వచ్చేది. ఆ దుర్భర

స్థితిని సహజంగా చిత్రించింది 'మృత్యుంజయులు' నవల. చచ్చేవాడికి రెండు చావులు ఉండవని, దినదిన గండంగా ప్రతిరోజూ చస్తూ బతకడం కన్నా భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం పోరాటంలో చావడమే మేలని జెండా పట్టి పోరాటంలో నేలకొరిగిన వీరులే ఈ మృత్యుంజయులు. నవలలోని ముఖ్య పాత్రలన్నీ పోరాటంలో మరణిస్తాయి. అంటే, వీరమరణం పొందుతాయి. నవలా రచయిత దృష్టిలో వారంతా చావును జయించిన వారు, మృత్యుంజయులు అని అర్థం! తెలంగాణా పోరాట కాలంలో వెలువడిన తొలి నవలగా, ఒక చారిత్రక అవసరాన్ని గుర్తించి, ప్రజాపోరాటాన్ని నమోదు చేసిన నవలగా తెలుగు సాహిత్యంలో మృత్యుంజయులుకు సుస్థిర స్థానం ఉంటుంది. నాటి కమ్యూనిస్టు నాయకులు చంద్రం ఈ నవలను బొల్లిముంతతో ఆరుసార్లు తిరగరాయించారట! రావి నారాయణ రెడ్డి ఈ నవలకు ముందుమాట రాశారు.

## సినీ రచయితగా ...

కమ్యూనిస్టు పార్టీ చీలిపోక ముందే 1964లో ఆత్రేయ ప్రోత్సాహంతో బొల్లిముంత శివరామకృష్ణ ఆయనకు సహాయకుడిగా మద్రాసు వెళ్లారు. మొదట్లో తమిళ సినిమాలకు అనువాదాలు చేస్తుండేవారు. ఆత్రేయ స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించిన, 'వాగ్దానం'కు బొల్లిముంత తొలిసారి స్వయంగా మాటలు రాశారు. 'తిరుపతమ్మ కథ'కు సంభాషణలు రాసే సరికి ఆ కళలో మరింత పట్టు సాధించారు. ఆ రకంగా 'మనుషులు మారాలి' చిత్రం సంభాషణలతో పెద్ద హిట్టయ్యింది. దాంతో, బొల్లిముంత మద్రాసులో స్థిరపడాల్సివచ్చింది. సుమారు 45 సినిమాలకు సంభాషణలు రాశారు. మధ్యలో కొన్ని పాటలు కూడా రాశారు. 'కాలం మారింది'కి రాష్ట్ర ప్రభుత్వం అవార్డు, 'నిమజ్జనం'కు జాతీయ అవార్డు లభించాయి.

"రచనలు అభూత కల్పనల వైపుకాక, జీవిత వాస్తవాల వైపు సాగాలి. సమస్యలు చర్చించాలి. పరిష్కారాలను సూచించాలి. యువ రచయితలకి సరైన మార్గం నిర్దేశించాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది." అని తరచూ చెబుతూ ఉండేవారు బొల్లిముంత శివరామకృష్ణ. వారితో నా పరిచయం చాలా సాదాసీదాగా జరిగింది. అది 1993-97 మధ్య కాలం. ఓ రోజు ఓ కుర్రాడొచ్చి "మా పెద్దనాన్న వస్తానన్నారు. ఇంట్లో ఉంటున్నారా?" అని అడిగాడు. ఎవరో సాహిత్యాభిమాని అయి ఉంటాడనుకుని 'సరే తీసుకురా... ఉంటా'నన్నాను. తీరా చూస్తే ఆయన సాహితీ దిగ్గజం బొల్లిముంత శివరామృష్ణ! అప్పటికే 70 ఏళ్ల పెద్దాయన. అభ్యుదయ నవలా రచయితగా, 'మనుషులు మారాలి' చిత్ర రచయితగా పెద్దపేరు సంపాదించుకున్నారాయన. ఆయనకు నాపై ఏర్పడిన వాత్సల్యపూరిత అభిమానానికి కృతజ్ఞతలతో వినమ్రంగా నమస్కరించి కూర్చోబెట్టాను. తీసుకొచ్చిన కుర్రాడి ఇంటి పేరు కూడా బొల్లిముంత అన్న విషయం మరిచిపోయాను. ఎందుకంటే, అతన్ని మా ఇంట్లో రమణ అని పిలుస్తుండేవాళ్లం. అతనే కవి బొల్లిముంత వెంకట రమణారావుగా రూపుదిద్దుకున్నాడు. అది ఆ తర్వాతి విషయం, శివరామకృష్ణ వాళ్లబ్బాయి హైద్రాబాదు విశాలాంధ్ర ప్రచురణాలయంలో పనిచేస్తుండేవాడు. అందువల్ల ఆయన తెనాలి నుంచి ఎప్పుడు కొడుకు దగ్గరకు హైద్రాబాదొచ్చినా మా ఇంటికి వస్తుండేవాడు. నేను దగ్గరలో ఉన్న దండమూడి మహీధర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం లైబ్రేరియన్ రాజు, రేడియో చిరంజీవి మొదలైన వాళ్లకు కబురు పెడుతుండేవాడిని. ఓ సారి మా ఇంట్లో, మరోసారి సుందరయ్య పార్కులో కూర్చుని సాహిత్యం గురించి మాట్లాడుకుంటూ ఉండేవాళ్లం. ఒక్కోసారి ఆయనకు ఓపిక ఉందంటే చిక్కడపల్లి నుంచి అలా హిమాయత్ నగర్ దాకా వెళ్తుండే వాళ్లం. డా॥ ఏటుకూరి ప్రసాదో, బూదరాజు రాధాకృష్ణో ఎవరో ఒకరు కలుస్తుండే వాళ్లు. మళ్లా ముచ్చట్లు.. గజ్జెల మల్లారెడ్డి కొంతకాలం చిక్కడపల్లిలో ఉన్నారు. అప్పుడు అదో మీటింగ్ ప్లేస్! తండ్రి వయసున్న పెద్దవాళ్లతో ఈయనకు ఈ స్నేహాలేమిటని నన్ను చూసి కొందరు ఆశ్చర్యపోతుండేవాళ్లు.

## సంపాదకత్వం

ఆ రోజుల్లోనే బొల్లిముంత 'ప్రజాపక్షం' అనే మాసపత్రికకు సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించారు. తెలుగు అకాడమీ పక్కన డా॥ మిత్ర ఉండే వీధిలో పత్రిక ఆఫీసు కూడా ఏర్పాటు చేశారు. పత్రిక ప్రారంభోత్సవం త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ప్రారంభ సంచికలో తెలంగాణ ప్రజల భాషలో నేను ఒక కవిత రాశాను. అయితే పత్రిక కొన్ని నెలలు మాత్రమే నడిచింది. ఆ తరువాత ఆయన మళ్లీ తెనాలి వెళ్లిపోయారు. మేం మళ్లీ కలుసుకునే అవకాశం రాలేదు. ఆయన 7 జూన్ 2005న మరణించారని తెలుసుకుని బాధపడ్డాం. ఆ మరుసటి నెల జులై 2005 సంచికను 'ప్రజాసాహితి' బొల్లిముంత శివరామకృష్ణ సంస్మరణలో వెలువరించింది. ఉపాధ్యాయుడిగా, ఉద్యమకారుడిగా, అరసం నేతగా, కమ్యూనిస్టు కార్యకర్తగా, నవలా రచయితగా, సినీ రచయితగా, సంపాదకుడిగా బహుముఖ ప్రతిభను కనబరిచిన బొల్లిముంత శివరామకృష్ణ సాహిత్య ప్రపంచంలో మృత్యుంజయుడిగా నిలిచారు. ❑

# సాహితీ మృత్యుంజయుడు బొల్లిముంత

ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
సీనియర్ పాత్రికేయులు



రాజకీయ రంగంలోనే కాదు, సాహిత్య రంగంలోని అవకాశవాదాన్ని, తిరోగమన విధానాలను అనేక సందర్భాల్లో బొల్లిముంత శివరామకృష్ణయ్య నిర్ద్వంద్వంగా ఖండించారు. ఆయన అభ్యుదయ సాహిత్యోద్యమంలోనూ, ప్రజా నాట్యమండలి సాంస్కృతికోద్యమంలోనూ క్రియాశీలంగా కొనసాగారు. నిగర్వి, నిరాడంబరజీవితం గడిపిన ఉదాత్త మానవుడు, నమ్మిన సిద్ధాంతాల పట్ల జీవితాంతం నిబద్ధత కలిగిన ఉత్తమ మానవతావాది బొల్లిముంత జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం నేటి తరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం.



'మనిషి జీవితం అతని చైతన్యాన్ని నిర్ణయిస్తుంది సామాజిక అస్తిత్వం-సామాజిక చైతన్యాన్ని ప్రభావితం చేస్తుంది' అన్న దృక్పథంతో రచనలు చేసిన అగ్రశ్రేణి అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణయ్య. ఉపాధ్యాయుడు, హార్మోనిస్టు, నటుడు, గాయకుడు, కవి, కథారచయిత, నవలాకారుడు, బుర్రకథా రచయిత, హరికథా రచయిత, జర్నలిస్టు, సినిమా రచయిత, అభ్యుదయ రచయితల సంఘం నాయకుడు, రాజకీయ కార్యకర్త, ఉత్తమ కమ్యూనిస్టు బొల్లిముంత.

1920 నవంబరు 27వ తేదీన గుంటూరు జిల్లా వేమూరు మండలం, చదలవాడలో శ్రీమతి మంగమ్మ-, శ్రీ అక్కయ్య దంపతులకు పుట్టిన శివరామకృష్ణయ్య ప్రాథమిక, మాధ్యమిక విద్య తమ స్వగ్రామంలో కొనసాగించి, గుంటూరులో హయ్యర్‌గ్రేడ్ శిక్షణ పూర్తి చేశారు. సంస్కృతాన్ని, సంగీతాన్ని స్వయంకృషితో నేర్చుకున్నారు. చదలవాడలో ఆయన తండ్రి నెలకొల్పిన పాఠశాలలో కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల పిల్లలకు విద్యాబోధన చేశారు. బొల్లిముంత 16వ ఏట రచించిన 'ఏటొడ్డు' కథ 'చిత్రాంగి' పత్రికలో అచ్చయ్యింది. అది ఆయన తొలిరచన. నూనూగు మీసాల నూత్న యవ్వనవేళ త్రిపురనేని రామస్వామి చౌదరి హేతువాద భావజాలంతో ప్రభావితులయ్యారు.

త్రిపురనేని గోపీచంద్‌తో ఏర్పడిన స్నేహం బొల్లిముంత జీవితాన్ని మలుపు తిప్పింది. తమ జీవితలక్ష్యం నిర్ణయించుకోవలసిన దశలో మార్క్సిస్టు సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేశారు. తమ గ్రామస్థితిగతులు, రైతుల, వ్యవసాయకూలీల దుర్భర జీవితాలు పరిశీలించారు. వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేయడం మొదలుపెట్టారు. కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలతో ఎక్కువగా మమేకమయ్యారు. చల్లపల్లి జమీందారుగా వ్యతిరేకంగా సాగిన భూపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, బానిసత్వ విముక్తి కోసం హైదరాబాద్ సంస్థానంలో జరుగుతున్న రైతాంగ సాయుధ పోరాట ఉదంతాలను పత్రికలలో చదివి, స్పందించి 1947లోనే 'మృత్యుంజయులు' నవల రాశారు. తెలంగాణా విమోచనోద్యమ నవలల్లో ఇదే తొలి నవల. నిజాం నిరంకుశత్వానికీ, భూస్వాముల దౌర్జన్యాలకూ వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణాలర్పించిన అమరవీరులను మృత్యుంజయులుగా చిత్రించారు.

పోలీసుచర్య తరువాత నెహ్రూ ప్రభుత్వం కమ్యూనిస్టులపై క్రూర నిర్బంధకాండను అమలు జరిపిన కాలంలో అజ్ఞాతవాసంలో ఉంటూనే గుంటూరు నుంచి 'నగారా' పత్రికను నడిపారు. ఆనాటి నెహ్రూ ప్రభుత్వం స్వదేశంలో కమ్యూనిస్టులపై దారుణమైన నిర్బంధకాండను, ఊచకోతను ప్రయోగిస్తూ, మరోవైపు విదేశీవ్యవహారాలలో సోషలిస్టు శిబిరంతో స్నేహ సంబంధాల కోసం అర్రులు చాచే ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ బొల్లిముంత 'మొదళ్ళు నరికి చివుళ్ళకు నీరు పోస్తానంటాడు పండిట్ నెహ్రూ' అనే వ్యాసం రాశారు. రాజకీయ రంగంలోనే కాదు, సాహిత్య రంగంలోని అవకాశవాదాన్ని, తిరోగమన విధానాలను అనేక సందర్భాల్లో నిర్ద్వంద్వంగా ఖండించారు. 1943 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో తెనాలిలో జరిగిన ప్రథమాంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మహాసభల నిర్వహణలో

క్రియాశీలంగా పాల్గొన్నారు. అభ్యుదయ సాహిత్యోద్యమంలో భాగస్వామిగా ఉంటూనే, కొడవటిగంటి కుటుంబరావు రాసిన ‘పిల్లి’ కథను ‘నగారా’ పత్రికలో తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక రచనలు అచ్చువుతున్నాయని ఆ పత్రికను ప్రభుత్వం నిషేధించింది.

ప్రజలను చైతన్యపరచడానికి బొల్లిముంత శివరామకృష్ణయ్య అనేక సాహిత్య ప్రక్రియలనూ, ప్రజా కళారూపాలను సుసంపన్నం చేశారు. బెంగాల్ కరువుపై బుర్రకథ రాశారు. రైతుల జీవన స్థితిగతులను వివరిస్తూ ‘రైతుబిడ్డ’ హరికథ రచించారు. బొల్లిముంత కథలు–‘సూక్ష్మంలో మోక్షం’, ‘అంతరాత్మ అంత్యక్రియలు’, ‘శివరామకృష్ణ కథలు’ సంపుటాలుగా వెలువడ్డాయి. 1940–50 దశకాల తెలుగు ప్రాంతాల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలను చిత్రిస్తూ ‘ఏ ఎండకా గొడుగు’, ‘పత్రికా న్యాయం’, ‘తెలంగాణా స్వతంత్ర ఘోష’, ‘క్విట్ కాశ్మీర్’, ‘ధర్మ సంస్థాపనార్థాయ’ మొదలైన నాటికలు రచించారు. ‘దొంగ దొరికింది’, ‘బలే మంచి చౌకబేరం’ రేడియో నాటికలు రాశారు. ‘నేటి భారతం’ పేరుతో మూకీ నాటికను రూపొందించారు.

‘ప్రజాశక్తి’ పత్రికలో శివరామకృష్ణ రచించిన ‘దేశం ఏం కావాలి’ కథ విశేష జనాదరణ సంపాదించింది. 1955 మధ్యంతర ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ పరాజయంతో నిస్పృహ చెందిన బొల్లిముంత క్రమంగా ప్రజారంగాన్ని వదిలి 1960లో మద్రాసు సినిమా రంగంలోకి ప్రవేశించారు. ఆచార్య ఆత్రేయకు ఘోస్ట్ రైటర్‌గా ‘కలిసి ఉంటే కలదు సుఖం’, ‘కలిమిలేములు’ మొదలైన అనేక చిత్రాలకు సంభాషణలు రాశారు. ఆత్రేయ దర్శకత్వంలో రూపొందిన ‘వాగ్దానం’ చిత్రానికి సహరచయితగా తెరపైకెక్కారు. నాటి నుంచి బి.ఎస్.నారాయణ దర్శకత్వం వహించిన చిత్రాలన్నింటికీ బొల్లిముంత సంభాషణలు రచించారు.

1967లో తిరిగి తెనాలి వచ్చేశారు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. అదే సంవత్సరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బందరు స్థానం నుంచి సిపిఐ అభ్యర్థిగా బొల్లిముంతను పార్టీ నిలబెట్టింది. మోటూరి హనుమంతరావు సిపిఎం అభ్యర్థి. హోరాహోరీగా జరిగిన దాయాది పోరులో ఉభయ కమ్యూనిస్టులను ఓడించి, చల్లపల్లి జమిందార్ విజయం సాధించాడు.

1968లో ‘విశాలాంధ్ర విజ్ఞాన సమితి’ వారి ‘ప్రతిభ’ సచిత్ర వారపత్రికలో బొల్లిముంత సహాయ సంపాదకుడిగా చేరారు. 1969లో వి.మధుసూదనరావు పిలుపుతో తిరిగి మద్రాసు బాటపట్టారు. ‘మనుషులు మారాలి’ సినిమాకు కథ, సంభాషణలు సమకూర్చారు. ఆ చిత్రం వందరోజులు ఆడింది. అప్పటి నుంచి వీరమాచినేని (విక్టరీ) మధుసూదనరావు దర్శకత్వం వహించిన అత్యధిక భాగం సినిమాలకు బొల్లిముంత గారే సంభాషణా రచయిత. క్రమంగా కథకూ, సంభాషణలకూ, సందేశాలకూ ప్రాధాన్యత తగ్గిపోయి, నాయక ప్రాధాన్య చిత్రాల హోరు ప్రారంభమయ్యాక శివరాం మౌనంగా సినిమా రంగం నుండి నిష్క్రమించి, స్వగ్రామం చదలవాడకు చేరుకున్నారు.

1943లో తెనాలిలో జరిగిన ‘అరసం’ మొదటి మహాసభల్లో కార్యకర్తగా పాల్గొన్న శివరామకృష్ణయ్య అభ్యుదయ సాహిత్యోద్యమంలోనూ, ప్రజా నాట్యమండలి సాంస్కృతికోద్యమంలోనూ క్రియాశీలంగా కొనసాగారు. ఆయన సారథ్యంలోనే తెనాలిలో అరసం స్వర్ణోత్సవాలు (1994), వజ్రోత్సవాలు (2004) ఘనంగా జరిగాయి. 1988 అక్టోబర్ 8, 9 తేదీలలో భీమవరంలో జరిగిన అభ్యుదయ రచయితల సంఘం 10వ రాష్ట్ర మహాసభల్లో బొల్లిముంత అరసం ప్రధాన కార్యదర్శిగా, నేను కార్యదర్శిగా ఎన్నికయ్యాం. 1992లో గుంటూరులో జరిగిన అరసం 11వ రాష్ట్ర మహాసభల్లో ప్రధాన కార్యదర్శి బాధ్యతలను బొల్లిముంత శివరామకృష్ణయ్య నుంచి నేను స్వీకరించాను. పెనుగొండ లక్ష్మీనారాయణ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

బొల్లిముంత ఆదర్శాలను కొనసాగిస్తున్న ప్రగతిశీల రచయితలను సముచిత రీతిలో గౌరవించడానికి తెనాలి సాహితీమిత్రులు బొల్లిముంత బతికున్నప్పుడే, ఆ మహారచయిత పేరిట ‘బొల్లిముంత సాహితీ పురస్కారం’ నెలకొల్పారు. ఈ పురస్కారం పొందిన వారిలో హితశ్రీ, పి. దక్షిణామూర్తి, వెలగా వెంకటప్పయ్య, నగ్నముని, ఎం.డి.సౌజన్య, కె.శివారెడ్డి, పరుచూరి సోదరులు, బి.నరసింగరావు, వంగపండు ప్రసాదరావు, గణేశ్ పాత్రో, సి.రాఘవాచారితో పాటు ఈ వ్యాస రచయిత కూడా ఉన్నారు.

85 సంవత్సరాల పరిపూర్ణమైన సామాజిక, సాహిత్య, రాజకీయ జీవితం గడిపిన బొల్లిముంత శివరామకృష్ణయ్య 2005 జూన్ 7న అస్తమించారు. నిగర్వి, నిరాడంబర జీవితం గడిపిన ఉదాత్త మానవుడు, నమ్మిన సిద్ధాంతాల పట్ల జీవితాంతం నిబద్ధత కలిగిన ఉత్తమ మానవతావాది బొల్లిముంత జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం నేటి తరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయం. ❑

(బొల్లిముంత శివరామకృష్ణయ్య శతజయంతి సందర్భంగా)

# అక్షరాల అభ్యుదయ రచయిత బొల్లిముంత



మందలపర్తి కిషోర్

"మార్పు మరోసారి పకపకనవ్వింది
నింగి నల్లబడి, చల్లబడింది
ఎక్కడా ఒక్క చుక్కయినా మిలమిలలాడ్డం లేదు!
కానీ, కళ్ళు మసకబారని వాళ్ళ చూపు
ఆకాశంలోని మరో ధ్రువతారపై నిలబడివుంది
సత్యం నిలకడగా నిలిచే వుంటుంది!"

అవును!! సత్యం నిలకడగా నిలబడే వుంటుంది– అయితే, ఎల్లకాలాల్లోనూ చెలామణీ కాగల శాశ్వతసత్యం అంటూ వుండదు! ఏ యుగానికి తగిన సత్యాన్ని ఆ సమాజం ఎప్పటికప్పుడు వెతుక్కుంటుంది; కనుక్కుంటుంది! ఆయా యుగాల్లో ఆ సత్యాన్ని సుస్పష్టంగా పలికినవాళ్ళు విశిష్టతను సంపాదించుకుంటారు. అమెరికన్ కవయిత్రి ఎడిత్ వార్టన్ రాసిన ఈ కవిత సారాంశమిదే!

దాదాపు యాభై యేళ్ళ కిందట మా వూరు, తాడేపల్లి గూడెంలో జరిగిన ఓ రాజకీయ పాఠశాలలో ప్రదర్శించిన "యుగే యుగే...." నాటకం చూశాను నేను. అప్పటికి నాకు పధ్నాలుగేళ్ళు. ఆ నాటకం చెప్పే సారాంశం కూడా, వార్టన్ కవితలో చెప్పినదే!! మొదట్లో, భగవద్గీతలో చెప్పిన పాటలిజమే –అభ్యుదయ పరిభాషలో ప్రబోధించిందేమో ఈ నాటకం అనిపించింది నాకు! కానీ, మానవ మనస్తత్వంలోని సామాన్యమయిన ఓ విషయాన్నే రచయిత, అత్యధికులకు సుపరిచితమయిన ప్రతీకల ద్వారా చెప్పినట్లు గ్రహించడానికి కొంత కాలం పట్టింది. అప్పుడు, సదరు రచయిత ఎవరనే వెతుకులాట మొదలుపెట్టాను. ఆయన పేరు బొల్లిముంత శివరామకృష్ణ అనీ, కమ్యూనిస్టు పార్టీ, ప్రజానాట్య మండలి కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న వారనీ తెలిసింది. అప్పట్లో సంచలనం సృష్టించిన 'మనుషులు మారాలి', 'కాలం మారింది', ప్రజానాయకుడు' లాంటి సినిమాలకు బొల్లిముంత గారే కథ –చిత్రానువాదం– మాటలు వగయిరా రాశారనీ విన్నాను. ఆ సినిమాలొచ్చి అప్పటికెంతో కాలం కాకపోవడం వల్ల బొల్లిముంత గారి గురించిన వివరాలు సేకరించడం సులువయింది. ఆయన మా నాన్నగారు –ఎంవిఎస్ కపర్దీకి సన్నిహిత మిత్రులేననీ తెలుసుకోగలిగాను.

## ప్రత్యక్షం - పరోక్షం!

నిజానికి, అప్పటికే బొల్లిముంత గారితో పరోక్ష పరిచయం ఉంది. మద్దుకూరి చంద్రశేఖరరావు గారి సంపాదకత్వంలో వెలువడిన 'ప్రతిభ'లోనో, ముక్కామల నాగభూషణంగారి సంపాదకత్వంలో వచ్చిన 'ప్రగతి'లోనో బొల్లిముంత ప్రశ్నలకు జవాబులిచ్చేవారు. అశోక్ అనే పాఠకుడు బొల్లిముంత గారిని రెచ్చగొట్టేలా ఓ ప్రశ్న లాంటిది వేశాడు. "చిల్లిముంతలో ఏమీ మిగలనట్లే బొల్లిముంతలో కూడా సరుకు నిలవదేమో?" అన్నది ప్రశ్న. "పేరులో ఏముందిలెండి – మీ పేరు అశోక్ అయినంత మాత్రాన మీరెప్పుడూ ఏడవలేదంటారా??" – బొల్లిముంత జవాబు!! యాభయ్యేళ్ళు కావస్తున్నా గుర్తుండిపోయిన, బొల్లిముంత చమక్కు యిది!

ఆ మరుసటి సంవత్సరమే, 1973లో, బొల్లిముంత గారిని హైదరాబాద్ అభ్యుదయ రచయితల సంఘం ఆఫీసులోనే కలిశాను! మా గురువులు రాంభట్ల, మల్లారెడ్డిగార్లు బొల్లిముంత గారికి చిరకాల మిత్రులు. సాదాసీదా చెక్కబల్లల మీద కూర్చుని వాళ్ళంతా గంటల తరబడి సత్కాలక్షేపం చేయడం విశేషమే మరి! వాళ్ళందరి అభిమాన 'రసం' అధిక్షేపమే కావడం కాకతాళీయం కాదు. దాన్ని పరస్పరం ఉదారంగా పంచి పెట్టుకోవడం కూడా కద్దు! వామపక్ష ఉద్యమాల్లో నిబద్ధిగా పనిచేసిన వాళ్ళందరికీ అలవోకగా పట్టుబడేది ఈ అధిక్షేప రసమే! 1980 దశకంలో – నేను జర్నలిజంలో ప్రవేశించిన కొంతకాలం తర్వాత బొల్లిముంత శివరామకృష్ణ 'ఆంధ్రభూమి' ఆఫీసుకి వచ్చేవారు. గజ్జెల మల్లారెడ్డి ఆ పత్రికకి సంపాదకులు. అందులో 'సాలభంజిక' పేరుతో బొల్లిముంత ఓ కాలమ్ రాసేవారు. అందులోనూ – ఆనాటి ముఖ్యమంత్రిపై – అధిక్షేపం పొంగి పొర్లుతుండేది. అయితే, బొల్లిముంత కేవలం అధిక్షేపానికే పీటవేసి, మిగిలిన మనోభావాల పట్ల వలపక్షం చూపించిన రచయిత కాకపోవడం ఆయన విశిష్టతను ఇనుమడింప చేస్తుంది. దాదాపు దశాబ్ద కాలం సినిమా రంగంలో నిలదొక్కుకుని, తనదంటూ సొంతముద్ర వేయగలిగిన కొద్దిమంది సినిమా రచయితల్లో బొల్లిముంత ఒకరు. ఆయన అలా నిలవగలగడానికి ఈ సామర్థ్యమే కారణమయివుంటుంది. ఏటెల్ల కాలం సినిమా రంగాన్ని పట్టుకుని వేలాడకుండా, తన

అభిరుచి, వైశిష్ట్యం గౌరవానికి నోచుకున్నంత కాలమే ఆ రంగంలో ఉన్నారాయన. డయలాగ్ పూర్తి కాగానే ఫోకస్ లోంచి తప్పుకునే క్రమశిక్షణ కలిగిన నటుడిలా హుందాగా ప్రవర్తించి సాటివాళ్ళ నుంచి గౌరవాదరాలు అందుకున్నారు.

## మృత్యుంజయులు శివరాం

తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా వెలువడిన తొలి నవలను – 1947లోనే – రాసింది ఆ ప్రాంతానికి చెందిన రచయిత కారు! ఆ విశిష్టత దక్కించుకున్నది బొల్లిముంత. 'మృత్యుంజయులు' పేరిట వెలువడిన ఈ నవలలో కథనం సూటిగానూ, సంఘటనలు సజీవంగానూ, శైలి సరళంగానూ ఉండి ఉద్యమ సాహిత్యానికి నిర్వచన ప్రాయంగా శివరాం చేతుల్లో రూపుదిద్దుకుంది. దశాబ్దాల తరబడి తెలుగు పాఠకులు చదువుకున్న 'ఉద్యమ సాహిత్యం' మనకు చాలా అరుదు. ఆ కోవకు చెందిన రచనే 'మృత్యుంజయులు. తెలంగాణ ప్రాంతంలో ఆనాటికి రచయితలు లేరనీ కాదు – వాళ్ళప్పటికింకా కలం పట్టలేదనీ కాదు! అప్పటికే దాశరథి, వట్టికోట, పొట్లపల్లి, కాళోజీ తదితరులు ఆంధ్ర ప్రాంతంలో కూడా గుర్తింపు సంపాదించుకున్న మాట వాస్తవం. 1943లోనే తెనాలిలో జరిగిన ఆంధ్ర అభ్యుదయ రచయితల తొలి మహాసభలకు తెలంగాణ ప్రతినిధులు హాజరయిన సంగతి చరిత్రకెక్కినదే కదా!! అలాగే, తీరాంధ్ర ప్రాంతానికి చెందిన మహీధర, తుమ్మల, కుందుర్తి, తెన్నేటి సూరి, సోమసుందర్, ఆరుద్ర తదితరులు తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా రచనలు చేసి వున్నారు. వాళ్ళందరూ అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో ధ్రువతారలుగా వెలిగినవాళ్ళే కావడం కాకతాళీయం కాదు! ఆనాటి 'ఆంధ్ర' ఉనికిలో తెలుగు జాతి మొత్తంగా ఇమిడివున్న వాస్తవాన్ని బలంగా రుజువుచేశారు ఆ తరం అభ్యుదయ రచయితలు. ఒక్క 'మృత్యుంజయులు' నవల్లోనే కాదు– ఎన్నో ఏళ్ళ తర్వాత బొల్లిముంత రాసిన 'ప్రాణం వెల' లాంటి పెద్ద కథల్లో కూడా ప్రాంతీయతను అధిగమించిన అభ్యుదయ రచయితే మనకి కనిపిస్తాడు. ఎక్కడో ఉత్తరాంధ్ర అంచుల్లో నాగావళి తీరంలో నివసించే నావికుడు సింహాద్రి కథ అది. ఆయన రాసిన ఇతర కథానికలు, గల్పికలూ కూడా ఇదే చారిత్రిక వాస్తవానికి అద్దం పడతాయి.

## మోగింది 'నగారా'

బొల్లిముంత శివరామకృష్ణ జర్నలిస్టు జీవితంలో ప్రముఖమయిన అధ్యాయం బహుశా 'నగారా సంపాదకత్వమే కావచ్చు. కారుమంచి వెంకటేశ్వరరావు నడిపించిన ఈ పత్రిక ప్రధానంగా అభ్యుదయ – వామపక్ష భావజాలాన్ని వ్యాప్తి చేసింది. వేములపల్లి శ్రీకృష్ణ, బొల్లిముంత తదితరులు నగారా మోత దశదిశలా వ్యాపింప చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. గుంటూరు జిల్లా వరకూ అది 'అనధికార పార్టీ పత్రిక సదా సంపాదించుకుంది! అప్పట్లో అదే హోదాతో పని చేస్తూ, మద్రాసు నుంచి వస్తూవుండిన 'విశాలాంధ్ర' మాస, పక్ష పత్రికల్లో కూడా బొల్లిముంత తరచు రాస్తూండేవారు. ఆ పత్రికకి సంపాదకులుగా ఉండే సెట్టి ఈశ్వరరావు బొల్లిముంతకు సన్నిహిత మిత్రులే! ఇలాంటి మరికొన్ని పత్రికల్లో కూడా శివరాం రచనలు అచ్చవుతూ వుండేవి. కృష్ణా గుంటూరు జిల్లాల్లో కమ్యూనిస్టు భావాలతో రెండు చేతులతోనూ రాస్తూండిన రచయితలు అప్పట్లో చాలామందే వుండేవారు. 1955 ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఇటువంటి రచయితలు చప్పగా చల్లారిపోవడం తెలిసిన విషయమే. బొల్లిముంత మాత్రం అలా జావకారిపోలేదు– అంతకు పూర్వం మాదిరిగానే ఆ తర్వాత కూడా రచనలు చేస్తూనే పోవడం ఆయన మరో విశిష్టత.

అయితే, బొల్లిముంత కథలూ గల్పికల వాసి ఎక్కువగానే వున్నప్పటికీ రాసి చాలా తక్కువనే చెప్పాలి. పెనుగొండ లక్ష్మీ నారాయణ తీసిన ఒక లెక్క ప్రకారం, 1948–69 సంవత్సరాల మధ్యకాలంలో బొల్లిముంత 30 కథలు– గల్పికలు మాత్రమే రాశారు! పిసినారితనానికి దగ్గరగా ఉన్న పొదుపరితనం శివరాం గారిది! పత్రికల రంగానికి శివరాంగారు మరి కొంత సమయాన్నీ, శక్తి సామర్థ్యాలనూ కేటాయించగలిగివుంటే మరింత బావుండేదని నా సొంత అభిప్రాయం!!

పశ్చిమ గోదావరి జిల్లాతో బొల్లిముంత శివరాం బాంధవ్యం గురించి ప్రత్యేకించి చెప్పుకోవలసివుంది. ప్రజానాట్యమండలికి పెద్ద దిక్కుగా వుంటూ పశ్చిమగోదావరి జిల్లాకు తరచు వస్తూ వుండేవారు బొల్లిముంత. అప్పట్లో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉండిన "రక్తకన్నీరు" నాగభూషణం కూడా బొల్లిముంతతో కలిసి ఈ పర్యటనల్లో పాల్గొనేవారు. ఈ పెద్దలు ఇద్దరిలోనూ కొట్టొచ్చినట్టు కనబడేది, వాళ్ళ ఆలోచనల్లోని స్పష్టత! 1985లో, తాడేపల్లిగూడెంలో, జరిగిన 'కపర్దీ నాటకోత్సవాలు సందర్భంగా బొల్లిముంత–నాగభూషణం ద్వయం రావడం, మా అందరితో కలుపుగోలుగా మెలగడం మర్చిపోలేని విషయాలు. సరళమయిన వ్యక్తిత్వంతో, తెచ్చుకోలు గాంభీర్యం ప్రదర్శించ కుండా హుందాగా వ్యవహరించడం బొల్లిముంత శివరామకృష్ణ సహజ లక్షణం. అలాంటి మనుషులు అరుదయిపోతున్న రోజులివి! ❑

# దారి చూపించే రచన



**కె. రామచంద్రమూర్తి**
సీనియర్ పాత్రికేయులు

కాదేదీ కవితకనర్హం అన్న మహాకవి శ్రీశ్రీ వాక్కులను ఆచరించి లోకంలోని సమస్తవస్తువులపైన మధురమైన తెలుగులో చేసిన వ్యాఖ్యానాల సంపుటి 'ముత్యాలమాల.' 'విశాలాంధ్ర' దినపత్రిక సంపాదకులు ముత్యాల ప్రసాద్ 2015 జనవరి ఒకటిన ప్రారంభించి 2019 చివరి వరకూ రాసిన సంపాదకీయ వ్యాసాల సమాహారం ఇది. 'విశాలాంధ్ర' భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వాణి. ఆ పత్రిక సంపాదకుడిగా, సోషలిస్టు భావజాలానికి నిబద్ధుడైన రచయితగా ప్రసాద్ నిత్యం పాఠకులకు ఎదురయ్యే సన్నివేశాలనూ, సందర్భాలనూ, సమాజంలో సంభవించే పరిణామాలనూ పురస్కరించుకొని అన్ని రకాల అభిరుచులు కలిగిన పాఠకుల హృదయాలనూ హత్తుకునే విధంగా జాను తెలుగులో విశ్లేషణ చేశారు. చిన్నచిన్న వాక్యాలతో, కవితాత్మకమైన పదబంధాలతో, సులభగ్రాహ్యమైన రీతిలో సాగిన అందమైన వచనం విధిగా, అనాయాసంగా, ఆసక్తికరంగా చదివిస్తుంది. ఐదేళ్ళ పాటు సాగిన రచనలన్నీ కలిపి చూస్తే ఒకే తాడుతో దాదాపు వందపూలు కట్టిన మనోహరమైన మాలికలాగా శోభాయమానంగా కనిపిస్తాయి. ఉపనిషత్తులూ, శంకరభాష్యం, భజగోవిందం, రామాయణ, భాగవత, భారతాలూ, శతకాలూ, ఇతర అనేక గ్రంథాల ప్రస్తావన ముత్యాలవారి భాష్యానికి రసరమ్యత జోడించింది. శ్రీనాథుడు, పోతన, చేమకూర వెంకట కవి, చిలకమర్తి, పానుగంటి, మొక్కపాటి, చింతాదీక్షితులు, మునిమానిక్యం, భమిడిపాటి వంటి ప్రసిద్ధ కవులూ, రచయితలూ, గురజాడ, వీరేశలింగం పంతులు వంటి వైతాళికుల ఆలోచనామతం ప్రతి వాక్యాన్నీ అజరామరం చేస్తుంది.

కమ్యూనిస్టు రచయితకు అనివార్యమైన ప్రత్యేకశైలిలో సాగిన భాష కొట్టవచ్చినట్టు కనిపించినప్పటికీ కమ్యూనిస్టులు కాని వారి చేత సైతం పుస్తకాన్ని పక్కనపెట్టకుండా చదివించే బలమైన శక్తి ప్రసాద్ పదవిన్యాసంలో ఉంది. లోగడ గజ్జెల మల్లారెడ్డి, బూదరాజు రాధాకృష్ణ వంటి చేయితిరిగిన రచయితల స్థాయికి ఏ మాత్రం తీసిపోకుండా అక్షరవిన్యాసం చేశారు ప్రసాద్. 'జన జీవితాల్లో విషం కక్కుతున్న కార్పొరేట్ కాలనాగుల పీడ విరగడయ్యే పోరాటం, తాత్విక, సాహిత్య, రాజకీయార్థిక, చలనశీలత, ఉద్యమాచరణను రక్తగతం చేసుకున్న ఎర్రవాడ బెజవాడలో జాతీయ సీపీఐ 25వ మహాసభ శంఖం పూరించి వామపక్ష ఐక్యత, పునరేకీకరణ కోసం గుండెగొంతుకలతో చేసిన శపథం' రచయితను ఉత్తేజపరచడం సహజం. అక్టోబర్ విప్లవం అజేయం అంటూ చాటుతారు. మార్క్స్ ఎప్పటికీచిరంజీవే అంటూ నిర్ధారిస్తారు. మార్క్సిస్టు తాత్వికత పైన విశ్వాసం ప్రకటిస్తారు. సర్దార్ సరోవర్ దగ్గర ఆరొందల అడుగుల ఎత్తున నిలిచిన సర్దార్‌పటేల్ విగ్రహాన్ని విషాద విగ్రహంగా (స్టాట్యూ ఆఫ్ సారో) గా అభివర్ణిస్తారు. 'విశాలాంధ్ర' వార్షికోత్సవం సందర్భంగా కూడా అంతే నిబద్ధతతో రాశారు. శాస్త్రీయదక్పథాన్ని ప్రజలు అలవరచుకోవాలని చెబుతారు. 'సాహిత్యం-సమాజం' శీర్షికతో వెలువరించిన వ్యాసంలో సమాజం గురించీ, పరిణామం గురించీ రచయితలు శాస్త్రీయ దృష్టి అలవరచుకోవాలని చెబుతూ వాస్తవికతే మానవుడు, మానవుడే వాస్తవికత అని ఉద్ఘాటిస్తారు. 'మీ ఇష్టం.. ఈ ధాత్రిని చేయవచ్చు స్వర్గంగా, చీల్చవచ్చు నరకంగా, ఏం చేస్తారో... ఇక మీ ఇష్టం,' అన్న శ్రీశ్రీ చిరస్మరణీయమైన పంక్తులను జ్ఞాపకం చేస్తారు. అటువంటి సందర్భాలలో పార్టీ పంథాకు నిబద్ధత ప్రకటిస్తానే తక్కిన సమయాలలో సర్వసాధారణమైన అంశాలపైన అసాధారణమైన లోచూపు ప్రసాదించేందుకు చేసిన ప్రయత్నం అభినందనీయం. ఈ పుస్తకంలోని వ్యాసాలకు పెట్టిన శీర్షికలు సైతం క్లుప్తంగా, ఆలోచనాత్మకంగా, హృద్యంగా ఉన్నాయి. వివాహం-మహాభాగ్యం, బాల్యం-చట్టం, జ్ఞాపకం-మరుపు, మనిషి-జిజ్ఞాస, అమ్మ-అమృతం, ఉల్లిపోటు-ఓట్లకాపు, ఊహ-వద్ధి, ఆకలి-ఆహారం,

---

**విశాలాంధ్ర సంపాదకులు**

## ముత్యాల ప్రసాద్‌కు నివాళి



**విశాలాంధ్ర సంపాదకులు, మాకు మిత్రులు ముత్యాల ప్రసాద్ గారి అకాల మరణానికి జాతీయ స్ఫూర్తి సంపాదక వర్గం తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నది.**

**తనదైన ముద్ర గల ఆయన సంపాదకీయాలు "ముత్యాల కోవ" పుస్తక రూపం ధరిస్తున్న వేళ జరిగిన విషాదం ఇది. ఆయనకు నివాళిగా "ముత్యాల కోవ" పుస్తకానికి పరిచయాలు రాసిన ప్రముఖుల వ్యాసాలను పాఠకులకు అందిస్తున్నాం**

**- సంపాదకవర్గం**

---

భాష–భవిత, వెలుగు–వేడుక, పొగాకు–పగాకు, నాదం–గీతం వంటి శీర్షికలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

సామ్యవాదాన్నీ, లౌకికవాదాన్నీ త్రికరణశుద్ధిగా అభిలషించే రచయితగా ప్రతి వ్యాసాన్నీ హితోపదేశంతో ముగిస్తారు. పాఠకుడిని మంచి చేయడానికి ప్రేరేపించే గుణం ఈ రచనలలో దండిగా ఉంది. 'తనకోపమె తన శత్రువు' అంటూ శతకకారుడిని ఉటంకిస్తూనే అదే విషయాన్ని అమెరికా రచయిత డాలె కార్నెగై ఎట్లా చెప్పాడో కూడా తెలియజేస్తారు. రచయిత విస్తృతమైన అధ్యయనం చేసి సముపార్జించుకున్న జ్ఞానసంపదను సందర్భానుసారంగా పాఠకులకు అందించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది. పండుగలూ, పబ్బాలూ వచ్చినప్పుడు వాటిని సామ్యవాద, లౌకికవాదకోణాల నుంచి ఎట్లా వీక్షించాలో చెప్పే రచనలు చేయడం ప్రసాద్ ప్రత్యేకత. దీపావళిపైన వ్యాసం రాస్తూ 'ఈ చీకటిని తరిమేద్దాం' అంటూ ఉద్బోధించడం, సమభావనకు పునాది ఉగాది కావాలన్న (ఒక కవి ఆవేదన వెలిబుచ్చినట్టు 'ఈ ఉగాది దగాది' అంటూ నిందించడం, నిర్వేదం ప్రకటించడం ఇందులో కనిపించదు) ఆశాభావం, పోరాటశీలం చదువరులను ఉత్తేజపర్చుతాయి. కులజాడ్యంపైన విమర్శను ఎక్కు పెట్టి జాషువా వాక్యాలను గుర్తు చేస్తారు. 'మీరేమిట్లు?' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో 'నా కవితావధూటి వదనమ్మును ఎగాదిగ చూసి రూపరేఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళి అన్నవారె–నీదే కులము అన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోతున్నారు,' అంటూ జాషువా మనస్తాపం వెలిబుచ్చిన సంగతి తెలిపారు. పోరాటమే మార్గం అంటూ ప్రబోధిస్తారు. జీవితమంటే శాశ్వత సంఘర్షణ, ఈ జీవన పోరాటానికి మనిషి నిత్యం సన్నద్ధంగా ఉండాలంటూ ఉద్బోధిస్తారు. 'అమ్మా క్షమించు,' 'అమ్మ–శ్రమ,' 'అమ్మ–అమృతం,' శీర్షికలతో అన్నిటికీ మూలం అమ్మేనంటూ చాటారు. అమ్మే సత్యం అంటూ, అమ్మ పాలు అమృతం అంటూ, అమ్మ అంటే ప్రేమకు ఆది, అంతం అంటూ గుండెలకు తాకే విధంగా రాశారు. ప్రకృతి పట్ల ప్రేమ, నిబద్ధత ప్రకటిస్తూ రాసిన సంపాదకీయాలూ పాఠకులను ప్రకృతిప్రేమికులుగా మార్చివేస్తాయి.

ప్రముఖులు పరమపదించినప్పుడు రచయిత రాసిన వాక్యాలు గుండెలను పిండుతాయి. కన్నీరు పెట్టిస్తాయి. ఈ పుస్తకంలో తప్పనిసరిగా చదవాల్సిన రచనలు కీర్తిశేషులైనవారికి రచయిత సమర్పించిన నివాళులు. వేదాలను సామాన్యపాఠకులకు అందుబాటులోకి తెచ్చిన మహారచయిత దాశరథి రంగాచార్యకు అక్షరాంజలి ఈ సంపుటి ప్రథమ వ్యాసం. 'ఆయుధాలు వదిలిన చేతితో అక్షరసేద్యం చేపట్టి తెలంగాణ సామాజిక స్వరూపాన్ని క్రమబద్ధంగా నవలీకరించిన ఏకైక రచయితగా దాశరథిని అభివర్ణించడం ముమ్మాటికీ సమంజసం. 'ఒక నక్షత్రలోకంలో మహాప్రకాశవంతమైన తార రాలిందన్నా, ఒక స్వరసాగరతరంగం మూగవోయిందన్నా, ఒక మేరువు విరిగిందన్నా, సంగీతగోళం ఒరిగిందన్నా– ఏ ఉపమానమూ సంపూర్ణసంగీతవిద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ అస్తమయానికి సరిపోదు అన్నారు. ఇటీవల తనువు చాలించిన పూర్వ సంపాదకులూ, మార్క్సిస్టు మేధావి చక్రవర్తి రాఘవాచారికి అంతే ఉన్నతంగా నివాళి అర్పించారు. ఫిడెల్ కాస్ట్రో భౌతికంగా ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించినప్పుడు ఆయనను నవశకానికి చిహ్నంగా నిలిచిన 20వ శతాబ్దపు యోధుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ సోషలిజం రూపశిల్పికీ, విశ్వజన హృదయనేతకూ విశాలాంధ్ర రెడ్ సెల్యూట్ ఇది అంటూ ముగించారు. 'అజేయునికి తుది వీడ్కోలు'అంటూ మరో సంపాదకీయం కాస్ట్రోపైన వెలువరించారు. సి.నారాయణరెడ్డి అస్తమించినప్పుడు 'తెలుగు సాహిత్యంపై చెరగని సంతకం' అంటూ శ్రద్ధాంజలి ఘటించారు. విశ్వ రహస్యాలను ప్రపంచానికి చెప్పిన విశ్వజ్ఞాని హాకింగ్ మరణించినప్పుడూ కదిలించే సంపాదకీయం రాశారు. ప్రఖ్యాత కథకుడు పెద్దిభొట్ల సుబ్బరామయ్య మరణించినప్పుడు 'అస్తమించిన తెలుగు కథా సూర్యుడు' అంటూ నివాళి అర్పించారు. సుబ్బరామయ్య మాస్టారు నిగర్విగా, అజాతశత్రువుగా, నిరాడంబరుడుగా, గొప్ప మానవతావాదిగా జీవించారు అంటూ కీర్తించారు. పీడిత తాడిత జనం జీవనవ్యథలను వెండితెరపై దృశ్యమానం చేసిన మాదాల రంగారావు మరణించినప్పుడు 'అరుణతారకు అరుణాంజలి' ఘటించారు. అదే విధంగా మాజీప్రధాని అటల్ బిహారీ వాజపేయి జీవనయానం ముగిసిన సందర్భంలోనూ సైద్ధాంతిక విభేదాలను ప్రస్తావిస్తూనే ఆయన ఉన్నత వ్యక్తిత్వానికి నమస్కారం చేశారు. గాంధీ 150 జయంత్యుత్సవాలను పురస్కరించుకొని 'ఓ మహాత్మా, ఓ మహర్షీ' అంటూ ఆయన గుణగణాలను స్మరించారు.

ఈ పుస్తకం యువతీయువకులు తప్పనిసరిగా చదవాలి. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన ప్రేరణలూ, ఉద్దీపనలూ అనేకం లభిస్తాయి. వ్యక్తిత్వం, మానవనైజం, స్నేహం, చొరవ, సమష్టి తత్వం, సంకల్పం, ఆత్మవిశ్వాసం, నవ్వే జీవనాడి, నోరు మంచిదైతే.., మనిషి–జిజ్ఞాస, ఊహ–వద్ధి తదితర శీర్షికలతో వెలువడిన సంపాదక వ్యాసాలు వ్యక్తిత్వవికాసానికి సోపానాలు. ఇందులో ఉన్న అక్షరాలను మనసుకు ఎక్కించుకున్నవారు మంచి పౌరులుగా, ప్రగతిశీలురుగా, ఆశావాదులుగా, పరోపకారులుగా, కార్యశూరులుగా ఎదుగుతారనడంలో ఎటువంటి సందేహంలేదు. గొప్ప ఆశయాలతో సమాజహితం కోసం సమ్యక్ దృష్టితో అకుంఠిత దీక్షతో విలువలకు అంకితమై అక్షరయాత్ర సాగిస్తున్నందుకూ, పాఠకులకు బాట చూపిస్తున్నందుకూ మిత్రులు ముత్యాల ప్రసాద్ గారిని మనసారా అభినందిస్తున్నాను. ❑

# అక్షర ప్రేమికుడి ముత్యాల కోవ

ఆర్వీ రామారావు
విశాలాంధ్ర సంపాదకులు



పత్రిక కొనేవారెవరూ ఆసాంతం చదవరు. తమకు కావల్సింది చదివేసి పక్కన పడేస్తారు. పత్రిక మొత్తం చదవాలంటే రెండు కారణాలు ఉండాలి. డబ్బు పెట్టి కొన్నాం గనక ప్రతి పైసా గిట్టుబాటు చేసుకోవాలంటే అంతా చదవాల్సిందే అనుకోవడం మొదటి కారణం. మరే పనీ లేనప్పుడు పత్రికను అనేక సార్లు అన్ని పేజీలూ తిరగేసి మొత్తం చదివే ఓపిక ఉన్నవారు కావడం రెండో కారణం. సగటు పాఠకులు సంపాదకీయం చదవడం చాలా తక్కువ. ఉబుసుపోక కోసం సంపాదకీయమూ చదివే అవకాశం లేకపోలేదు. ఇలాంటి స్థితిలో సంపాదకీయం చదివే వాళ్లు ఎంత మంది ఉంటారు? వెయ్యికి ఇద్దరు కూడా ఉండరని ఏదో సర్వేలో తేలిందట. అనన్య సామాన్య ప్రచారమో, అత్యధిక సర్క్యులేషనో ఉన్న పత్రికలలో సంపాదకీయం చదివే వారు ఈ దామాషా ప్రకారం చూస్తే ఇంకా తక్కువే ఉంటారు.

వార పత్రికలు, పక్ష పత్రికల్లో సంపాదకీయానికి అంత విలువ ఇవ్వరనేది వాస్తవం. మాస పత్రికల సంపాదకీయాలలో కాస్త ఎక్కువ కాలం సజీవంగా ఉండే అంశాలను ఎన్నుకుంటారు. అయినా ప్రతి దినపత్రికా సంపాదకీయం ప్రచురిస్తూనే ఉంటుంది. తెలుగు దినపత్రికల్లో సాధారణంగా ఒక సంపాదకీయమే ఉంటోంది. కొన్ని దినపత్రికలు రోజూ రెండేసి సంపాదకీయాలు రాసిన సందర్భాలూ ఉన్నాయి. ఆనవాయితీ మాత్రం ఒక సంపాదకీయం రాయడమే. సంపాదకీయమే కాదు సంపాదకీయ పేజీయే లేని పత్రికలు కూడా ఈ మధ్య కనిపిస్తున్నాయి.

సామాన్య పాఠకులలో సంపాదకుడే సంపాదకీయం రాస్తాడన్న అభిప్రాయం ఒకటుంది. అది ఒకప్పటి మాట. గతంలో కూడా సంపాదక స్థానంలో లేని వారు సంపాదకీయాలు రాసే సంప్రదాయం ఉంది.

టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ టైమ్స్ లాంటి కొన్ని ఇంగ్లీషు దినపత్రికలు ప్రతిరోజూ మూడు సంపాదకీయాలు ప్రచురిస్తాయి. మూడు సంపాదకీయాలు సంపాదకుడే రాయడం అసాధ్యం. అందువల్ల సంపాదకీయాలు రాసే వారు ఉంటారు. ఆ పత్రిక స్థాయిని బట్టి వారు ఎక్కువ మంది కూడా ఉండొచ్చు. వారిని లీడర్ రైటర్ అంటారు.

మూడేసి సంపాదకీయాలు ప్రచురించే పత్రికలు మొదటి సంపాదకీయాన్ని సమకాలీన రాజకీయాలు, వర్తమాన అంశాల మీద వ్యాఖ్యానించడానికి వినియోగించుకుంటున్నాయి. రెండో సంపాదకీయానికి రాజకీయాలు, ఇతర సామాజిక అంశాల మీద వ్యాఖ్యానించడానికి ఉపయోగించుకుంటున్నారు. మూడో సంపాదకీయం రాజకీయేతర, సమకాలీనేతర, కాస్త సరదా శైలిలో రాస్తున్నారు. సాధారణంగా పత్రికలలో ఆదివారం సంపాదకీయం ఉండదు. ఇప్పుడు చాలా తెలుగు పత్రికలు ఆదివారం సంపాదకీయం రాసి సోమవారం ఆ పేజీని సాహిత్య సంచికలుగా మలుస్తున్నాయి.

తెలుగు సంపాదకుల్లో ప్రసిద్ధులైన కొందరు కేవలం సంపాదకీయ రచనకే పరిమితమయ్యే వారు. వారికి పత్రికలోని ఇతర వ్యవహారాలతో అట్టే సంబంధం ఉండకపోవచ్చు. ఎర్రలైట్లు వేసుకుని ఆపసోపాలు పడి సాయంత్రానికి చెమటలు కక్కుతూ సంపాదకీయం పూర్తి అయిందనిపించిన సంపాదకులూ లేక పోలేదు. కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం గారు సంపాదకీయం రాయడం అంటే కాలకృత్యాలు తీర్చుకోవడం అని చమత్కరించే వారు. దీన్ని బట్టి సంపాదకులకే సంపాదకీయంపై ఉన్న వైఖరి ఏమిటో అర్థం అవుతోంది.

సంపాదకీయం కూడా పాఠకుల చేత చదివించడానికి పాటుపడ్డ వారూ ఉన్నారు. ఆంధ్రభూమి దిన పత్రిక గోరా శాస్త్రి సంపాదకీయం కోసమే చదివిన వారున్నారు. ఆ క్రమంలో తెలుగులో ఆదివారం సంపాదకీయాలు రాసే పద్ధతి వచ్చింది. దీనికి శ్రీకారం చుట్టిన వారు నార్ల వెంకటేశ్వరరావు. నార్ల మంచి చదువరి. ఆయన చదివిన తాజా పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఆదివారం సంపాదకీయం రాసే ఒరవడి పెట్టారు. రాంభట్ల ఈనాడులో దాదాపు నాలుగేళ్లు ఆదివారం సంపాదకీయాలు రాశారు. ఆయన సాహిత్యాన్ని ఆలంబనగా చేసుకుని సమకాలీన రాజకీయాలకు ముడిపెట్టి ఆదివారం సంపాదకీయాలు రాసే వారు. మామూలుగా ఊహకందని అంశాల మీదా రాంభట్ల ఇలాంటి సంపాదకీయాలు రాశారు. అది ఒక రాజకీయాంశాన్ని సాహిత్య దృక్కోణం నుంచి వ్యాఖ్యానించడమూ కావచ్చు,

వినాయకుడికి మూషికం ఎందుకు వాహనం అయిందో అన్న ప్రశ్నకు శాస్త్రీయ దృష్టితో వివరణ ఇవ్వడమూ కావచ్చు.

ఆ తరవాత ఉదయం సంపాదకులుగా ఉన్న ఏ.బీ.కే. ప్రసాద్ ఆదివారం సంపాదకీయాలు రాశారు. ఆంధ్ర భూమి, ఆంధ్ర ప్రభ పత్రికల్లో కూడా ఆయన ఈ రకం సంపాదకీయాలు కొనసాగించారు. ఏ.బీ.కే. వాటిని సాహిత్యకీయాలు అన్నారు. నార్ల లాగే ఆయన కూడా చదివిన తాజా పుస్తకాన్ని పరిచయం చేయడానికి ఆదివారం సంపాదకీయాల్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. నార్ల, ఏ.బీ.కే. చేసింది గ్రంథ సమీక్షలు కాకుండా మంచి పుస్తకాలను పాఠకులకు పరిచయం చేయడానికే ఆదివారం సంపాదకీయాలను ఉపయోగించుకున్నారు.

1991 ఆఖరులో ప్రారంభించి రెండు దఫాలుగా నేనూ ఆదివారం సంపాదకీయాలు రాశాను. నేను కవిత్వాన్ని ఆశ్రయించి సమకాలీన రాజకీయాల మీద వ్యాఖ్యానించడానికి ఆదివారం సంపాదకీయాలను వాడుకున్నాను. ఈనాడులో ఇప్పటికీ ఆదివారం సంపాదకీయాల ఒరవడి కొనసాగుతూనే ఉంది.

విశాలాంధ్ర ప్రస్తుత సంపాదకుడు, మిత్రుడు ముత్యాల ప్రసాద్ 2015 నుంచి ఆదివారం సంపాదకీయాలు రాస్తున్నారు. వాటిని గ్రంథస్థం చేయాలని సంకల్పించారు. ముత్యాల ప్రసాద్ అనుసరించింది మరో భిన్నమైన పద్ధతి. ఆయన ఆదివారం సంపాదకీయాల్లో రాజకీయాల ప్రస్తావన తక్కువ.

ప్రసాద్ ఆదివారం సంపాదకీయాల్లో విభిన్నమైన వచన రచనా విన్యాసం కనిపిస్తుంది. అడపా దడపా రాజకీయ అంశాల మీద రాసినా ఆయన ఊనిక సాహిత్యాంశాలను ఉటంకించడం, తన శైలీ విన్యాసాన్ని ప్రదర్శించడమే. అతి సామాన్యమైన "చీరలలో రకాలు" అన్న అంశం తీసుకున్నా ప్రసాద్ తన శైలికి భంగం కలగనివ్వలేదు. వార్తలు రాయడానికి వాడే భాష సులభంగా, సూటిగా ఉండాలన్నది పత్రికా రచనలో ప్రధాన నియమం. కానీ సంపాదకీయ పేజీల్లో ప్రచురించే వ్యాసాలలో, ఫీచర్లు రాయడానికి వార్తలు రాయడానికి వినియోగించే శైలి కాకుండా భిన్నమైనశైలిని వాడడం అన్ని పత్రికలలోనూ కనిపిస్తుంది. సంపాదకీయ రచనకు కొంత ఉదాత్త శైలి వినియోగించడం చూస్తూనే ఉన్నాం.

ప్రసాద్ రాతల్లో కొట్టొచ్చినట్టు కనిపించేది తెలుగు భాష సహజత్వాన్ని కాపాడడం. చిన్న వాక్యాలే తెలుగుకు సహజమే కాక అందాన్నిస్తాయని ఆయన మరోసారి నిరూపించారు. సంపాదకీయానికి అనువైన విషయం సమాజ గమన క్రమంలోనే ఉంటుంది. విషయం కోసం సంపాదకీయ రచయితలు అంతగా కష్టపడవలసిన పని లేదు. ఆ విషయాన్ని ఎలా చెప్పాలో తెలిస్తే చాలు. పండగల పుట్టు పూర్వోత్తరాలు, ప్రముఖుల నిర్యాణాలు, సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న పరిణామాలు, రాజకీయ ఆకాంక్షల, కర్తవ్యాల వ్యక్తీకరణ మొదలైన అనేకానేకానేక అంశాలు ముత్యాల ప్రసాద్ ఆదివారం సంపాదకీయాలకు ముడి సరుకైనాయి. విశిష్ట పద్ధతిలో విషయాన్ని వివరించడంలోనే ఆయన ప్రత్యేకత ఉంది.

వామపక్షాలు చీలికలు వాలికలు కావడం ఎంత వాస్తవమో వామపక్షాలు ఐక్యమైతే ఈ దేశ పరిస్థితి మరోలా ఉండేది అన్న భావన వివిధ వామపక్ష పార్టీల అనుయాయులకే కాదు వామపక్ష రాజకీయాలను ఈసడించే వారిలోనూ ఉంది. వామపక్ష ఉద్యమం శక్తే ఇది. వామపక్షాలు అధికారంలోకి వస్తే సహించని వారూ వామపక్షాలు అస్తిత్వంలో ఉండాలనీ అప్పుడే పాలక వర్గాల ఆగడాలను కట్టడి చేయడం సాధ్యం అనీ అంటుంటారు. ఈ భావాన్నే ప్రసాద్ "అరుణా రుణ మహోదయం" లో వ్యక్తం చేశారు. "భిన్న మార్గాలుగా చీలిపోయి శత్రువును శక్తిమంతుణ్ని చేసిన భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఈ మాటలు పాఠాలు కావాలి" అని నిర్మొహమాటంగా చెప్పగల చేవా ప్రసాద్‌కు ఉంది. శ్రీశ్రీని ఉటంకిస్తూ "ఉద్యమాలు పరాజయం పొందవచ్చు/తాత్కాలిక పరాజయం/ఆఖరి సంగ్రామంలో/అరుణారుణ మహోదయం" తప్పదు అని సంపాదకీయానికి ముక్తాయింపు పలకడంలో ముత్యాలప్రసాద్‌లో ఎంతటి ఆశావాదం ఉందో గమనించవచ్చు.

"జ్ఞాపకం – మరపు" అన్న సంపాదకీయంలో "అరిస్టాటిల్ నుంచి రినైజాన్స్ (పునర్వికాసం) యుగం దాకా మనం మేధావులుగా గుర్తించిన వారందరూ 'తల' లేని మేధావులె అంటే ఆశ్చర్యంగా ఉందా!" అని ప్రశ్నించి "నిజమే వారందరూ తల (మెదడు)కు గాక హృదయానికి ప్రాధాన్యాత ఇచ్చారు" అని చెప్పగలగడం ప్రసాద్‌లో ఉన్న చమత్కార ప్రియత్వానికి నిదర్శనం. తల్లి పాల ఆవశ్యకతను నొక్కి చెప్పడానికి కాళీదాసు కుమార సంభవం నుంచి చలం దాకా అనేక మంది చెప్పిన ఆణిముత్యాల లాంటి మాటలను పోగు వేయగలిగిన ఓపిక ప్రసాద్ విశిష్టత. దేశభక్తి–ముస్లింలు, ఉల్లిపోటు–ఓట్ల –వేటు నుంచి గురజాడ–వెలుగు జాడ, పండగలు–పరమార్థం దాకా నిత్య జీవితంలోని అనేక అంశాలను తన రచనా కౌశలాన్ని వినియోగించి సగటు పాఠకుడూ సంపాదకీయం చదవాల్సిన తప్పని పరిస్థితిని ప్రసాద్ కలిగించాడు.

☞ మిగతా 20వ పేజీలో

# కార్పొరేట్ మీడియా కపట నాటకం



డి.పాపారావు
ఆర్థిక విశ్లేషకులు

దేశరాజధాని ఢిల్లీ చుట్టు ముట్టు రైతుల ఆందోళన 13వ రోజుకు చేరింది. కేంద్రం ఆమోదించిన 3 వ్యవసాయ బిల్లులనూ, విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర పెద్దలకు రైతులకు ఇప్పటికే రెండు దఫాల చర్చలు జరిగాయి. అయితే, రైతులు ఈ చట్టాల రద్దుకు మినహా మరి దేనికీ ఒప్పుకోమంటూ , దృఢంగా నిలబడడంతో – చర్చలు ఫలించలేదు.

కాగా, ఇక్కడ ఒక ప్రధాన ప్రశ్న ఈ అంశంలో మీడియా పాత్ర. దీనికి సంబంధించి రైతులు, ప్రజానీకంలోని పెద్ద వర్గం ఇప్పటికే ఆగ్రహంలో ఉన్నారు. స్థూలంగా, కోటి మందికి పైగా రైతులు పాల్గొంటున్నారని చెబుతోన్న ఈ ఆందోళనను – మీడియా తగిన మేరకు కవర్ చేయడం లేదనేది నిజం. ఈ నేపధ్యంలోనే కొన్ని ఆంగ్ల పత్రికల పాత్రను ఇక్కడ చూడవచ్చు. ఉదాహరణకు ఒక ఆంగ్ల భాషా వాణిజ్య పత్రిక ప్రకారంగా – ఈ ఆందోళనలో ప్రధాన భాగస్వాములు పంజాబ్ రైతులే... కాకుంటే హర్యానా రైతులు కూడా... వీరు దేశంలోని ఇతర రాష్ట్రాల రైతుల కంటే “సుసంపన్నం”గా ఉన్నారట. అంటే, వీరు ప్రభుత్వాల చేత అతిగా గారాబం చేయబడుతున్నారంటూ ఆ పత్రిక వారిని నిందించింది. అందుకే ఆ రాష్ట్రాల రైతులు చిన్న విషయాలకు కూడా నిరసనలకు దిగుతున్నారంటూ అదే పత్రిక సెలవిచ్చింది. మించి, ఈ రైతులు “సుభిక్షం”గా ఉండటం – ఇతర రాష్ట్రాల వారి రైతు సోదరుల కడగండ్లకు కారణం అంటూ పరోక్షంగా ఆరోపించింది !

అయితే రైతు వ్యతిరేక, ఉదారవాద సంస్కరణల అనుకూల ఈ నిందారోపణల వెనుకన ఉన్న అసలు సత్యం ఏమిటి ? కొంచెం పాత గణాంకాలే అయినా 2013 జనవరి – డిసెంబర్ తాలూకు దేశంలోని వివిధ రాష్ట్రాల రైతు కుటుంబాల సగటు ఆదాయాలను చూద్దాం. ఈ ఆదాయం నెలవారి, పంజాబ్‌లో 18,059 వేల రూపాయలుగా ఉంది. హర్యానాలో ఈ నెలవారి ఆదాయం 14,434 రూపాయలు, కాగా దేశంలోని పేద రాష్ట్రాలు అయిన బీహార్‌లో 3,558 రూపాయలు గాను, ఉత్తర్‌ప్రదేశ్‌లో 4701 రూపాయలుగాను జార్ఖండ్‌లో 4721 రూపాయలు గాను ఉత్తరాఖండ్‌లో 4923 రూపాయలుగాను పశ్చిమ బెంగాల్లో 3980 రూపాయలు గాను ఉంది. అంటే దేశంలోని అత్యధిక పేద రాష్ట్రాల రైతు కుటుంబాల నెలవారి సగటు ఆదాయం 5000 రూపాయల లోపుగానే ఉంది. దేశవ్యాప్తంగా సగటు రైతు కుటుంబాల ఆదాయం చూస్తే అది ఈ 2013లో 6426 రూపాయలుగా ఉంది. ఇక ఈ ఆదాయాలు 2018 – 2019 అంచనాల ప్రకారం వివిధ రాష్ట్రాలలో సగటున 10329 రూపాయలుగా ఉన్నాయి. కాగా ఇక్కడ గమనించవలసినది ఇది రైతు కుటుంబ మొత్తం తాలూకు ఆదాయం. అంటే సాధారణ అంచనాల ప్రకారం సగటు కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉన్నట్లుగా లెక్కిస్తారు. అత్యధిక చిన్న , సన్నకారు, మధ్య తరహా రైతాంగ కుటుంబాల్లో – దరిదాపు కుటుంబ సభ్యులంతా తమ బ్రతుకు తెరువైన సాగుబడిలో పాలుపంచుకుంటారు.

ఇక మరో ప్రక్కన ఈ పరిస్థితిని, నగర ప్రాంతాల కార్మికుల, ఉద్యోగుల పరిస్థితితో పోల్చి చూద్దాం. ఇక్కడ, “2019 వేతన చట్టం” ప్రకారంగా దేశవ్యాప్తంగా కనీస వేతనం రోజువారీ 178 రూపాయలుగా ఉండాలి. ఇది తలసరి సగటు అనే విషయం మనం మరువరాదు. అంటే కుటుంబ సభ్యులలోని ఇద్దరు గనుక కూలి పని చేస్తే దొరికేది రోజుకు సుమారుగా 356 రూపాయలు ఇది నెలకు 10700 రూపాయల మేరకు ఆదాయంగా ఉంటుంది. అయితే, కనీసవేతనంగా ఈ 178 రూపాయలని నిర్ణయించడానికి వ్యతిరేకంగానే బలమైన వాదనలు ఉన్నాయి. నిజానికి కార్మిక మంత్రిత్వశాఖ తాలూకు అత్యున్నత ప్యానల్ సిఫార్సు ప్రకారమే ఈ కనీస వేతనం రోజుకు తలకు 375 రూపాయలుగా ఉండాలి. మరో ప్రక్కన ఏడవ కేంద్ర వేతన సంఘం లెక్కల మేరకు న్యాయబద్ధమైన రోజువారీ వేతనం కనీసం 700 రూపాయలుగా ఉండాలి. ఈ చివరి సూచన ప్రకారమే చూసినా నగర ప్రాంతాలలో కుటుంబంలోని ఒక్కరు పని చేసినా నెలవారీ ఆ కుటుంబానికి 21000 రూపాయల మేర ఆదాయం ఉండాలి. అదీ విషయం. అంటే ప్రస్తుత కనీస వేతన ప్రకారం (178 రూపాయలు) కుటుంబంలో ఒక్కరు ఉపాధిలో వున్నా ఆ కుటుంబ నెలవారీ ఆదాయం సుమారుగా 5340 రూపాయలుగా ఉండాలి. ఈ రకంగా చూస్తే దేశంలోని అత్యధిక రాష్ట్రాలలో – రైతు కుటుంబాలలోని వారు మొత్తం పని చేస్తే వచ్చే ఆదాయాలు

5000 రూపాయల లోపుగానే ఉన్నాయి అనేది గమనార్హం అందుచేత కేవలం పంజాబ్, హర్యాన రైతుల ఆదాయాలను, దుర్భర దారిద్ర్యంలో వున్న ఇతర రాష్ట్రాల రైతాంగం ఆదాయాలతో పోల్చి ఆ రెండు రాష్ట్రాల రైతులు గారాబం చేయబడ్డారంటూ... అందుకే వారు చీటికీ మాటికీ నిరసనలకు దిగుతున్నారంటూ విమర్శించటం పరిహాసాస్పదం.

వాస్తవానికి, ప్రస్తుతం దేశంలోని మెజారిటీ రాష్ట్రాల రైతాంగానికి కనీస స్థాయిలో కావాల్సింది పంజాబ్, హర్యానా రైతుల తాలూకు ఆదాయస్థాయి. అంతేగానీ, కుటుంబం మొత్తం పని చేసి కూడా – అంతంత మాత్రం ఆదాయంతోనే బ్రతుకుతోన్న పంజాబ్, హర్యానాల చిన్న, సన్నకారు, మధ్యస్థాయి రైతుల ఆదాయాలు కూడా – పేద రాష్ట్రాల రైతుల ఆదాయస్థాయి కంటే ఎక్కువే అంటూ విలపించటం తగదు. ఈ తరహా మీడియా పేర్కొంటున్నట్లుగా పంజాబ్, హర్యానా రైతులే గనుక – గారాబం చేయబడ్డ, అధిక ఆదాయాల వారై ఉంటే, వారు కూడా ఇతర రాష్ట్రాల రైతులలాగానే వ్యవసాయం కోసం చేసిన అప్పులను తీర్చలేక ఋణమాఫీల కోసం ఎందుకు అడగవలసి వస్తోందో ఈ మీడియా ఆలోచించాలి. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు ఋణమాఫీ జరిగినా ఆ రాష్ట్ర రైతాంగం ఇంకా కడగండ్లలోనే ఉందంటే కారణం ఏమిటో కూడా ఆలోచించాలి. రాను రాను, సంవత్సర సంవత్సరానికి రైతులు వ్యవసాయంలో వాడే ఉత్పాదకాల వ్యయం పెరిగిపోతోంది. మరో ప్రక్కన, ప్రభుత్వం ధాన్యం బాగానే సేకరిస్తోన్న ఈ సో కాల్డ్ ధనిక రాష్ట్రాలలో కూడా రైతాంగానికి దొరికే కనీస మద్దతు ధర మాత్రం తగినంత వేగంగా పెరగడం లేదు. ఈ ఆదాయ వ్యయాల వ్యత్యాసం పెరిగిపోతోండటంతో వ్యవసాయం సంవత్సర సంవత్సరానికీ, రైతాంగానికి భరించనలవికానిదిగా మారిపోతోంది.

ఈ పై కారణాల వల్లనే, ప్రఖ్యాత పాత్రికేయులు , వ్యవసాయ నిపుణుడైన పి. సాయినాథ్ ప్రకారంగా ఈ దేశంలోని రైతాంగం 1971లో ఒక క్వింట పత్తిని అమ్మితే 15 గ్రాముల బంగారాన్ని కొనుగోలు చేయగలిగే వాళ్ళు. కాగా నేడు ఎన్ని క్వింటాల పత్తిని అమ్మితే 10 గ్రాముల బంగారాన్ని రైతు కొనగలడు అనేది ఇక్కడి ప్రశ్న. అంటే, రాను రాను దేశంలోని గ్రామీణ ప్రాంతాల రైతాంగానికి లభించే ఆదాయాల స్థాయి పడిపోతోంది. ఇటువంటి పరిస్థితికి దారి తీసిన స్థితిని నగర ప్రాంతాలకు అనుకూలంగానూ, గ్రామీణ ప్రాంతాలకు వ్యతిరేకంగానూ "వాణిజ్య లావాదేవీల సమతుల్యత" రోజు రోజుకూ మొగ్గుతుండటంగా చెప్పవచ్చు. అంటే ఒక ప్రక్కన గ్రామీణ వ్యవసాయదారులు ఉత్పత్తి చేసే ఉత్పత్తిల ధరలు పడిపోతుండగా, రెండో ప్రక్కన దీనితో పోలిస్తే నగర ప్రాంతాల పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు పెరుగుతోండటం. ఈ పరిణామం ఏమీ సహజ సిద్ధంగా జరుగుతోన్నది కాదు. స్థూలంగా ఆర్థిక సంస్కరణల పేరిట నడుస్తోన్నదై కార్పొరేట్ల, నగర ప్రాంతాల అనుకూల విధానాలు. ఈ విధానాల కారణం గానే, గ్రామీణ ఉత్పత్తుల ధరలను పెరగకుండా కృత్రిమంగా అదుపు చేస్తున్నారు. దీనంతటికీ కారణం గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గనుక పెరిగితే, నగర ప్రాంతాలలో నిత్యావసరాల ధరలు హెచ్చుగా ఉంటాయి (ఇక్కడ మధ్య దళారుల పాత్రను కాసేపు ప్రక్కన పెడదాం). ఇదంతా నగర ప్రాంతాలలో నిత్యవసరాల ధరలు ఒక పరిమితికి దాటకుండా అదుపు చేయటం ద్వారా, నగర ప్రాంతాలలోని మధ్య తరగతి వారు, కార్మికులు అధిక వేతనాల కోసం కార్పొరేట్లను డిమాండ్ చేయకుండా బుజ్జగించేందుకే. తద్వారా కార్పొరేట్లు తాము చెల్లించే వేతన బిల్లులను తక్కువగా ఉంచి, వారి లాభాలను పెంచుకోగలరు. ఇక రెండవ కారణం, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరప్రాంతాలకు నిరంతరంగా కార్మికుల సరఫరాను హామీ చేయటం. దీనికి గాను, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వలసలు ఉండాలి. ఇది గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం లాభసాటిగా ఉంటే జరగదు. అటువంటి స్థితిలో గ్రామీణపేదలు, చిన్నరైతులు అంత సులువుగా నగర ప్రాంతాలకు వలస వెళ్ళరు. ఇదే జరిగితే, నగర ప్రాంతాలలో కార్మికుల, ఉద్యోగుల కొరత ఏర్పడి , వారికి డిమాండ్ పెరిగి – అది కార్పొరేట్లపై అధిక వేతనాల డిమాండుకు దారి తీస్తోంది. దీని సారాంశం, నగర ప్రాంతాలకు నిరంతర కార్మికుల సరఫరా ఉండి, వారి సరఫరా స్థాయి – కార్పొరేట్ల డిమాండ్ స్థాయి కంటే అధికంగా ఉంటేనే : కార్మికులు, ఉద్యోగుల వేతన డిమాండ్లను నియంత్రించడం కార్పొరేట్లకు సాధ్యం అవుతుంది. ఇక్కడ ఓ చిన్న ఉదాహరణ, ఇంగ్లాండ్‌లో బలమైన భూస్వామ్య వ్యవస్థ స్థానంలో, పెట్టుబడిదారి పారిశ్రామిక ఉత్పత్తి ఎదిగి, బలపడిన కాలం. ఆ దేశంలో భూస్వామ్య, ఫ్యూడల్ వ్యవస్థ బలంగా ఉండగా "మొక్కజొన్న చట్టం" అనేది ఉండేది. దీని ఉద్దేశ్యం ఇతర దేశాల నుంచి ఇంగ్లాండ్‌లోకి మొక్కజొన్నల దిగుమతిని నియంత్రించడం. తద్వారా ఇంగ్లాండ్‌లోని మొక్కజొన్న రైతులకు మంచి ధర పలికేలా హామీ చేయడం. కాగా, ఎప్పుడైతే ఇంగ్లాండ్ లో – పారిశ్రామిక ఉత్పత్తి పెరిగిందో, నగర ప్రాంతాలు బలపడ్డాయో – అప్పుడు ఈ "మొక్కజొన్న చట్టం" రద్దు దిశగా ఒత్తిళ్ళు సాగాయి. అంతిమంగా ఆ చట్టం రద్దయ్యింది. దీనికి

కారణం సరళం. అది, నాడు పారిశ్రామిక ఉత్పత్తి పెరిగి, నగరాలు విస్తరించనారంభించిన ఇంగ్లాండ్‌లోని – నగర ప్రాంతాల కార్మికులు, ఉద్యోగులకు తక్కువ ధరలకు మొక్కజొన్న లభించేలా హామీ చేయడం. దీని కోసమే మొక్కజొన్న చట్టం రద్దు చేసి, ఇతర దేశాల నుంచి ఇంగ్లాండ్‌కి మొక్కజొన్న దిగుమతులను కొత్త అధికార (పారిశ్రామిక) వర్గం అనుమతించింది. తద్వారా దేశంలో మొక్కజొన్న సరఫరాను పెంచి దాని ధర పడిపోయేలా చేసింది. నేడు మన దేశంలో జరుగుతోంది అదే ! కాకులను కొట్టి గెద్దలకు వేసినట్లు – గ్రామీణ రైతాంగాన్ని దెబ్బతీసి, నగర ప్రాంతాల కార్పొరేట్లకు అనుకూల విధానాలను అనుసరించటం నేటి ఆర్థిక సంస్కరణ పర్వంలో ఒక భాగం. అలాగే ఈ క్రమంలో నష్టపోయిన రైతాంగాన్ని, వ్యవసాయం నుంచి వైదొలిగేలా చేసి – ఆ స్థానంలో రక్తపాత రహితంగానే కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అనేది ఈ విధానాల తాలూకు రెండవ పార్శ్వం. అదీ కథ.

ఈ కారణాల చేతనే మన దేశవ్యాప్తంగా ఉన్నట్లే పంజాబ్, హర్యానాలోని పిల్లలలోనూ సరైన ఆహారం లేక శారీరకఎదుగుదల తక్కువస్థాయిలో ఉండటం కనబడుతోంది. ఉదాహరణకు దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో సగటున 50% మంది పిల్లలు తమ వయసుకు తగ్గ ఎత్తు లేరు, అలాగే వారు తమ ఎత్తుకు తగిన శరీర బరువుని కూడా కలిగి లేరు. కాగా ఈ గణాంకం దేశంలోని నగర ప్రాంతం సుమారుగా 40% ఉంది. ఐతే, పంజాబ్ హర్యానాలలోని "ధనిక" గ్రామాలలోనూ పరిస్థితి ఏమీ మెరుగుకాలేదు. హర్యానాలోని గ్రామీణ ప్రాంతాలలో 48% మంది పిల్లలు తమ వయసుకు తగ్గ ఎత్తూ, ఎత్తుకు తగ్గ బరువు లేరు. ఇక పంజాబ్‌లోని గణాంకం 38% గా ఉంది.

స్థూలంగా, కార్పొరేట్ అనుకూల, సంస్కరణల అనుకూల మీడియా – కోవిడ్ ఆరోగ్య సంక్షోభ కాలంలోనూ, అంతకు ముందరా కూడా ఒక ప్రక్కన సామాన్య ప్రజల ఆదాయాలు పడిపోతూ, మరో ప్రక్కన కొత్తగా బిలియనీర్లు పుట్టుకొస్తుండగా కూడా, అలాగే ధనవంతులు మరింత ధనవంతులు అవుతుండగా కూడా వేలెత్తి చూపలేదు. అందరి ఆదాయాలు పడిపోతున్న కాలంలో, ఈ పిడికెడు మంది కొత్త ధనవంతులు ఎక్కడ నుంచి పుట్టుకొస్తున్నారని ప్రశ్నించలేదు. కానీ, కోట్లాది మంది సాధారణ రైతులు – తమ జీవన స్థితిగతులను నేడు పెనం మీద ఉన్న స్థితి నుంచి, పొయ్యిలోకి నెట్టొద్దంటూ ఢిల్లీని చుట్టుముట్టుతుంటే, ప్రశ్నిస్తుంటే ఈ మీడియాకు కంపరంగా ఉంది.. !! ఈ నేపథ్యం లోనే ఇటువంటి మీడియా గురించి శ్రీశ్రీ మాటలు ఒక్కసారి గుర్తు చేసుకోవచ్చు – "పెట్టుబడికీ కట్టుకథకీ పుట్టిన విష పుత్రికలు ఈ పత్రికలు" అని ఆయన చురక అంటించాడు ❑

## అక్షర ప్రేమికుడి ముత్యాల కోవ

**(17వ పేజీ తరువాయి)**

గతం మీద అపారమైన అనురక్తి ఉందని చెప్పుకునే తిరోగమన శక్తులు గతాన్ని వలసవాద చరిత్రకారుల దృష్టితోనే చూస్తారు అని నిరూపించడానికి అందుకే బ్రిటిష్ వారిపై వీరోచిత పోరాటం చేసిన టిప్పు సుల్తాన్ వారికి మత దురహంకారిగానే కనిపిస్తాడు అని చెప్పడానికీ ప్రసాద్ చూపించిన నిదర్శనాలు చరిత్రను ఎలా చూడాలి అనడానికి జ్వాజ్వల్యమానమైన కాగడగా ఉపకరిస్తుంది.

"వెలుగంటే ఎవరికి ఇష్టం ఉండదు... చీకటి బిలాలకు, బ్లాక్ బేహారులకు, ప్రజాకంటకులకు తప్ప" అని ప్రారంభించి "ఈ విశ్వానికి వెలుగుల ప్రస్థానమే మేలి మలుపైంది. చీకటి గుండెల్ని చీల్చే వెన్నెల వానైంది. జగతి ఉనికికి, విశ్వ జాగతికి తొలి పిలుపైంది. శాంతి, సౌఖ్యాలకు ప్రకృతిలో పువ్వైంది. కల్మషం లేని గుండెల్లో ప్రళయ గర్జనైంది. జాలువారిన చిరునవ్వైంది. ప్రణవనాదమైంది. ప్రణయ గీతమైంది. జ్ఞాన మాలికైంది" అనడంలో బాగా పరిచితమైన పదాలను చిన్న వాక్యాలుగా మలిచి తెలుగు రచన ఎంత హృద్యంగా ఉంటుందో నిరూపించాడు ప్రసాద్.

ఈ సంపాదకీయాల్లో అతి సామాన్యమైన విషయాల నుంచి చారిత్రక సంఘటనలు, సాహిత్యకారులు, సంగీతకారులు, మానవాళి మనుగడకు అత్యవసరమైన సమష్టి తత్వం దాకా అనేక విషయాలను తన రచనా శక్తితో చదివించేట్టు చేశాడు ప్రసాద్.

నాలుగేళ్లపాటు నిబద్ధతతో తన అక్షర విన్యాసంతో పాఠకులను కూడా అక్షరాన్ని ప్రేమించే వారిగా మలచాలన్న దీక్ష లేకపోతే ఇలాంటి సంపాదకీయాలు రాయడం కుదరదు. సాధారణంగా సంపాదకీయాలలో వస్తువుకే ప్రాధాన్యత ఉంటుంది. కాని శిల్ప సౌందర్యాన్ని విస్మరించకూడదు అని చెప్పడానికి ఈ "ముత్యాల మాల" సజీవ ఉదాహరణ. కళ గురించి చెప్పడానికి కళే సాధనం. పఠనాసక్తిని పెంచడానికి రచనా కౌశలమే ఆధారం. ముత్యాల ప్రసాద్ చేసింది ఇదే. ❑

# రైతుల ఆందోళన :
# బిజెపి-అండ్ కో వంచనాపూరిత వాదనలు -వాస్తవాలూ

ఎం కోటేశ్వరరావు



డిసెంబరు ఎనిమిదిన రైతు సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపు మేరకు భారత బంద్ జయప్రదంగా జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఒక వైపు చర్చలంటున్నది. మరోవైపు ప్రధాని నరేంద్రమోడీ గారే స్వయంగా రెచ్చగొట్టేందుకు పూనుకొని వెనక్కు తగ్గేది లేదని చెబుతున్నారు. తాజా ఆందోళన ఎంత కాలం కొనసాగుతుంది, ఏమౌతుంది అన్నది ఒక అంశమైతే రైతుల ఆందోళనల సందర్భంగా జయప్రకాష్ నారాయణ వంటి మేథావులు అనేక వాదనలను ముందుకు తెస్తున్నారు. ప్రతి ఉద్యమ సమయంలో దాన్ని వ్యతిరేకించే శక్తులు తప్పుడు వాదనలూ, అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసేందుకు సామాజిక మాధ్యమాలను పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నారు. పంజాబు రైతులే ఎందుకు ఆందోళనలో ముందున్నారు, మిగతా రాష్ట్రాల వారు ఎందుకు స్పందించటం లేదు వంటి కొన్నింటి తీరు తెన్నులను చూద్దాం.

**1. పార్లమెంట్ అంగీకరించిన తరువాత రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారు ?**

ఇది తర్కానికి నిలిచేది కాదు. పార్లమెంట్ ఆమోదించినంత మాత్రాన వ్యతిరేకత వ్యక్తం చేయకూడదని చెప్పటం నిరంకుశత్వ లక్షణం. ఇందిరా గాంధీ హయాంలో విధించిన అత్యవసర పరిస్థితిని అప్పటి పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదించారు. అయినా నేటి బిజెపి పూర్వ రూపమైన జనసంఘం ఎందుకు వ్యతిరేకించింది? ఆర్టికల్ 370, కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కూడా పార్లమెంటు ఆమోదించినవే అయినా బిజెపి ఎందుకు వ్యతిరేకించింది, రద్దు చేసింది ?

**2. ముందే ఎందుకు అభ్యంతరం చెప్పలేదు, ఆందోళన చేయలేదు ?**

ఇది తప్పుడు ప్రచారం. ఆర్డినెన్స్‌లు తెచ్చినపుడే వ్యతిరేకతను వ్యక్తం చేశారు. కరోనా కారణంగా వీధుల్లోకి రాలేదు, అన్నింటికీ మించి వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెనక్కు తగ్గుతుందనే ఆశ, నమ్మకం ఉండటం. ఇవి రెండూ పోయిన తరువాత మరొక మార్గం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాజీనామా చేసిన బిజెపి మిత్రపక్షం అకాలీదళ్ చెప్పింది అదే. రెండు వ్యవసాయ, ఒక వినియోగదారుల చట్టాలకు సంబంధించి మార్పులను ఆర్డినెన్సుల ద్వారా అమల్లోకి తెచ్చింది కేంద్ర ప్రభుత్వం. ఈ రెండు అంశాలూ ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోలేదు. చర్చలు జరపలేదు. మెజారిటీ రాష్ట్రాలు బిజెపి పాలనలో ఉన్నాయి గనుక మౌనం దాల్చాయి.

**3. ప్రజాస్వామ్య బద్ధంగానే జరిగింది కదా !**

పార్లమెంట్‌లో ఆర్డినెన్స్ స్థానే బిల్లులను ప్రవేశపెట్టినపుడు సెలెక్టు కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల అభిప్రాయాలను కేంద్రం తోసి పుచ్చింది. నిరసనల మధ్య ఆమోద తతంగాన్ని పూర్తి చేసింది. 2019లో లోక్‌సభ ఎన్నికలు జరిగిన తరువాత కేంద్ర ప్రభుత్వం 17 బిల్లులను పార్లమెంటరీ కమిటీలకు పంపింది. వీటిని ఎందుకు తిరస్కరించినట్లు? ఇది ప్రజాస్వామ్యమా? విదేశీ-స్వదేశీ కార్పొరేట్లకు అంతర్గతంగా హామీ ఇచ్చారు కనుకనే ఆర్డినెన్సు, తరువాత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విరుద్దంగా ఆమోద తతంగం చేశారు. అందువలన అవి రద్దయ్యేవరకు గళం విప్పుతూనే ఉండటం తప్పెలా అవుతుంది.

**4. రైతులు మొండిగా ఉన్నారు, కమిటీ వేస్తామన్నారు కదా, ఎందుకు అంగీకరించరు ?**

మొండిగా ఉన్నది ప్రభుత్వమే. తమ మిత్రపక్షం అకాలీదళ్ నిరసన వ్యక్తం చేసినా రాజకీయంగా దానితో విడగొట్టుకొనేందుకు అయినా సిద్దపడింది గానీ ఆ పార్టీ చెబుతున్న దానిని కూడా వినిపించుకోలేదు. సెప్టెంబరు 25న అఖిల భారత నిరసన దినం పాటించాలని అఖిల భారత కిసాన్ సంఘర్ష సమితి పిలుపు ఇచ్చింది, పాటించారు. అప్పుడు స్పందించలేదు. తరువాత నవంబరు 26న ఆందోళన పిలుపునూ పట్టించుకోలేదు. తీరా రైతులు ఢిల్లీ బయలుదేరిన తరువాత శివార్లలో కందకాలు తవ్వేందుకు, ఆటంకాలు ఏర్పాటుకు చూపిన శ్రద్ధ పరిష్కారం మీద లేదు. రైతులు వచ్చిన వారం తరువాత చర్చలు జరుపుతామని కేంద్రం ప్రకటించింది. అయితే వత్తిడిని తట్టుకోలేక

ముందే చర్చలకు పిలిచింది. కమిటీని వేస్తామనటం తప్ప మార్పులకు సంబంధించి నిర్దిష్ట ప్రతిపాదనలు కేంద్రం వైపు నుంచి లేవు. ఇది కాలయాపన, ఉద్యమాన్ని చల్లార్చే ఎత్తుగడ. అలాంటపుడు రైతులేమి చేయాలి ?

**5. కేంద్రం చెబుతున్నది ఏమిటి ? రైతులు కోరుతున్నది ఏమిటి ?**

ఐదుసార్లు చర్చలు జరిపారు. చట్టాలను పూర్తిగా వెనక్కు తీసుకోవాలని రైతులు ప్రతిసారీ చెప్పారు. సావిత్రీ నీ పతి ప్రాణంబుదక్క వరాలు కోరుకోమన్నట్లుగా అది మినహా ఇతర అంశాల గురించి మాట్లాడుదాం అనటం తప్ప కేంద్రం నుంచి మరొక మాటలేదు. రైతులు చెప్పాల్సింది చెప్పారు. ప్రభుత్వ ప్రతిపాదనలేమిటో ఇంతవరకు చెప్పలేదు.

**6. కొన్ని మార్పులు చేస్తామని చెప్పారు, కనీస మద్దతు ధర కొనసాగుతుందని ప్రధాని చెప్పిన తరువాత కూడా రైతులు ఆందోళన చేయటం ఏమిటి ?**

ఆ మార్పులేమిటో నిర్దిష్టంగా చెబితే రైతులు ఆలోచిస్తారు. ఎవరు చెబుతున్నది ఏమిటో జనమూ గ్రహిస్తారు. రైతులు గొంతెమ్మ కోరికలు కోరితే ఆందోళనకు మద్దతు తగ్గిపోతుంది. అయినా ప్రభుత్వం లేదా నరేంద్రమోడీ మన్‌కీ బాత్‌లో చెప్పిందేమీ లేదు. ఎవరితో సంప్రదించకుండానే ఆర్డినెన్సు తెచ్చారు. పార్లమెంట్‌లో అభ్యంతరాలను పట్టించుకోలేదు. పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా గురించి బిజెపి ఎంత హడావుడి చేసిందో తరువాత ఎలా ప్లేటు ఫిరాయించిందో తెలిసిందే. యాభై రోజుల్లో పెద్ద నోట్ల రద్దు సమస్యను పరిష్కరించ లేకపోతే శిక్షించమని మోడీ చెప్పారు. నాలుగేండ్ల తరువాత నల్లధనాన్ని తగ్గించామని బుకాయించటం తప్ప అంకెల్లో చూపారా? జిఎస్‌టి ఆదాయం తగ్గితే పరిహారం ఇస్తామని చేసుకున్న ఒప్పందానికే ఎగనామం పెడుతూ దేవుడి లీల, కేంద్రం పరిహారం ఇవ్వలేదని బుకాయించిన తీరు చూశాము. అందువలన ప్రధాని నోటి మాటలను ఎవరైనా ఎలా నమ్ముతారు? కనీస మద్దతు ధర గురించి చెబుతున్న మాటలనే చట్టబద్ధం ఎందుకు చేయరని రాజస్థాన్, హర్యానాలో ఉన్న బిజెపి మిత్రపక్షాలే చెబుతున్నాయి. దాన్నయినా చేస్తామని ఎందుకు చెప్పటం లేదు?

**7. రైతులకు ఉపయోగం లేకపోతే జయప్రకాష్ నారాయణ వంటి మేథావులు కేంద్రాన్ని ఎందుకు సమర్ధిస్తున్నారు?**

జయప్రకాష్ నారాయణ ఒక మాజీ ఐఏఎస్ అధికారి. రాజకీయాల్లో ఒక విఫలనేత. ఆయన ఎందుకు సమర్ధిస్తున్నారో స్కాన్ చేసి చూడలేము. అయితే ఒక మేథావిగా ఆయన చెప్పిన మాటలను వినాల్సిందే. కానీ అవే ప్రమాణం కాదు. జెపి కంటే వ్యవసాయ ఆర్థిక రంగంలో ఎంతో పరిశోధనలు చేసిన నిపుణులు అనేక మంది వ్యతిరేకించారు. తెలుగు రాష్ట్రాల్లో జెపి ఎంత బాగా తెలిసిన వ్యక్తో ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా అంతే తెలుసు. మరి నాగేశ్వర్ వ్యతిరేకతను ఎందుకు పరిగణనలోకి తీసుకోరు.

**7. రైతులను బిజెపి వ్యతిరేక పార్టీలు తప్పుదారి పట్టిస్తున్నాయి !**

రైతులు అంత అమాయకులు కాదు. ఒక వేళ ఇతర పార్టీలు తప్పుదారి పట్టిస్తే బిజెపి వారిని సరైనదారిలో పెట్టలేనంత అసమర్ధంగా ఉందా? ఈ ఆరోపణ రైతుల అనుభవం, తెలివితేటలను అవమానించటం తప్ప మరొకటి కాదు. మన దేశంలో, ప్రపంచంలో రైతాంగ ఉద్యమాలు కొత్త కాదు, ఎన్నో చారిత్రాత్మక పోరాటాలు చేశారని మరచిపోకూడదు. పంజాబ్ పోరాటాల గడ్డ, పంజాబీలు అటు సైన్యంలో జైజవాన్లుగా, వ్యవసాయంలో జైకిసాన్లుగా వారి పాత్రను ఎవరూ తక్కువ చేసి చూపలేరు. సెప్టెంబరు 25న తొలి ఆందోళన ప్రారంభమైంది. అప్పటి నుంచి రైతులను సమాధాన పరిచేందుకు బిజెపి చేసింది ఏమిటి ?

**8. ప్రతిపక్షాలు ప్లేటు ఫిరాయించాయి. మార్కెట్ కమిటీలను రద్దు చేస్తామని కాంగ్రెస్ 2019 మానిఫెస్టోలో చెప్పింది.**

ప్లేటు ఫిరాయించటం రాజకీయాల్లో కొత్త కాదు, అది ప్రజలకు మేలు చేసేది, తప్పిదాన్ని సరిదిద్దుకొనేది అయితే ఇబ్బంది ఏమిటి. ముఖ్యమంత్రిగా జిఎస్‌టిని వ్యతిరేకించిన నరేంద్రమోడీ తీరా తాను ప్రధాని అయిన తరువాత తగిన కసరత్తు లేకుండా అమలు జరపటాన్ని, దేశాన్ని ఇబ్బందుల పాలు చేయటాన్ని ఏమనాలి. అనేక రాష్ట్రాలకు ప్రకటించిన పాకేజీలు, హామీలను తిరస్కరించటం ఏమిటి? రెండు తెలుగు రాష్ట్రాలకు బిజెపి, కేంద్రం ఇచ్చిన హామీలకు మొండి చేయి చూపటాన్ని ఏమనాలి? బిజెపి గురివింద గింజ మాదిరి వ్యవహరిస్తోంది.

**9. పంజాబ్ రైతులు, జాట్ కులస్తులు తప్ప ఉద్యమంలో ఎవరూ లేరు ?**

జయప్రకాష్ నారాయణ వంటి మేథావులు చేస్తున్న తప్పుడు వాదన ఇది. కుల వ్యవస్థ ఉన్న కారణంగా ప్రతి వారూ పుట్టుకతో ఏదో ఒక కులానికి చెందుతున్నారు. అనేక మంది ఐఏఎస్,

ఐపిఎస్‌లు ఉన్నారు? మరి జెపి ఒక్కరే లోక్‌సత్తా ఎందుకు పెట్టారు? ఎన్నికల్లో ఎందుకు పోటీ చేశారు? ప్రజల సొమ్ముతో వైద్య విద్యను చదివి ప్రాక్టీస్ చేయకపోవటం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటం, జనానికి అవసరమైన మరొక వైద్యుడు తయారు కాకుండా అడ్డుకోవటమే. అలాంటి వారిలో జెపి ఒకరు ఎందుకు అయ్యారు? పోనీ ఐఎఎస్ అధికారిగా అయినా కొనసాగి జనానికి మేలు చేయలేదు.

ఎస్ పంజాబ్ రైతులు ఉద్యమంలో ముందున్నారు. సంస్కరణ ఉద్యమాలు, స్వాతంత్ర్య ఉద్యమంలో దేశంలోని అన్ని ప్రాంతాలూ ఒకేసారి ముందుకు ఎందుకు రాలేదో జెపి వంటి వారు చెప్పాలి. హరిత విప్లవంలో పంజాబ్ రైతులు ముందున్నారు. వ్యవసాయ మిగులును సాధించటంలోనూ వారే ముందున్నారు. ఆ మిగులుకు మార్కెటింగ్ సమస్యలు వచ్చినపుడు ప్రభావిత మయ్యేదీ వారే కనుక, ముందుగా మేలుకున్నారు.

2015-16 గణాంకాల ప్రకారం దేశంలో వంద ఎకరాలలో వంద కిలోల ఆహారధాన్యాలు ఉత్పత్తి అయ్యాయనుకుంటే ఉత్తర ప్రదేశ్‌లోని 15.71 ఎకరాల్లో 16.91 కిలోలు, మధ్య ప్రదేశ్‌లోని 12.7 ఎకరాల్లో 12.08 కిలోలు, పంజాబ్‌లోని 5.4 ఎకరాల్లో 11.29 కిలోలు పండుతున్నాయి. మిగిలిన సంవత్సరాలలో కూడా స్వల్ప తేడాలతో ఇదే విధంగా ఉంటాయి. దీనర్ధం ఏమిటి పంజాబ్‌లో అమ్ముకోవాల్సిందీ ఎక్కువే. మార్కెట్ కమిటీలను, సేకరణ వ్యవస్థలను పనికి రాకుండా చేసి, కనీస మద్దతు ధరలను నీరు గారిస్తే ఎక్కువగా నష్టపోయేది పంజాబ్ రైతులే కనుక వారే ముందుగా మేలుకున్నారు.

2017-18 వివరాల ప్రకారం బియ్యం ఉత్పత్తిలో పశ్చిమ బెంగాల్ 13.26 శాతంతో దేశంలో అగ్రస్థానంలో ఉంటే 11.85 శాతంతో పంజాబ్, 11.75 శాతంతో ఉత్తరప్రదేశ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇక బియ్యం వినియోగంలో నెలకు తలసరి వినియోగం పంజాబ్‌లో బియ్యం 0.4 కిలోలు ఉంటే 14.5 కిలోలతో ఒడిషా ప్రథమ స్థానంలో ఉంది. అందువలన రెండు రాష్ట్రాల రైతులకూ మార్కెటింగ్ సమస్యలు ఒకే విధంగా ఉంటాయా? ఎంత పండినా వినియోగించే స్థితిలో ఒడిషా రైతు, అమ్ముకోవాల్సిన అవసరంతో పంజాబ్ రైతు ఉంటాడు. అందుకే ఆందోళనలో ముందుంటాడు. ఇలాంటి తేడాలే ఉంటాయి.

## 10. ఆందోళన చేస్తున్నది రైతులు కాదా ?

మరి ఎవరు? సామాజిక మాధ్యమంలో మరుగుజ్జులు పంజాబ్ గురించి అనేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అలాంటి వాటిలో ఒకదానిలో చెప్పిన దాని ప్రకారం పంజాబ్‌లో వ్యవసాయం చేసే గ్రామాలు కేవలం 1,500 మాత్రమేనట. అక్కడ 30వేల మంది అడితియాస్ (కమిషన్ ఏజంట్లు), వారి వద్ద పని చేసే మూడు లక్షల మంది సహాయకులు కలిపి ప్రతి గ్రామానికి 220 మంది చొప్పున వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారట. చెవుల్లో కమలం పూలు పెట్టటం తప్ప మరొకటి కాదు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2001లో 12,729 గ్రామాలున్నాయి. తరువాత ఏవైనా కొన్నింటితో మున్సిపాలిటీలు ఏర్పాటు అయి ఉండవచ్చు. పన్నెండు వేలకు తగ్గవు. పంజాబ్‌ను వ్యవసాయ రాష్ట్రంగా చెబుతుంటే 1500 గ్రామాలతో అంత ఉత్పత్తి సాధ్యమా ? దీన్ని ప్రచారం చేస్తున్న వారు కాస్త బుర్ర పెట్టి ఆలోచించాలి. ఇలాంటి లెక్కలతోనే అడితియాసే రైతుల ముసుగులో ఆందోళన చేస్తున్నట్లు బిజెపి, దాని తొత్తులు ప్రచారం చేస్తున్నారు.

## 11. ఇతర రాష్ట్రాలతో పోల్చటం తప్పంటారా ?

ఈ ప్రశ్నకు పంజాబ్ రైతుల గురించి చెప్పినదానిలోనే కొంత సమాధానం ఉంది. మార్కెట్ యార్డుల వెలుపల అమ్ముకొనే స్వేచ్ఛ ఇస్తే రైతులకు లాభం అని చెప్పేవారి దగ్గర ఆధారం లేదు. ఒక భ్రమ మాత్రమే. బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వం 2006లోనే వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేసింది. ధాన్య సేకరణ బాధ్యతను సహకార సంస్థలకు, వ్యాపారమండళ్లకు అప్పగించింది. గత ఏడాది 30 లక్షల టన్నులు సేకరణ లక్ష్యంగా చెప్పారు, 20 లక్షల టన్నులకు దాటలేదు. గతేడాది క్వింటాలు ధాన్యం కనీస మద్దతు ధర రూ.1,815 ఉంటే బహిరంగ మార్కెట్లో సీజన్‌లో రూ.1,350కి అమ్ముకున్నారు (మే 8, 2019 డౌన్‌టు ఎర్త్). ఏటా బీహార్‌లో 1.6 కోట్ల టన్నుల ధాన్యం పండుతుందని అంచనా. దీనిలో 30 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం. ఈ ఏడాది నవంబరు 15 నుంచి డిసెంబరు ఐదు వరకు కొన్నది కేవలం 793 టన్నులు మాత్రమే. కనీస మద్దతు ధర రూ.1,868 కాగా రైతులు రూ.800-1200 మధ్య అమ్ముకుంటున్నారు (డిసెంబరు ఆరు, 2020 ఇండియన్ ఎక్స్‌ప్రెస్). అందుకే బీహార్ పరిస్థితితో పోల్చుకొని పంజాబ్ రైతులు ముందే మేలుకున్నారు. పంజాబీలను చూసి బీహారీలు కూడా వీధుల్లోకి రావచ్చు. అందువలన అందరూ ఉద్యమంలోకి ఎందుకు రావటం లేదని కాదు వచ్చిన వారి డిమాండ్లలో న్యాయం ఎంత అన్నది ముఖ్యం. ❑

# రైతు బంద్

**డాక్టర్ సుద్దాల అశోక్ తేజ**
కవి, సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత



గోధుమ ధుమధుమ లాడుతూ–
కేంద్ర దుశ్శాసన పర్వాలు
ధూళిలో కలవాలని శపిస్తుంది.
వరి గొలుసులు తెంపుకున్న వడ్లు
ఒడ్లు – వరాలు తెంచుకుని – ఢిల్లీ
సరిహద్దుల్లో నాలుగు దిక్కులే మాకు
షెడ్లు అంటున్నాయ్

పత్తి – పాలకుల ప్రవృత్తి చూళ్లేక
శ్వేత రక్తం వాంతి చేసుకుంటుంది

కంది – చలికి దగ్గుతూ కళ్లెలు – కళ్లెలుగా
ఖాండ్రించి ఉమ్ముతుంది.
మిరప – మిరియం కలిసి
కారాలు నూరుతున్నై



బియ్యం – పప్పు, ఉప్పు వంటి
వంటింటి దినుసులు
రోడ్ల మీద కడుపు మండి
కుత కుత ఉడికిపోతున్నై
అధికార భవన భోజన పదార్థాలు
పాలకుల పులి నోట్లోకి వెళ్ళడం
జన్మ జన్మల పాపంగా
విలపిస్తున్నై
పవర్లో ఉన్న నేతల్ని
చుట్టుకొనివున్న సూట్లు కుర్తాలు
ధోతులూ పంచెలు చీరలు
అనకొండల్ని చుట్టుకున్నట్టు
అనునిమిషం
చిరచిరలాడుతూ
ఛీత్కరించుకుంటున్నాయి
ఏడు డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
ఉగ్రత కొని తెచ్చుకోలేక
తన్నుతాను అసహ్యించుకుంటుంది

కురుస్తున్న మంచు
నేను నేలకు రాలిపోయేవేళ
ఎందుకొచ్చారు బిడ్డలారా అంటూ
పశ్చాత్తాపంతో కరిగి కన్నీటి చిమ్మై
తప్పు మన్నించమని
రైతుల పాదాల్ని ముద్దుపెడుతుంది

రోడ్లమీద కొచ్చిన రైతుల కోసం
ప్రాణంలేని ట్రాక్టర్లు
ఇళ్ళుగా మారి రైతుల్ని
కడుపులో దాచుకుంటున్నై
ఏలెటోని మీద నేల
ఎత్తి ఏడు దోసిళ్ళ మన్నుపోస్తుంది

ఎగ్గు సిగ్గులేని ఏలికలు
పట్టపగ్గాల్లేని పాలకులు
చర్చలమీద చర్చలకు రమ్మంటూ
'రమ్మి' ఆట ఆడుకుంటున్నారు

మీరు పెట్టే బిచ్చపుకూడు తినమని రైతులు
తమ చద్దులు తామే తింటున్నా కూడా
లజ్జ – మానం – శరం లేని అధికారం
రైతులు కోరిన కార్పొ'రేట్' చట్టాలు
రద్దు చేయడం లేదు

తల్లిపాలు తాగి రొమ్ము గుద్దేరకం కదా
గుద్దే నైజం – అందుకే
ఢిల్లీలో రైతుల అడుగుల ధ్వని
లండన్‌లో రాస్తారోకో చేస్తుంది
ఈ రోజు దేశం
ఆకాశపు టంచుల్లో నిలుచున్న
ధిక్కార పతాక సన్నివేశం ❏



# అశ్వమేధం తరువాత ఇక రాజసూయమే!

**కె. శ్రీనివాస్**
ఆంధ్రజ్యోతి సంపాదకులు

ఇందిరాగాంధీ నియంతృత్వం, వ్యక్తి నియంతృత్వం మాత్రమే. వ్యవస్థ కూడా దాన్ని ఎక్కువ కాలం మోయలేకపోయింది. ప్రస్తుతం అమలు జరుగుతున్న దానిని నియంతృత్వం అనలేము. దానికి మరేదో పేరున్నది. ప్రజల సమ్మతి నిరంతరం తయారవుతున్న పాలన ఇది. అత్యధిక ప్రజలు, ఎందువల్లనో, ఏ కారణం చేతనో, ఒక తెలియని శత్రువుని లేదా ఒక ఆపాదించుకున్న శత్రువుని నిరంతరం ద్వేషిస్తూ, ఆ ద్వేషం నుంచి తామస భావాలలో ఓలలాడుతూ, పాలకుల చర్యలకు జేజేలు పలుకుతున్నారు. ఇప్పుడు ఆవరించిన ప్రభావ ఉన్మాదంలో, ఇంతకాలం సమకూర్చుకున్న చిన్న చిన్న విలువలు కూడా కొట్టుకుపోతున్నాయి.

ప్రజల అండ ఉంటే, సత్పరిపాలన సాగిస్తే, ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తే, నాలుగుకాలాల పాటు నిలవడం కుదరవచ్చు, పోరాడితే రాజసూయాన్ని నిలువరించనూవచ్చు, కానీ, లొంగితే ఉపయోగం ఏమిటి? ప్రత్యర్థితో ఐక్యమైపోవడం దాని కంటె మెరుగు. ఇంత దుస్థితి ఎందుకు వచ్చినట్టు అసలు? ప్రజల గౌరవం కోల్పోవడం వల్లనే కదా?

నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎన్‌డిఎ)ను భారతీయ జనతా పార్టీ నిర్వహించిన అశ్వమేధంలో యాగాశ్వంగా ప్రముఖ ఆంగ్ల పాత్రికేయులు శేఖర్ గుప్తా ఈ మధ్య పోల్చారు. పాశ్వాన్ మరణం, అకాలీదళ్ నిష్క్రమణ తరువాత కేంద్రంలో నెలకొన్న 'సంకీర్ణ' ప్రభుత్వంలో ఒక్కరు మినహా అందరూ భారతీయ జనతాపార్టీకి చెందిన వారే కావడాన్ని ప్రస్తావిస్తూ, కూటమి అవసరం ఇక లేదని, లక్ష్యం పూర్తయిన తరువాత యాగాశ్వాన్ని బలి ఇస్తారని గుప్తా నర్మగర్భంగా రాశారు. ఈ రెండు దశాబ్దాల కాలం, ఎన్‌డిఎ అన్నది ఒక ముఖకవచంలాగా బిజెపికి పనికివచ్చిందనుకోవాలా? లేదా అది ఒక స్పెషల్ పర్పస్ వెహికల్‌గా ఉపకరించిందనుకోవాలా? అయితే, బిజెపి లక్ష్యం పరిపూర్తి అయిందని చెప్పలేము. యాగాశ్వం దేశంలోని అన్ని మూలలకు, కోనలకు ప్రయాణించ లేదు. గెలుచుకోవలసిన ఉపరాజ్యాలు చక్రవర్తికి ఇంకా మిగిలే ఉన్నాయి. అశ్వమేధయాగం ఒక మజిలీ మాత్రమే. అంతిమంగా రాజసూయం కోసమే బిజెపి రాజకీయం గురిపెట్టింది.

రాజకీయ పక్షాలు అధికారాన్ని వంతులవారీగా పొందడం సహజమే అయినప్పుడు, ఒక పక్షం తనను తాను దేశవ్యాప్తం చేసుకోవడాన్ని జైత్రయాత్రగా, సర్వాన్నీ అధీనం చేసుకునే ప్రయత్నంగా ఎందుకు చెప్పుకోవాలి? అన్న ప్రశ్న రావడం సహజం. మధ్యేవాద పార్టీల మధ్య అధికారం వంతులవారీగా బదలాయింపు జరిగితే అది సాధారణమే. మితవాద పక్షం కూడా మధ్యేవాద పరిమితుల మధ్య సంచరిస్తున్నప్పుడు, మరొక మధ్యేవాదపార్టీతో విడతల వారీగా అధికారాన్ని పంచుకోవడం మామూలే. కానీ, మితవాద పక్షం తనను తాను పూర్తిగా విజృంభింపజేసుకుని, సైద్ధాంతిక, సాంస్కృతిక రంగాలతో సహా విశ్వరూపం చూపుతున్నప్పుడు, దాని విస్తరణ తాత్కాలికం కాదు, అది ఇతర పార్టీల సైద్ధాంతిక, రాజకీయ పునాదులను కూడా కుదిపివేసి తనను తాను స్థాపించుకుంటుంది. ఎన్‌డిఎ దశ దాటిన భారతీయ జనతాపార్టీ ఇతరులతో దేన్నీ పంచుకోనవసరం లేని, లేదా అతి తక్కువ మాత్రమే పంచుకోవలసిన స్థితిలోకి ప్రయాణిస్తున్నది. ఆ పార్టీ వైపు నుంచి చూసినప్పుడు, ఇది ఒక అసాధారణమైన, వేగవంతమైన విజయం. రంగంలో ఇంకా మిగిలి, మనుగడ కోసం పోరాడుతున్న లేదా గింజుకుంటున్న పక్షాలకు మాత్రం ప్రాణసంకటం. తమకు ముంచుకువస్తున్న ప్రమాదం తెలిసినప్పటికీ, వివేకానికి కొద్దిగా పదును పెట్టుకోలేక పోతున్న వివిధ పార్టీలను చూస్తే జాలి కలుగుతున్నది.

కాంగ్రెస్ పార్టీని వదిలేద్దాం. అది ప్రాయోపవేశ దీక్షలో ఉన్నది. తక్కిన అనేక పార్టీలు, ముఖ్యంగా ప్రాంతీయ, సామాజిక ప్రాతినిధ్య పార్టీలు, జనతాదళ్ అవశేష పార్టీలు– అన్నీ ఉనికి కోసం పోరాడుతున్నాయి. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యాన్ని బిజెపి ప్రకటించడం వెనుక, ఒక చరిత్రను, పరంపరను, వంశపాలనను, జాతీయోద్యమ జ్ఞాపకాలను అన్నిటినీ కాలనాళికలోకి పంపి వేయడం అనే ఆకాంక్ష ఉన్నది. నిజానికి, యుపిఎ రెండో ప్రభుత్వం అనంతరం కాంగ్రెస్ అతి వేగంగా పతనమైంది. ఒక ప్రతీకగా అయినా తాను దేనికి చెందుతానో, తానేమిటో తెలియని విస్మృతిలోకి ఆ పార్టీ జారిపోయింది. ఒకనాడు, ప్రాబల్యశక్తుల నేతృత్వంలోనే అయినప్పటికీ, సకల జనవర్గాలకు ఒకే ఒక్క ఛత్రంగా కనిపించి, ఆ సమ్మర్దాన్నే సమ్మిశ్రితత్వంగా భ్రమింపజేసిన జాతీయోద్యమ పార్టీకి వేర్వేరు దశల్లో వేర్వేరు ప్రత్యర్థులు రూపొందారు. తొలి దశాబ్దాలలోనే వ్యతిరేకించినవారు, తరువాత

తరువాత నిర్బంధాలను చీకటిరోజులను తట్టుకుని ప్రతిఘటించిన వారు, కేంద్రీకృత అధికారాన్ని బలహీనపరచడానికి ప్రాంతీయ ప్రతినిధులుగా బయలుదేరినవారు, మెజారిటేరియన్ ధోరణులు పెరుగుతున్న దశలో, బడుగులూ బలహీనులే అత్యధికులన్న స్పృహతో సామాజిక న్యాయం కోసం నిలబడినవారు– ఇప్పుడు వీరిలో ఏ ఒక్కరూ దృఢంగా నిలబడకపోగా, సహేంద్ర తక్షకాయ స్వాహా అన్నట్టుగా కాంగ్రెస్‌తో పాటు సహగమనం చేస్తున్నారు లేదా ప్రాణభిక్ష పెట్టమని ప్రాధేయపడుతున్నారు.

భారతీయ జనతాపార్టీ ఇంత శక్తిశాలిగా మారడం వెనుక, అది అనుసరించిన సిద్ధాంతమూ దాన్ని అన్వయించుకుని అమలు చేసిన వ్యూహాలూ మాత్రమే కాదు, దాని కార్యకర్తలు, అభిమానుల కట్టుబాటు, శ్రమా కూడా ఉన్నాయి. విజయాలు లభిస్తున్న కొద్దీ ఉత్సాహం పెరుగుతుంది, గెలుపు కనిపిస్తున్నప్పుడు సంకల్పం కూడా దృఢంగా ఉంటుంది. మంచి దూకుడులో ఉన్నది కాబట్టి, జైత్రయాత్ర అప్రతిహతంగా సాగుతున్నది. ఆ పార్టీ గెలుపుతో పాటు, సామాజికన్యాయ ఆకాంక్షలు, ప్రాంతీయ అస్తిత్వఆకాంక్షలు అన్నీ ముగిసిపోతాయా? అన్నిటికీ, అందరికీ ఒకే ఒక్క పక్షం ప్రత్యామ్నాయం అవుతుందా? కాంగ్రెస్ పతనం విపరీతమైన అధికార కేంద్రీకరణ, వ్యక్తి పూజ అనంతరమే మొదలైందనుకుంటే, ప్రస్తుత అధికారపార్టీ గతం నుంచి ఎందుకు నేర్చుకోవడం లేదు?


ఇందిరాగాంధీ నియంతృత్వం, వ్యక్తి నియంతృత్వం మాత్రమే. వ్యవస్థ కూడా దాన్ని ఎక్కువ కాలం మోయలేక పోయింది. ప్రస్తుతం అమలు జరుగుతున్న దానిని నియంతృత్వం అనలేము. దానికి మరేదో పేరున్నది. ప్రజల సమ్మతి నిరంతరం తయారవుతున్న పాలన ఇది. అత్యధిక ప్రజలు, ఎందువల్లనో, ఏ కారణం చేతనో, ఒక తెలియని శత్రువుని లేదా ఒక ఆపాదించు కున్న శత్రువుని నిరంతరం ద్వేషిస్తూ, ఆ ద్వేషం నుంచి తామస భావాలలో ఓలలాడుతూ, పాలకుల చర్యలకు జేజేలు పలుకు తున్నారు. ఇప్పుడు ఆవరించిన ప్రభావ ఉన్మాదంలో, ఇంతకాలం సమకూర్చుకున్న చిన్న చిన్న విలువలు కూడా కొట్టుకు పోతున్నాయి. సామాజిక నేపథ్యం, భాష, ప్రాంతం, నైసర్గికత– ఇవన్నీ ఉనికి నుంచి జారిపోతూ, మరేదో వర్చువల్ అస్తిత్వాలు ఆవరిస్తున్నాయి.

రాజసూయానికి ముందు, జైత్రయాత్ర పూర్తి కావాలి. అన్ని చోట్లా, అన్ని సార్లూ యుద్ధమే అవసరం ఉండదు. బ్రిటిష్ వారు దేశీయ రాజ్యాలను స్వాధీనం చేసుకోవడానికి అనేక పద్ధతులు అనుసరించేవారు. రాజులు కాలధర్మం చెందే వరకు ఎదురు చూసేవారు. వారసత్వ పోరు దగ్గర పేచీ పెట్టేవారు. దత్తత వివాదాల్లో వేలు పెట్టేవారు. ఇరుగుపొరుగు మధ్య తంపులు పెట్టేవారు. నితీశ్‌కుమార్, ఇప్పటికే స్వతంత్రత నుంచి సామంతానికి దిగిపోయారు. నవీన్‌పట్నాయక్ పెద్దవాడవు తున్నాడు. అవివాహితుడు, వారసులు లేరు. మమతా బెనర్జీ, అందరినీ శత్రువులు చేసుకున్నారు. తన కోపమే తన శత్రువు. జయలలిత, కరుణానిధీ ఇద్దరూ పోయారు. రంగంలోకి అనేకులను దింపి తమిళులను గందరగోళపరచాలి. అసలే, గట్టి పిండాలు, యాభై ఏళ్ల కిందటే కాంగ్రెస్‌ను గద్దె దింపిన ఘటికులు. ఇక జగన్మోహన్‌రెడ్డి. నిలువునా కేసులసంకెళ్లలో బందీగా ఉన్నారు. బిజెపికి ఇంకా బలం కుదరక కానీ, గద్దె ఖాళీ చేయించడం చిటెకెలో పని.

ద్వాపరయుగంలో అయితే, రాజులను జయించి కప్పాలు కట్టించుకుని సామంతులను చేసుకోవడం ఉండేది. ఇప్పుడు, సామంతాలు లేని విశాల సామ్రాజ్యమే అంతిమ లక్ష్యం. లొంగి ఉంటే, ప్రమాదం ఉండదని అనుకుంటున్నాయి కొన్ని పార్టీలు. పాలకశ్రేణిలో ఎక్కడా కల్తీ లేకుండా తమవారే ఉండాలని అనుకుంటున్నది విజేతపార్టీ. కాబట్టి, నామమాత్రపు ఉనికికి కూడా ఆస్కారం లేదు. ప్రజల అండ ఉంటే, సత్పరిపాలన సాగిస్తే, ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తే, నాలుగు కాలాల పాటు నిలవడం కుదరవచ్చు, పోరాడితే రాజసూయాన్ని నిలువరించనూవచ్చు, కానీ, లొంగితే ఉపయోగం ఏమిటి? ప్రత్యర్థితో ఐక్యమైపోవడం దాని కంటె మెరుగు. ఇంత దుస్థితి ఎందుకు వచ్చినట్టు అసలు? ప్రజల గౌరవం కోల్పోవడం వల్లనే కదా? ప్రాంతీయపార్టీలు, సామాజిక పార్టీలూ కుటుంబ పార్టీలు కావడం వల్లనే కదా, అవినీతులూ నియంతృత్వాలూ! సిద్ధాంతాలన్నీ గాలికిపోయి, కుటుంబ పాలన కోసమే తాపత్రయం అయినప్పుడు, వెన్నెముకను నమ్ముకోవడం కాక, ఎట్లాగో అట్లా సాగిలపడడమే మేలు అనిపిస్తుంది!

జిహెచ్‌ఎంసి ఎన్నికలలో గట్టి దెబ్బ తగిలింది. వెంటనే తెలంగాణ ప్రభుత్వానికి ఢిల్లీ రైతులు గుర్తుకు వచ్చారు. ఉద్యమాలలోను, ప్రజలలోనూ మాత్రమే రక్షణ ఉన్నదని గ్రహించారేమో అని కొందరు ఆశపడ్డారు. ఓటమి నుంచి జనం మనసులను మళ్లించడానికి బంద్ సమర్థన వచ్చిందేమో అని కొందరు సందేహించారు. ప్రతి ఒక్క పార్టీకి, అన్ని పార్టీల ప్రభుత్వాలకు లొసుగులుంటాయి. కేంద్రం చేతిలో సిబిఐ, ఈడీ, ఎన్సీబీ, ఎన్‌ఐఎ వంటి సంస్థలు ఉంటాయి. అధికారంలో ఉంటూ పోరాటం చేయడం మాటలు కాదు. యుద్ధ ప్రకటన చేసిన వెంటనే ప్రధానికి ప్రేమలేఖ రాస్తే ఏమిటి అర్థం? ప్రజలు అయోమయంలో పడతారు నిజమే, కానీ, నరేంద్రమోదీకి అర్థం కాదా సందేశమేమిటో? చలిలో గడ్డకట్టిపోతూ కూడా రైతు గట్టిగా ఉన్నాడు, తన ఫలసాయాన్ని కాపాడుకోవడానికి! రాష్ట్రం తానే తెచ్చానని, తన కష్టార్జితమని చెప్పుకునే పార్టీ, తన పంటను కాపాడుకోవద్దా? ❑

# ఎవరి మనోభావాలు నిజంగా దెబ్బతింటున్నాయి?



అనువాదం : **బోడపట్ల రవీందర్**

**రామ్ పునియాని**

కౌన్ బనేగా కరోడ్ పతి కేబీసీ బహుశా బాగా విజయవంతమయ్యే టీవీ ప్రసార కార్యక్రమాలలో ఒకటి. దీనిలో ఇవ్వజూపే బహుమతులకు, ఏ ఇతర ప్రసారిత క్విజ్ ప్రదర్శనలలో ఇచ్చే బహుమతులు సరితూగవు. అలాంటి కార్యక్రమం నుంచి ఈ నెలలో ప్రసారమైన ఒక ఎపిసోడ్, (కర్మయోగ్)లో కేబీసీ నిర్వాహకుడు అమితాబ్‌బచ్చన్ ఒక పోటీదారుడిని "డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తగులబెట్టిన పుస్తకం ఏది?" అని అడిగాడు.

కేబీసీలో అడిగే ప్రతీ ప్రశ్న చదువుకొనే విధంగా స్క్రీన్‌పైన కనపడుతుంది. అమితాబ్‌బచ్చన్ ప్రతి ప్రశ్నను త్వర, త్వరగా కూడా అడిగి పూర్తి చేయడు. ఆయన అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం "మనుస్మృతి". ఆ ప్రదర్శనకు హాజరైన అతిథి, దేశంలో ప్రముఖ కులవ్యతిరేక, పాకీపని (మాన్యువల్ స్కావెంజింగ్) వ్యతిరేక కార్యకర్త అయిన బెజవాడ విల్సన్‌ను ఆ ప్రశ్న అడిగాడు.

ప్రేక్షకులలో ఒక వర్గానికి చెందినవారు ఆ ప్రశ్నకు తీవ్రంగా స్పందించారు. ఆ ప్రశ్న, హిందూ మతాన్ని అవమానించడంగా భావించి కోపోద్రిక్తులయ్యారు. అది "వారి మనోభావాలను గాయ పర్చిందని", దానిలో హిందూ సమాజాన్ని విభజించే ప్రయత్నం కనిపించిందని అన్నారు. "నిరాశలో నుంచి, హిందూ వ్యతిరేకి కానటువంటి అంబేద్కర్‌ను హిందూ వ్యతిరేకిగా చూపించారు" అని వారి ఆగ్రహాన్ని ఒక ట్వీట్ ద్వారా వ్యక్తం చేశారు.

మనుస్మృతిలో స్పష్టంగా వివరించిన కుల వ్యవస్థ యొక్క భయంకరమైన స్వభావం పైన, ఆ ప్రశ్న దృష్టి మరల్చినట్టు భావించిన కొందరు ప్రేక్షకులు అభినందించారు. అయినప్పటికీ, కార్యక్రమ నిర్వాహకునికి, "హిందువుల మనోభావాలను గాయపరచాలని" ఉద్దేశపూర్వకంగా ఈ ప్రదర్శనను ఏర్పాటుచేసిన కార్యనిర్వహక అధికారులకు వ్యతిరేకంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఆధిపత్య హిందూ జాతీయవాద ఉపన్యాసం, మొదటి న్యాయశాఖా మంత్రి, కుల వ్యతిరేక ప్రచారకుడైన అంబేద్కర్‌ను, తమకున్న భావాలనే కలిగి ఉన్న వ్యక్తిగా చూపించే ప్రయత్నం చేస్తుంది. దాని ఫలితంగా హిందూ జాతీయవాదులకు, అంబేద్కర్ గురించి వివరణ ఇవ్వాలన్న ఒత్తిడి వచ్చింది. ఒకవైపు వారు ఆయనను కీర్తిస్తూనే, మరొకవైపు దళితుల సమాన హక్కుల సాధన కోసం ఆయనకున్న ఆలోచనలను, ఆయన పోరాటాలను అణగదొక్కాలని కోరుకుంటారు. అందుకే ఆరెస్సెస్, దాని అనుచరులు అంబేద్కర్ వార్షికోత్సవ సంబరాలను ఆనందంగా జరుపుకోవడం మనం చూస్తున్నాం. అలాంటి ఒక కార్యక్రమానికి 2016లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యాడు. దానిలో తనను తాను గొప్ప "అంబేద్కర్ భక్తునిగా" వర్ణించుకున్నాడు. అంతేకాకుండా ఆయన అంబేద్కర్‌ను, అమెరికాకు చెందిన పౌర హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌తో పోల్చాడు.

కానీ మార్టిన్ లూథర్ కింగ్, ఆ కాలంలో నోబెల్ బహుమతి పొందిన అతి పిన్న వయస్కుడు (అప్పటికి ఆయన ఇంకా 35 ఏండ్ల యువకుడే)గా ఉంటే, కేబీసీ ప్రదర్శనలో అతిథిగా హాజరైన విల్సన్ దశాబ్దాల కాలంగా అమానవీయమైన పాకీ పనికి (చేతులతో) వ్యతిరేకంగా కృషి చేస్తున్నాడు. కర్మ యోగ్ పేరుతో ఉన్న ఒక రచనలో మోడీ రాసిన తన ముందుమాటలో, చేతులతో చేసే పాకీ పనిని ఒక "ఆధ్యాత్మిక" అనుభవంగా కీర్తించాడు.

### అంటే, ఎవరి మనోభావాలు వాస్తవంగా దెబ్బ తింటున్నాయి?

ఒక వాస్తవ చారిత్రక సంఘటన అయిన, 'మనుస్మృతి దహనం' వలన తమ మనోభావాలు దెబ్బతిన్నాయని చెపుతున్న అదే ప్రజలు, మహమ్మద్ ప్రవక్తను అమర్యాదగా చూపించే కార్టూన్ల విషయానికి వచ్చేసరికి "వారి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ"ను తీవ్ర స్వరంతో సమర్థించుకుంటారు. ఘోరమైన వ్యంగ్యం ఏమంటే, "కార్టూన్‌లు తమ మనోభావాలను గాయపరిచాయనే" కారణంతో మూఢభక్తులు కొందరు ఫ్రాన్స్‌లో నలుగురిని హత్య చేశారు.

అంబేద్కర్ ఒక గొప్ప మేధావి. ఆయన భారతదేశంలో అత్యంత శక్తివంతమైన కుల వ్యతిరేక, అంటరానితనం వ్యతిరేక ఉద్యమాలలో ఒక దానికి నాయకత్వం వహించాడు. హిందూ ఆచారాలను విమర్శించే పరిస్థితి వచ్చినప్పుడు, ఇతరులకు కోపం వచ్చినప్పటికీ, ఆయన నిష్కర్షగా మాట్లాడేవాడు. ఆయన అవగాహనలో, హిందూ మతం అనేది బ్రాహ్మణవాద మత శాస్త్రం. 15వ శతాబ్దపు కవి అయిన కబీర్‌ను ఆయన తన గురువుగా పరిగణించాడు. ఆయనకు భక్తి సాంప్రదాయాల పట్ల ఉండే ప్రేమ, స్నేహపూర్వక సంబంధాలను సమర్థించాడు కానీ, హిందూ మతంలో ఉన్న అనేక భావాలలో ఆధిపత్య ధోరణి ఉన్నది

బ్రాహ్మణవాదానికే అని గుర్తించిన విషయం మనకు ఆయన జీవితం నుంచి, ఆయన రచనల నుంచి మనకు అర్థం అర్థమవు తుంది. అందుకే ఆయన "హిందూమతాన్ని బ్రాహ్మణవాద మత శాస్త్రం" అని నమ్మాడు.

అంబేద్కర్ మనుస్మృతిలో, కేంద్రీకరించబడిన బ్రాహ్మణవాద విలువల వ్యక్తీకరణను చూశాడు. అందుకే ఆయన, అందరూ ఉపయోగించే తాగునీటి బావులలో దళితులు కూడా నీరు తోడుకునేందుకు, దేవాలయాలలో ప్రవేశించే హక్కుల కోసం పోరాటం చేస్తూ, హిందువులలో ఒక వర్గానికి చెందిన వారు పవిత్రంగా భావించే ఆ పుస్తకాన్ని తగులబెట్టే కార్యక్రమాన్ని పర్యవేక్షించాడు.

ఈనాడు మనుస్మృతిని చదివి, అనుసరించే వారు ఎవరు? అని మీరు ఆశ్చర్యంగా అడుగవచ్చు. అనేకమంది భారతీయులకు సంస్కృతరచనలు అందుబాటులో ఉండకపోవచ్చు, అయినప్పటికీ ఆ రచనలు భారతీయ విలువల వ్యవస్థ పైన, హిందువులలోని కొన్ని పెద్ద సెక్షన్లపైన అది ప్రభావం చూపుతున్నది. అక్షయ ముకుల్ అనే జర్నలిస్టు తన రచన 'గీత ప్రెస్'లో హిందువుల మనసులపై ఈ ప్రచురణ సంస్థ ఎంత ప్రభావం చూపిందో వివరించాడు. ఏ గీత ప్రచురణ సంస్థ స్టోర్‌కు వెళ్ళినా, దానిలో తక్కువ ఖరీదులో అచ్చు అయిన పుస్తకాలు, పెద్ద సంఖ్యలో ప్రజలకు ఏ విధంగా మనువు విలువలను స్పష్టంగా తెలియ జేస్తాయో వివరిస్తాయి. "హిందూ మహిళల విధులు"పై సాధారణ, ప్రజల భాషలో ప్రచురితమైన అలాంటి ఒక రచన మనుస్మృతి వివరణ తప్ప వేరే ఏదీ కాదు. ఇంకా అవాక్కయ్యే విషయం ఏమిటంటే, ఈ పుస్తకాన్ని ఐదు రూపాయల ధరతో కొన్ని లక్షల కాపీలు అచ్చు వేశారు.

అంబేద్కర్ "హిందూ వ్యతిరేకి" కాదని కొందరు వాదించ వచ్చు, కానీ ఈ విషయంలో స్వయంగా ఆయన మాటలు, ఇంతకు ముందు మనకు తెలియని ఆసక్తికరమైన విషయాలను తెలియజేస్తాయి. "హిందూమతం, కులం చుట్టూ పరిభ్రమించే, నిజం అనిపించే విధంగా కనిపించే సామాజిక, రాజకీయ, పరిశుద్ధ నియమ నిబంధనలు తప్ప వేరే కాదు" అని ఆయన అన్నాడు. తాను హిందువుగా పుట్టినప్పటికీ, హిందువుగా మరణించనని వాగ్దానం చేసి, దానిని నిలబెట్టుకున్నాడు. నేటి పాలకపార్టీ లక్ష్యమైన హిందూ రాజ్య స్థాపనపైన కూడా ఆయనకు అవే అభిప్రాయాలు ఉన్నాయి. దేశ విభజనపై ఆయన చేసిన రచనలో "ఒకవేళ హిందూ రాజ్యస్థాపనే నిజమైతే, ఈ దేశానికి అది పెద్ద విపత్తు కావడంలో ఎటువంటి సందేహం లేదు. హిందువులు ఏమనుకున్నా ఏమీ లేదు, హిందూ మతం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వానికి ఒక పెద్ద ప్రమాదం. ఆ కారణంగా హిందూ మతానికి ప్రజాస్వామ్యంతో పొసగదు. ఏ విధంగానైనా హిందూ రాజ్యాన్ని అడ్డుకోవాలి" అని ఆయన పేర్కొన్నాడు.


అలాంటి సూత్రీకరణలు ఉన్నప్పటికీ, బీజేపీ రాజకీయ వ్యూహంలో అంబేద్కర్‌ను కీర్తిస్తూనే, ఆయన ఆలోచనలను బలహీనపర్చి, సామాజికంగా ఆయన చర్యలపై పోరాటం చేయడానికి కొన్ని కఠోరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు, అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించాడు, కానీ హిందూత్వశిబిరానికి, వారికి సంతృప్తినిచ్చే వ్యవస్థతో రాజ్యాంగాన్ని భర్తీ చేయాలని ఉంది. క్షేత్ర స్థాయిలో దళితులలో ప్రభావం చూపేందుకు వారు బహుముఖ వ్యూహాలను అవలంబిస్తున్నారు. అంబేద్కర్ "కుల నిర్మూలనకు" పిలుపు ఇస్తే, ఆరెస్సెస్ ఆ పిలుపునకు వ్యతిరేకంగా, హిందూ సమాజానికి కుల వ్యవస్థే బలం, అన్ని కులాలు సమానమే, కానీ అవి పోషించే పాత్రలు భిన్నమైనవిగా నిర్ణయం చేశారనే సందేశాన్ని ప్రచారం చేసే "సామాజిక సమరసత మంచ్" (సామాజిక సామరస్య ఫోరం) ను స్థాపించింది.

దళితులను హిందూత్వలో భాగం చేసేందుకు హిందూ జాతీయవాద రాజకీయాలలో వారిని పదాతిదళం (ఫుట్ సోల్జర్స్) గా సిద్ధం చేసేందుకు, వారి రాజకీయ విశ్వాసాలకు అనుగుణమైన "సామాజిక మార్పు" కోసం ఒక ప్రయత్నం జరుగుతూ ఉంది. కొందరు దళిత నాయకులు అధికారానికి ఆకర్షితులై హిందూత్వలో భాగం అయ్యేందుకు ఉత్సుకత చూపుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల కాలంలో తనను తాను "మోడీకి హనుమంతుడినని" ప్రకటించుకున్న బీహార్ రాష్ట్రానికి చెందిన లోక్‌జనశక్తి పార్టీ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడైన చిరాగ్ పాశ్వాన్ చాలా బాగా వ్యక్తీకరించాడు.

అంబేద్కర్ భావజాలం, సామాజిక పోరాటాలకు అనుగుణంగా, దళిత నాయకులలో ఒక వర్గానికి చెందిన వారు, సామాజిక కార్యకర్తలు దళితుల గౌరవం, దళితుల సామాజిక సమానత్వం కోసం కృషి చేస్తున్నారు. అలాంటి నాయకులు చాలా తక్కువగా ఉండటం, వారి ప్రయత్నాలను బలహీన పర్చడం ప్రధానమైన అడ్డంకిగా మారింది. భారతదేశం, సామాజిక న్యాయం, బాబాసాహెబ్ కలలను నిజం చేసే దిశగా, కదం తొక్కడానికి ముందు అధిగమించాల్సిన సవాళ్ళు వారికి అనేకం ఉన్నాయి. దానిలో భాగంగానే ఆయన మనుస్మృతిని తగులబెట్టడానికి దారి తీసింది. ❑

"న్యూస్ క్లిక్" సౌజన్యంతో


# ప్రపంచపు తొలి మార్క్సిస్టు



**సీతారాం ఏచూరి**
సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి

నవంబరు 28, 2020 ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి. ఈ కరోనా మహమ్మారి విజృంభణ, దాని పర్యవసానంగా మనం తప్పనిసరిగా పాటించవలసిన జాగ్రత్తలు, లాక్‌డౌన్ నిబంధనలు మనకు పరిమితులు విధించాయి గాని లేకుంటే 2018-19లో మార్క్స్ ద్విశత జయంతిని ఏవిధంగా ఘనంగా నిర్వహించామో, అదే విధంగా ఇప్పుడూ నిర్వహించ వలసిన సందర్భం ఇది.

మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని ఆవిష్కరించడంలో, దానిని విశదీకరించడంలో ఎంగెల్స్ పాత్ర, సైద్ధాంతిక కృషి అత్యంత ప్రాధాన్యత కలిగి వుంది. గతితార్కిక పద్ధతి వ్యక్తమైన తీరును, విశ్వంలో సమస్త భౌతిక పరిణామ క్రమానికి వర్తించే నియమాలను, జీవ పరిణామ క్రమాన్ని, మానవ సమాజ పరిణామ క్రమాన్ని అవగాహన చేసుకోడానికి, వాటిలోని గతి తర్కాన్ని గుర్తించడానికి ఎంగెల్స్ సైద్ధాంతిక కృషి ఎంతగానో తోడ్పడుతుంది. నిజానికి ఎంగెల్స్ రచనలను, మానవ మేధ, దార్శనికత, నాగరికతల పురోగమనంలో ఎంగెల్స్ పోషించిన సృజనాత్మక పాత్రను తిరిగి అధ్యయనం చేయవలసిన తరుణం ఇది. ఏదో ఒక్క వ్యాసంలోనే దీనినంతా వివరించడం అసాధ్యం. ప్రస్తుత పరిమితులెలా ఉన్నా, పార్టీ ఈ అంశాలన్నింటి పైనా రానున్న ఏడాది పొడవునా కార్యక్రమాలను చేపడుతుంది.



నేను ప్రస్తుతం ఒక ప్రధాన అంశాన్ని మాత్రం చర్చిస్తాను. ఆచరణను, సిద్ధాంతాన్ని గతితార్కికంగా మేళవించే ఒక ఆలోచనా విధానంగా మార్క్సిజానికి ఆ పేరు కార్ల్‌మార్క్స్ నుండి వచ్చింది. అయితే ఈ విషయంలో ఎంగెల్స్ నిర్వహించినది అంత ప్రధానమైన పాత్ర కాదనే అభిప్రాయం తరుచుగా వ్యక్తమౌతూ వుంటుంది. ఇది చాలా, చాలా పొరపాటు అభిప్రాయం అనే చెప్పాలి. తన రచనలలో పాదార్థిక, సామాజిక జీవితంలోని అన్ని అంశాలలోనూ గతితర్కాన్ని ఆవిష్కరించిన తీరును చూస్తే ఎంగెల్స్ ఎంత ప్రధానమైన పాత్ర పోషించాడో తెలుస్తుంది. మానవ సమాజం పురోగమిస్తున్న ప్రస్తుత తరుణంలో, కొత్త పుంతలు తొక్కుతున్న శాస్త్రవిజ్ఞాన ఆవిష్కరణల నేపథ్యంలో ఎంగెల్స్ చేసిన ప్రతీ రచననూ మరోసారి చదవాల్సిన అవసరం ఉంది.

## సంయుక్తంగా మార్క్సిజం ఆవిష్కరణ

ఫ్రెడరిక్ ఎంగెల్స్ గురించి ప్రస్తావించేటప్పుడు తరుచూ 'ఆయన ప్రపంచంలో తొలి మార్క్సిస్టు' అని అభివర్ణిస్తారు. తనకు అంత పెద్ద ప్రాధాన్యత లేదన్నట్టుగా తనదైన నమ్రతతో వ్యవహరించే ఎంగెల్స్ ఈ హోదాను మాత్రం సగర్వంగా స్వీకరించి వుండేవాడు. "మార్క్స్ ఏదైతే సాధించగలిగాడో, దానిని నేనైతే మాత్రం ఎన్నటికీ సాధించి వుండేవాడిని కాను. తక్కిన మా అందరి కన్నా మార్క్స్ ఎత్తున ఉండేవాడు. మాకన్నా దూరం ఆలోచించే వాడు. మా అందరికన్నా తొందరగా, అందరికన్నా విశాలంగా చూడ గలిగేవాడు. మార్క్స్ ఒక ప్రజ్ఞావంతుడైన మేధావి. మేమంతా మహా అయితే నైపుణ్యం గల వాళ్ళం మాత్రమే. అతనే లేకపోతే ఆ సిద్ధాంతం ఇప్పుడున్న దానికంటే చాలా వెనుకనే ఉండిపోయేది. అందుచేత ఆ సిద్ధాంతానికి ఆయన పేరు రావడమే సరైనది" అని ఎంగెల్స్ ఒక సందర్భంలో అన్నాడు.

ఇది ఎలా ఉన్నప్పటికీ, ఎంగెల్స్ గురించి మార్క్స్ అంచనా గమనార్హం. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం యొక్క సైద్ధాంతిక పునాదుల ఆవిష్కరణలో ఎంగెల్స్‌కు మార్క్స్ ప్రత్యేక స్థానాన్ని కల్పించాడు.

## మార్క్స్-ఎంగెల్స్ సహచర్యం

'రేనిష్ జేటుంగ్' అనే పత్రికకు మార్క్స్ సంపాదకుడిగా ఉండేవాడు. మార్చి 1843లో ఆ పత్రికను మితవాద ప్రష్యన్ ప్రభుత్వం నిషేధించింది. 1844 ప్రారంభంలో మార్క్స్ పారిస్‌కు మకాం మార్చాడు. అక్కడ మార్క్స్ "డేయిష్‌ఫ్రాంజోసిష్ జాబుషర్" అనే పత్రిక సంపాదకత్వం చేపట్టాడు. ఆనాడు ఈ పత్రికకు వ్యాసాలు పంపే వారిలో అతి పిన్న వయస్కుడు ఎంగెల్స్. తర్వాత కాలంలో నిర్వహణలో సహచరుడిగా మారాడు. 1844లో "రాజకీయ అర్థశాస్త్ర విమర్శ సింహావలోకనం" అనే వ్యాసాన్ని ఎంగెల్స్ రాశాడు. ఈ వ్యాసంలో బూర్జువా అర్థశాస్త్ర విమర్శకు సంబంధించిన మూల సూత్రాలను పేర్కొన్నాడు. బూర్జువా

ఆర్థికవ్యవస్థలోని అన్ని లక్షణాలూ ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్య హక్కులను కల్పించే నిబంధనల నుండే అనివార్యంగా పుట్టుకొస్తాయని నిరూపించాడు. ఈ ప్రైవేటు యాజమాన్యం పోకుండా సమాజంలో పేదరికాన్ని పోగొట్టడం సాధ్యం కాదని కూడా నిరూపించాడు. దీనితో మార్క్స్ ముగ్ధుడయ్యాడు. హెగెలియన్ తత్వశాస్త్రంపై విమర్శ ద్వారా తాను ఏ నిర్ధారణకు వచ్చాడో, అదే నిర్ధారణకు మరొక మేధావి బూర్జువా ఆర్థిక వ్యవస్థపై విమర్శ ద్వారా వచ్చినట్టు నిర్ధారణకు వచ్చాడు. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం ఒక సిద్ధాంతంగా రూపు దిద్దుకోవడంలో వారిరువురి కృషి ఉమ్మడిగా సాగడానికి, వారి స్నేహానికి, ఉద్యమంలో కలసి పని చేయడానికి, జీవితాంతం సహచరులుగా కొనసాగడానికి ఇది పునాది వేసింది.

"ఇంగ్లాండులో కార్మికుల స్థితిగతులు" అన్న గ్రంథాన్ని ఎంగెల్స్ రచించాడు. ఇది ఒక దిశా నిర్దేశం చేసిన రచన. ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం ఏ విధంగా ప్రారంభం అయిందో, ఏ విధంగా పరిణామం చెందుతోందో పరిశీలిస్తున్న మార్క్స్ ఆలోచనను బాగా ప్రభావితం చేసింది ఈ రచన. ఆగస్టు 1844లో పది రోజుల పాటు వారిరువురూ చర్చలు సాగించారు. ఆ క్రమంలో ఎంగెల్స్‌లో ఉన్న ప్రజ్ఞను మార్క్స్ మరింతగా గుర్తించాడు. ఎంగెల్స్ ప్రదర్శించిన ధైర్యాన్ని, అంకితభావాన్ని, అతని ఏకాగ్రతను మార్క్స్ ఎంతగానో ప్రశంసించాడు. ఆనాటి సైద్ధాంతిక అంశాలన్నింటిపైనా వారిరువురికీ ఏకాభిప్రాయం ఉన్నట్టు గుర్తించాడు.

"పవిత్ర కుటుంబం" లేదా "విమర్శనాత్మక విమర్శపై విమర్శ" అన్న పుస్తకాన్ని ఇద్దరూ ఉమ్మడిగా 1844లో రచించారు. తత్వశాస్త్రం పైన, రాజకీయ అర్థశాస్త్రం పైన భావవాదం చూపుతున్న ప్రభావాన్ని పటాపంచలు చేస్తూ ఆ రచన సాగింది.

ప్రకృతికి అతీతమైన శక్తులు గాని, మానవ చైతన్యం గాని లేదా కొందరు విశిష్ట వ్యక్తులు గాని చరిత్రను సృష్టించరని వారిద్దరూ ఆ గ్రంథంలో రుజువు చేశారు. సమాజం ముందుకు సాగేది శ్రామిక ప్రజల శ్రమ వలన, వారు నడిపే రాజకీయ పోరాటాల వలన మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పెట్టుబడిదారీ సమాజంలో తమ జీవన పరిస్థితుల్ని మార్చకుండా శ్రామికవర్గం స్వేచ్ఛ పొందజాలరని, అందుచేత సమాజాన్ని దోపిడీ నుండి విముక్తి చేసే చారిత్రిక కర్తవ్యాన్ని శ్రామిక వర్గం నిర్వహించాల్సి వుంటుందని వివరిస్తుంది.

తాత్విక రంగంలో అప్పటి వరకూ పైచేయిగా ఉన్న భావవాదాన్ని ఎదిరించి భౌతికవాద పునాదిపై తత్వశాస్త్రాన్ని తిరిగి నిలబెట్టాల్సిన కర్తవ్యం ఉంది. 1845–46లో "జర్మన్ తత్వశాస్త్రం" అన్న గ్రంథం ద్వారా మార్క్స్, ఎంగెల్స్ ఆ పని పూర్తి చేశారు. వారు ఉభయులూ చేసిన ఈ రచనలో సమగ్రంగా, ఒక క్రమ పద్ధతిలో శ్రామికవర్గ ప్రాపంచిక దృక్పథం అయిన గతితార్కిక, చారిత్రిక భౌతిక వాదానికి సంబంధించిన మూల సూత్రాలను రూపొందించారు.

నిజానికి, 1843–45 మధ్యకాలం మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం పరిణామంలో చాలా ఫలవంతమైన కాలం. విప్లవకర ప్రజాస్వామ్యం నుండి శ్రామికవర్గ విప్లవంగా, హెగెలియన్ ప్రభావం నుండి చారిత్రిక భౌతికవాదంగా, తత్వ శాస్త్రం నుండి రాజకీయ అర్థశాస్త్రం వైపుగా మలుపు తిరిగింది. మార్క్స్, ఎంగెల్స్ ఇద్దరూ కలిసి ఈ మౌలిక కృషి చేశారు.

న్యాయం గురించిన హెగెలియన్ తాత్విక సిద్ధాంతాన్ని మార్క్స్ విమర్శనాత్మకంగా పరిశీలించాడు. న్యాయ సంబంధాలు కాని, రాజకీయ రూపాలు గాని వాటంతట అవే మనకు అవగతం కావని, మానవ మేధస్సు, లేదా చైతన్యం చెందే పరిణామం బట్టి కూడా అవగతం కావని, జీవితపు భౌతిక అస్తిత్వాన్ని బట్టి, అది ఉన్న భౌతిక పరిస్థితులను బట్టి మాత్రమే అవగతం చేసుకోగలుగు తామని మార్క్స్ నిర్ధారణకు వచ్చాడు. "పౌర సమాజం" అన్న పేర హెగెల్ ఒక ఆదర్శవంతమైన సమాజాన్ని చిత్రించాడు. "అఖండ భావం సాకారమయ్యే కొద్దీ" ప్రకృతికి అతీతమైన దాని ప్రభావం వలన ఈ ఆదర్శ సమాజం రూపొందుతుందని హెగెల్ భావించాడు. అయితే మార్క్స్ మాత్రం పౌర సమాజం నిర్మాణం రాజకీయ అర్థశాస్త్రంలోనే దొరుకుతుందన్న నిర్ధారణకు వచ్చాడు. అక్కడ నుండి మొదలై గతితార్కిక భౌతికవాదపు శక్తివంతమైన మూలసూత్రం "మానవుల చైతన్యం వారి అస్తిత్వాన్ని నిర్ణయించదు. తద్భిన్నంగా వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది." వద్దకు వచ్చాడు. 1848లో "కమ్యూనిస్టు ప్రణాళిక"ను ఇద్దరూ ఉమ్మడిగా రచించారు. మొదటి ఇంటర్నేషనల్ స్థాపనలో ఇద్దరూ ముఖ్య పాత్ర పోషించారు. తత్వశాస్త్రం పైన, రాజకీయ అర్థశాస్త్రం పైన విమర్శలను మేళవించి వారిద్దరూ రూపొందించిన విప్లవ సిద్ధాంతం 'కమ్యూనిస్టు ప్రణాళిక' లో వ్యక్తమైంది.

## ప్రకృతిలో గతితర్కం, మానవ సమాజ జీవితం

పెట్టుబడిదారీ వ్యవస్థ నడకను చీల్చి చెండాడే పనిలో మార్క్స్ పూర్తిగా మునిగిపోయాడు. ఆ కృషి పెట్టుబడి గ్రంథ రూపం అంతిమంగా తీసుకుంది. అందులో పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోనే మానవ శ్రమ దోపిడీ జరుగుతుందని నిరూపించాడు. అందుచేత మానవజాతి విముక్తి సాధించాలంటే పెట్టుబడిదారీ సమాజాన్ని కూలదోయడం అనేది కేవలం ఒక నైతికమైన కర్తవ్యం మాత్రమే కాదని, అదొక శాస్త్రీయమైన ఆవశ్యకత అని రుజువు చేశాడు. ఈ సమయంలో గతితర్కాన్ని, ఇతర రంగాలలోకి విస్తరించి వర్తింపజేయడంమీద ఎంగెల్స్ దృష్టిని కేంద్రీకరించాడు.

## మానవుడు-ప్రకృతి యొక్క గతితర్కం :

గతితార్కిక చారిత్రిక భౌతిక వాదానికి ప్రాతిపదిక మానవుడికి, ప్రకృతికి నడుమ నిరంతరం ఉండే గతితార్కిక సంబంధం. తన జీవితాన్ని, తన చుట్టూ ఉండే పరిస్థితులను

మరింత మెరుగు పరుచుకోవడం కోసం ప్రకృతిని తనకనువుగా మలుచుకొనే ప్రయత్నాలను మానవులు నిరంతరం సాగిస్తూనే వుంటారు. ఈ క్రమంలో మానవులు ప్రకృతిని తమకనుగుణంగా మార్చుకుంటూ వున్నప్పుడే ప్రకృతి కూడా మానవులను, మానవ పరిణామాన్ని ప్రభావితం చేస్తుంది. ఇదొక గతితార్కిక క్రమం. "వానరుడి నుండి నరుడిగా మారిన పరిణామ క్రమంలో శ్రమ పాత్ర" అన్న తన వ్యాసంలో ఎంగెల్స్ మానవులకు, ప్రకృతికి మధ్య గతితార్కిక క్రమం ఏ విధంగా పరిణామం చెందుతుందో వివరించాడు. మనిషి చేతులు, జ్ఞానేంద్రియాలు, వాక్కు వంటివి అభివృద్ధి చెందడం వెనక శ్రమ ఎటువంటి పాత్ర పోషించిందో తెలియజేశాడు. ఇవన్నీ ఏదో ఒక దైవశక్తి సృష్టించినవి కావని, భౌతిక జీవిత క్రమంలోనే అవి రూపొందాయని తేల్చిచెప్పాడు.

### ప్రకృతిలో గతితర్కం :

ప్రకృతికి, శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి గతితార్కిక భౌతికవాదాన్ని వర్తింపజేస్తూ ఎంగెల్స్ ముందుకు సాగాడు. "ప్రకృతి, మానవ సమాజం, ఆలోచన –వీటిలో కలిగే మార్పులకు, అభివృద్ధికి సంబంధించిన సర్వ సాధారణ నియమాలే గతితర్కం" అని నిర్ధారించాడు.

### గతితర్కం-ఆంత్రోపాలజీ :

(మానవుడు ఒక జంతువు అనే దృష్టితో చేసే సంపూర్ణ పరిశీలన–ఆంత్రోపాలజీ) ఎంగెల్స్ తన కాలం నాటికి అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా (ప్రాచీన సమాజాల, త్రవ్వకాలలో లభించిన అవశేషాల, పరిశోధనల ఆధారంగా) చారిత్రిక భౌతిక వాదాన్ని మానవ పరిణామ క్రమానికి వర్తింప జేశాడు. "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యం ఆవిర్భావం" అన్న తన గ్రంథంలో ఆధునిక వర్గ సమాజం గురించి ప్రచారంలో ఉన్న కట్టుకథలనన్నింటినీ బట్టబయలు చేశాడు. ఆస్తి ప్రాతిపదికన ఏర్పడిన వర్గ సంబంధాలు ఏవిధంగా కుటుంబం పుట్టుకను మార్చివేశాయో, చారిత్రికంగా స్త్రీ ఏవిధంగా ఓటమి చెందిందో, పాతివ్రత్యం, పితృస్వామిక సమాజం, వాటి పర్యవసానంగా మహిళల అణచివేత ఏవిధంగా సంభవించాయో నిరూపించాడు.

### గతితర్కం-చరిత్ర :

"జర్మనీలో రైతాంగ యుద్ధం" (1849–50) అనే గ్రంథంలో మొదటిసారిగా ఎంగెల్స్ గతితార్కిక భౌతిక వాదాన్ని వాస్తవ చరిత్రకు వర్తింపజేశాడు.

### గతితర్కం-తత్వశాస్త్రం :

యూజెన్ డూరింగ్ అనే ఒక తత్వవేత్త మార్క్సిజాన్ని పూర్వ పక్షం చేస్తూ తానొక బ్రహ్మాండమైన సిద్ధాంతాన్ని రూపొందించానని చెప్పుకున్నాడు. అతగాడి సిద్ధాంతాన్ని ఖండిస్తూ యాంటీ–డూరింగ్ అనే గ్రంథాన్ని ఎంగెల్స్ రచించాడు. మార్క్సిజాన్ని, గతితార్కిక, చారిత్రిక భౌతిక వాదాన్ని సమర్ధిస్తూ సాగిన ఈ గ్రంథం చాలా ప్రభావం కలుగజేసింది. అందుచేత, దాదాపు అన్ని రకాల కార్యాచరణలోనూ, ప్రయత్నాలలోనూ మార్క్సుతో కలిసి సంయుక్తంగా, స్వతంత్రంగా ఎంగెల్స్ చాలా ఫలవంతమైన కృషి చేశాడు. ప్రకృతి శాస్త్రాలలో, ఆంత్రోపాలజీలో, చరిత్రలో, రాజకీయ అర్ధశాస్త్రంలో, తత్వశాస్త్రంలో మానవుడు– ప్రకృతి నడుమ గల గతితార్కిక సంబంధం ఏవిధంగా వర్తిస్తుందో వివరించాడు. తద్వారా విప్లవోద్యమానికి, విప్లవ సిద్ధాంత పునాదుల నిర్మాణానికి తన వంతుగా ప్రత్యేక సేవ, తోడ్పాటు చేశాడు. వారిద్దరూ విడివిడిగా గాని, ఉమ్మడిగా గాని చేసిన రచనలు అన్నీ ఆ ఇద్దరూ పరస్పరం చర్చించుకున్నాకనే చేశారని ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి.

### రాజకీయ కార్యాచరణ


నవ యుగానికి బాటలు వేసే ఇటువంటి సిద్ధాంతానికి పునాదులు వేసిన ఈ ఇద్దరు మహానేతలూ అంతర్జాతీయ కార్మిక ఉద్యమంలో కేవలం సిద్ధాంతాన్ని బోధించేందుకే పరిమితం కాలేదు. ఆనాటి కార్మికోద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. కొన్ని సందర్భాలలో వాటికి నాయకత్వం వహించారు, మార్గదర్శకత్వం అందించారు. శ్రామిక వర్గాన్ని విజయ సాధన దిశగా నడిపించే శక్తి గల ఒక విప్లవకర సంస్థ నిర్మాణానికి ఈ ఇద్దరు మహా నేతలూ తమ జీవితాలను ధారపోశారు. మొదటి ఇంటర్నేషనల్ అనే పేర ప్రసిద్ధికెక్కిన 'ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్'ను స్థాపించడంలో (1864) వారిద్దరూ ముఖ్య పాత్రను పోషించారు. వామపక్షవాద గ్రూపులన్నింటినీ ఒక ఉమ్మడి సంస్థలోకి తీసుకు వచ్చి సంఘటితం చేయడానికి చేసిన మొట్టమొదటి ప్రయత్నం అది. అంతర్జాతీయ కార్మికోద్యమంలో అది ముఖ్యమైన తొలి అడుగు.

### శాస్త్రీయత-విప్లవకారుడు

అంతర్జాతీయ కార్మికోద్యమానికి, ప్రపంచానికి మార్క్సిస్టు దృక్పథం గురించి, ఎంతో విలువైన ఆ సిద్ధాంత పునాదుల గురించి, మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ ద్వారానే ప్రధానంగా తెలిసింది. అసంఖ్యాకంగా మార్క్స్ విడిచి వెళ్ళిన ఆయన నోట్సులను ఒక క్రమ పద్ధతిలో పెట్టి వాటిని ఎడిట్ చేసి 'పెట్టుబడి' గ్రంథం రెండవ, మూడవ సంపుటాలను ప్రచురించడంలో ఎంగెల్స్ కీలక పాత్ర పోషించాడు. 'కమ్యూనిస్టు ప్రణాళిక'కు, వారిద్దరి ఇతర రచనల మలి సంపుటాలకు ఆయా వర్తమాన పరిణామాల ఆధారంగా ముందు మాటలు రాశాడు. తద్వారా అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాటాలు ముందుకు సాగడానికి ప్రేరణ కలిగించాడు.


లెనిన్ చెప్పినట్టు ఎంగెల్స్ "శ్రామిక వర్గానికి తామేమిటో నేర్పి తమ గురించిన స్పృహ కలిగించాడు, కలల స్థానే శాస్త్రీయతను ప్రతిష్టించాడు". (స్వేచ్ఛానుసరణ)

# శాస్త్రీయ విప్లవకారుడు, మహామేధావి ఏంగెల్స్



**అనిల్ రాజింవాలె**
సిపిఐ జాతీయ నాయకులు

అరుదైన మేధావి, తాత్వికుడు ఫ్రెడరిక్ ఏంగెల్స్ మార్క్సిజం అభివృద్ధికి చేసిన గొప్ప దోహదాలను, ఆయన జీవితాన్ని స్మరించుకుంటూ ఈ సంవత్సరం నవంబరు 28న ఆయన ద్విశత జయంతి వేడుకలు ప్రపంచవ్యాప్తంగా జరిగాయి. ఆయన తన శకాన్ని పరివేష్టించారు, ఇంకా భవిష్యత్‌ను దర్శించారు. కారల్‌మార్క్స్‌తో కలిసి ఆయన చరిత్రకు సంబంధించి భౌతికవాద భావనకు పునాదులు వేశారు, ప్రకృతి, చైతన్యం గతితర్కాన్ని ఆవిష్కరించారు. ఈ క్రమంలో, అధునాతన ఉత్పత్తి సాధనాలతో పనిచేస్తున్న చారిత్రకవర్గమైన పారిశ్రామిక కార్మికుల విముక్తికి సైద్ధాంతిక ప్రాతిపదికను రూపొందించారు. కమ్యూనిస్టు ప్రణాళిక (కమ్యూనిస్టు మ్యానిఫెస్టో) తొలి ముసాయిదాలను, ఇంగ్లండ్‌లో కార్మిక వర్గ పరిస్థితులు' (1844) రచించిన వ్యక్తి ఏంగెల్స్, కార్మికుల మురికివాడలకు నేరుగా వెళ్లి, రికార్డులు అధ్యయనం చేసి ఆయన ఆ రచన చేశారు.



ఆయన కారల్‌మార్క్స్‌తో కలిసి కృషి చేసినట్లు అందరికీ తెలుసు. అయితే ఆయన తనకు తానుగా మహా చింతనాపరుడు. ఆయన పేరు మార్క్స్ పేరు నుండి విడదీయలేనిదైనప్పటికీ, ఆయన స్వయంగా చేసిన అపారమైన దోహదాలు ఏ మాత్రం తక్కువ కావు.

మార్క్స్-ఏంగెల్స్ కలిసి పనిచేయటం 1840వ దశకంలో ఆరంభమైంది. ఏంగెల్స్ అప్పటికే మార్క్స్ నిర్ధారణలతో సరిపోలే నిర్ధారణలకు స్వతంత్రంగా వచ్చి ఉన్నారు. మార్క్స్ డాక్టరేట్ చేయగా ఏంగెల్స్ స్కూలు విద్య మాత్రమే చదివారు. అయినా ఏంగెల్స్ అసాధారణంగా అధ్యయనం చేశారు, ఆయనొక విజ్ఞాన సర్వస్వం, అరుదైన జ్ఞాన సంపన్నుడు. తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, ప్రకృతి శాస్త్రాలు, మిలటరీ సైన్సులు, సోషలిజం, దాస్ కాపిటల్, కార్మికోద్యమం, మతం వగైరాల్లో ఆయనకు పరిపూర్ణ జ్ఞానం ఉంది.

ఫ్రెడరిక్ ఏంగెల్స్ వస్త్ర పారిశ్రామికవేత్తల కుటుంబం నుంచి వచ్చారు. అందువల్ల కమ్యూనిజం వైపు ఆయన ప్రయాణం విశిష్టమైంది. స్వతహాగా పారిశ్రామికవేత్త అయినందున పరిశ్రమ అంతర్గత పనితీరును పరిశీలించారు. 1848-49 యుద్ధాల్లో సైతం ఆయుధం చేబట్టి పాల్గొన్నారు. స్విస్ సరిహద్దుల గుండా తప్పించుకుని, రైతుల గుడిసెల్లో ఉంటూ రెండు వారాల పాటు ఫ్రాన్స్ భూభాగం గుండా కాలినడకన ప్రయాణించారు. మార్క్స్‌ను సాధ్యం చేసిన వ్యక్తిగా ఆయన చరిత్రపై తనదైన ముద్ర వేశారు.

## తత్వశాస్త్రంతో ఆరంభమైన ప్రయాణం

మార్క్స్, ఏంగెల్స్ ఇరువురూ తత్వ శాస్త్రంనుంచి మార్క్సిజం లోకి ప్రయాణం చేశారు. మార్క్స్ వలె ఏంగెల్స్ కూడా అతివాద హెగెలియన్. హెగెల్‌ను లోతుగా అధ్యయనం చేయకుండా మార్క్సిజాన్ని మీరు సవ్యంగా అవగాహన చేసుకోలేరని లెనిన్ రాశారు. చరిత్రలో హెగెలియన్ గతితర్కంలో ప్రావీణ్యం సాధించిన కొద్దిమందిలో ఏంగెల్స్ ఒకరు.

ఏంగెల్స్ రచించిన 'ఫ్యూర్‌బక్ మరియు ప్రాచీన జర్మన్ ఫిలాసఫీ ముగింపు' తత్వశాస్త్రంలో గుణాత్మకమైన గెంతు. అది ప్రాచీన జర్మన్ తత్వశాస్త్రానికి ముగింపు పలికి గతి తార్కిక, చారిత్రక భౌతికవాద శకాన్ని ఆరంభించింది. పై గ్రంథం ఎంతో అధ్యయనంతో కూడినది. సమాజ గతితర్కం అనేది ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య ఐక్యత, వైరుధ్యంగా తొలిసారి అందులో ఆవిష్కృతం చేయబడింది. తత్వశాస్త్రంలో విప్లవం పరిపూర్తి అయింది. మార్క్స్‌తో కలిసి ఏంగెల్స్ ప్రపంచ దృక్పథంలో పరిపూర్ణమైన మార్పు తెచ్చారు. అది శిరస్సు ఎత్తి నిలబడింది; వారు దాన్ని దాని కాళ్లపై నిలబెట్టారు.

## మార్క్సిజంలో మూడు అంతర్భాగాలు

మార్క్స్, ఏంగెల్స్‌లు మార్క్సిజాన్ని మూడు అంతర్భాగాలుగా రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజం, తాత్విక భౌతిక వాదంగా రూపొందించారు. మార్క్స్, ఏంగెల్స్ ఇరువురూ 1850 దశకం నాటికి ఇంగ్లండ్‌కు నివాసం మారారు. మూడు అంతర్భాగాల అధ్యయనం పూర్తి చేయటానికి అది సహాయ పడింది. ఇంగ్లండ్ ప్రామాణిక పెట్టుబడిదారీ వ్యవస్థకు జన్మస్థానం. అంతకన్నా 'శుద్ధమైన', మరింతగా పరిపూర్ణమైన పెట్టుబడిదారీ వ్యవస్థ మరెక్కడా కనిపించదు.

అక్కడ వారి కృషి ఫలితమే వారి మహోన్నత రచన 'దాస్(ది)

కాపిటల్' (పెట్టుబడి). అది రాజకీయ అర్థశాస్త్రం, అలాగే తత్వశాస్త్ర శిఖరం. పెట్టుబడిదారీ ఉత్పత్తి నమూనా భావనలు, కేటగిరీలన్నిటినీ, వాటి విరుద్ధ చలనాలను, ఒక దానిలోకి మరొకదాని పరివర్తనలను అది వెల్లడి చేసింది. నిఖార్సయిన శాస్త్రవేత్తలుగా మార్క్స్, ఏంగెల్స్ సమాజంలో అన్ని సంబంధాలకు ప్రతిబింబమైన 'సరుకు'తో తమ విశ్లేషణ ఆరంభించారు. అది సాటిలేని రచన.

### 'కాపిటల్' రచన, పరిశోధనకు అనుసరించే పద్ధతిని వెనక్కు మళ్ళించింది :

ఆ పద్ధతి గ్రాహ్య వస్తువు (ఫినామినా) తో మొదలవుతుంది. మార్క్స్, ఏంగెల్స్‌లు ఫినామినా మూలాన్ని చేరుకున్నారు. ఆ మూలాన్నుండి ఫినామినాను గ్రహించారు. శ్రమ ద్విముఖ స్వభావం నుంచి వస్తువు ద్విముఖ స్వభావాన్ని వారు అన్వేషించారు. మార్క్స్ మరణం తర్వాత ఏంగెల్స్ కాపిటల్ మిగతా సంపుటాల రచనకు జీవితాన్ని వెచ్చించారు. మార్క్స్ రాసిన దాన్ని దాని భావం, రచనారీతి రెండింటినీ చదవగలిగినవాడు, అవగాహన చేసుకోగలిగినవాడు ఆయనే.

ఏంగెల్స్ తన మిత్రుల ఒత్తిడి మీదట సోషలిజం, తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రంపై యుగెన్ డూరింగ్‌ను తిప్పి కొట్టవలసి వచ్చింది. దాని ఫలితంగా మార్క్సిజం మూడు మూలాలు, మూడు అంతర్భాగాలు అద్భుతంగా వ్యక్తీకరణ పొందాయి. అదే 'యాంటీ డూరింగ్'. అందులో కొంతభాగం 'సోషలిజం, ఊహాజనితం, శాస్త్రీయం' పుస్తకంగా వెలువడింది.

### చారిత్రక శక్తిగా కార్మికవర్గం

కార్మికవర్గాన్ని చారిత్రకంగా పరివర్తన చెందుతున్న శక్తిగా మార్క్స్, ఏంగెల్స్‌లు కనుగొన్నారు. అది విప్లవ సిద్ధాంతంలో గుణాత్మకమైన ముందంజ. ఏంగెల్స్ కార్మికుల దుర్భర జీవితం గూర్చి విచారిస్తూ కూర్చునే మనిషి కాదు. వారి పరిస్థితులు ఇతరులకన్నా ఆయనకే బాగా తెలుసు. కృంగిపోయి కన్నీరు కార్చే వ్యక్తి కూడా కాదు. ఆయన సైనస్‌ను సోషలిజంలోకి పరివర్తన గావించిన శాస్త్రీయ విప్లవకారుడు.

మార్క్స్, ఏంగెల్స్‌లు దాదాపు సంపూర్ణంగా రూపొందిన కార్మికవర్గాన్ని కనుగొన్నారు. అది అత్యంత అభివృద్ధి చెందిన పనిముట్లు, యంత్రాలు, ఉత్పత్తి సాధనాలపై కేంద్రీకరించి ఉంది. దాని యావత్ స్వరూపం సమష్టి, సహకారంలో రూపుదిద్దుకుంది. పెట్టీ బూర్జువా వర్గం, రైతాంగానికి భిన్నంగా దాని వర్గ స్వభావం ఆస్తి విభజనను అనుమతించదు. పెట్టీ బూర్జువా వర్గం, రైతాంగం విప్లవ స్వభావం కలిగిన వారే అయినప్పటికీ వారు సమష్టితత్వం కలవారు కాదు. సామాజిక స్వామ్యానికి (సోషల్ ఓనర్‌షిప్) తగనివారు. ఏంగెల్స్ మార్క్స్‌తో పాటు అధునాతన వస్తువుల ఉత్పత్తిలో శ్రమ ద్విముఖ స్వభావాన్ని నిర్దిష్టం, అనిర్దిష్టం– కనుగొన్నారు. శ్రమ, వస్తువు ద్వంద్వ స్వభావాన్ని కమ్యూనిజం చారిత్రక కర్తవ్యంగా పరిష్కరిస్తుంది.

సహకారం, సమష్టితత్వంతో కూడిన సమాజాన్ని సృష్టించే సామర్థ్యం గల వర్గాన్ని తొలిసారి కనుగొన్నారు. సామాజిక న్యాయం అనేది సంస్కృతి, అన్యాయం భావనతో కూడిన అనిర్దిష్టమైన మనోగత భావం కాదు. మార్క్స్, ఏంగెల్స్ ఆ భావాన్ని 'ఫ్రెటర్నల్ డెలిగేట్స్', 'ది లీగ్ ఆఫ్ ది జస్ట్' రచనలపై తమ విమర్శలో కఠినంగా విమర్శించారు.

### అరాచక వాదం కాదు - శాస్త్రీయ సోషలిజం

అనిర్దిష్టమైన న్యాయం, విప్లవం పేరుతో అనార్కిస్టులు (అరాచకవాదులు) వ్యాప్తి చేసిన భావావేశ చెత్తను ఏంగెల్స్ తీవ్రంగా ఖండించారు. వారికి శాస్త్రీయ సిద్ధాంతం లేకపోవటాన్ని కూడా విమర్శిస్తూ వారి తాత్విక దారిద్ర్యాన్ని ('పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ') ఎండగట్టారు. మార్క్స్, ఏంగెల్స్‌లు 'మనుషులందరూ సహోదరులే' అనే వర్గ రహిత భావన స్థానంలో వారు పనిచేసే ఉత్పత్తి సాధనాలతో సంబంధం కలిగిన కార్మికవర్గం, శ్రమజీవుల వర్గ ఐక్యతను ప్రవేశపెట్టారు. వర్గాలు అనేవి పనిముట్లు, ఉత్పత్తి సాధనాలతో సంబంధం కలిగిన ప్రజల సమూహం. అది సమష్టి కావచ్చు, వ్యక్తిగతం కావచ్చు, వారు ఉత్పత్తిసాధనాలను సొంతంగా కలిగి ఉండవచ్చు లేక ఇతరుల వద్ద పని చేస్తుండవచ్చు. దోపిడీ మూలాన్ని కనుగొనవలసింది ఇక్కడ తప్ప ఏవో కొన్ని అస్థిత్వం లేని, అస్పష్టమైన 'మానవ', 'సామాజిక', 'సాంస్కృతిక' కేటగిరీల్లో కాదు. మొదట దానినుండి (ఉత్పత్తి సాధనాలతో సంబంధం) నుండి రెండవది ఉద్భవిస్తుందే గాని తద్విరుద్ధంగా కాదు. సౌభ్రాతృత్వం, మానవత ఉత్పత్తి సాధనాల చుట్టూ నిర్మితమైన వర్గ సంబంధాల నుంచి ఆవిర్భావం చెందుతుంది, ఉత్పత్తి సంబంధాలను ఏర్పరుస్తుంది. అలా కానట్లయితే అవి శాస్త్రీయ సారం లేని అనిర్దిష్ట, సాధారణ భావనలవుతాయి. ఫ్రెంచి విప్లవ నినాదం – స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విప్లవాత్మకమైంది. అయితే అది ఎవరికి అనే ప్రశ్నకు అది జవాబివ్వదు. మార్క్స్, ఏంగెల్స్ సవ్యమైన సమాధానమిచ్చారు.

ఈ కారణాల రీత్యానే మార్క్స్, ఏంగెల్స్‌లు కార్మికవర్గాన్ని చరిత్ర కేంద్ర స్థానంలో ఉంచగలిగారు, సిద్ధాంతంలో, ఆచరణలో విప్లవం తీసుకురాగలిగారు. ఏంగెల్స్ తన 'సోషలిజం, ఊహాజనితం, శాస్త్రీయం' అనే రచనలో దాన్ని వివరించారు. పెట్టుబడిదారీవిధానం అభివృద్ధి చెందటంతో పాటుగా సామూహిక శ్రమ పెద్దదవుతుంది, సామాజికము, సమష్టి అవుతుంది. అందువల్ల భవిష్యత్ సమాజంలో ఉత్పత్తి సాధనాల స్వామ్యం

(ఓనర్‌షిప్) సామాజికం, సమష్టి అవుతుంది. సోషలిజం గూర్చిన శాస్త్రీయ భావనకు ఇదీ ప్రాతిపదిక . అదే సమయంలో, సమాజం కమ్యూనిజంలోకి మారే విస్తృతమైన, దీర్ఘకాలిక ప్రజాస్వామిక క్రమంలో వివిధ మధ్యంతర దశల్లో ఇతర ప్రజాస్వామిక వర్గాలు, విభాగాలు సామాజిక పరివర్తన ప్రవాహంలో చేరతారు.

## కార్మికవర్గం, ప్రజాస్వామ్యం, సోషలిజం

ప్రజాస్వామ్యం కొరకు, ప్రజాస్వామిక కోర్కెల కొరకు పోరాటం సోషలిజం కొరకు పోరాటంలో అవిభాజ్యమైన భాగమని ఏంగెల్స్ (మార్క్స్) పరిగణించారు. సోషలిజం కొరకు ఎన్నికల హక్కులను, బ్యాలెట్ ప్రాముఖ్యతను ఏంగెల్స్ గట్టిగా సమర్థించారు. విప్లవానికి దారి తీసే హింసాయుత వర్గపోరాటాన్ని ఏంగెల్స్, మార్క్స్ సమర్థించారని ఒక తప్పుడు అభిప్రాయం సృష్టించబడింది. అంతకన్నా అసత్యం మరొకటి లేదు.

మార్క్స్, ఏంగెల్స్‌లు స్వేచ్ఛాయుతమైన పత్రికలను, బాహాట పోరాటాలను నొక్కి చెప్పారు. దలీగ్ ఆఫ్ జస్ట్ బహిరంగంగా పనిచేయనందున అందులో చేరేందుకు వారు నిరాకరించారు. సార్వజనీన ఓటింగ్ హక్కుల కొరకు చార్టిస్టు డిమాండ్‌ను వారు సమర్పించారు. అందులో వర్గపోరాట ఆయుధాన్ని వారు చూశారు. జర్మన్ వర్కర్స్ పార్టీ, వారి కుటుంబాలు, సానుభూతి పరులతో కలిగి ఉన్న 20 లక్షల ఓటర్లను 'అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమ షాక్ ఫోర్స్'గా ఏంగెల్స్ పరిగణించారు. సోషలిజంలోకి పరివర్తన కొరకు బ్యాలెట్ పెట్టెను ఎలా ఉపయోగించుకోవాలో జర్మన్ వర్కర్స్ పార్టీ (సోషల్ డెమొక్రటిక్ పార్టీ)ని ఉదాహరణగా ఏంగెల్స్ చూపారు. అనార్కిస్టులు ఏంగెల్స్ ను రివిజనిస్టుగా సైతం నిందించారు! రెండవ ఇంటర్నేషనల్‌లో ఏంగెల్స్ పనిచేసిన కాలంలో (1889–95) ప్రజాస్వామిక పార్లమెంటరీ హక్కులను గట్టిగా సమర్థించారు. జర్మన్ ఎస్‌డిపి ఒకానొక సమయంలో వందకు పైగా దినపత్రికలు నడిపింది; పోలైన ఓట్లలో మూడవ వంతుకు పైగా పొందింది. వర్కర్స్ పార్టీకి పెద్ద ఎత్తున ఉన్న పలుకుబడి, నిర్మాణం అటువంటిది. ఎన్నికల పోరాటాన్ని వర్గ, ప్రజాపోరాట రూపాల్లో ఒకటిగా ఏంగెల్స్ చాటి చెప్పారు.

## ప్రకృతిలో గతితర్కంపై

ఏంగెల్స్ 'ప్రకృతిలో గతి తర్కాన్ని ఉద్దేశపూర్వకంగా' సృష్టిస్తున్నాడని, ఆ తర్వాత దాన్ని సమాజానికి బదిలీ చేస్తున్నాడని మేధావుల్లో ఒక భాగం ఆయన్ను నిందించింది. సమాజంలో వ్యక్తుల మధ్య ఉండే 'వాస్తవ' వ్యత్యాసాలను దాట వేస్తున్నాడని కూడా నిందించారు. కొందరు ఫ్రెంచి, ఇటాలియన్, ఇతర మార్క్సిస్టులు, మేధావుల్లో ఈ అభిప్రాయం ఉండింది.

ఇది ఏంగెల్స్ గొప్ప దోహదాన్ని విచిత్రంగా, హేతువిరుద్ధమైన రీతిలో చూసే పద్ధతి. మార్క్స్, ఏంగెల్స్‌లు ప్రకృతిలో, సమాజంలో, చైతన్యంలో సార్వజనీన గతితార్కిక సూత్రాలను కనుగొన్నారు; 'పదార్థం' గూర్చి శాస్త్రీయ భావనను అభివృద్ధి చేశారు. సమాజం, పదార్థం యొక్క నిర్దిష్ట రూపంగా చలన గతితార్కికానికి సంబంధించి సాధారణ, నిర్దిష్ట సూత్రాలు రెండూ కలిగి ఉంటుంది. నిర్దిష్టమైన సూత్రాలు 'చరిత్ర గూర్చిన పాదార్థిక భావన'లో ఉంటాయి. దాన్ని చారిత్రక భౌతికవాదం అని కూడా పిలుస్తారు.

ప్రకృతిలో, సమాజంలో సైతం 'గతి తార్కిక' సూత్రాలు పని చేస్తాయని కొందరు విశ్వసించరు. చలనానికి మూలం గతి తార్కిక సూత్రాలని అవగాహన చేసుకోవటంలో వారు విఫలమైనారు. అయితే ఫ్రెడరిక్ ఏంగెల్స్ తన ప్రసిద్ధ గ్రంథం 'డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్'లో రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రం, అయస్కాంత క్షేత్రం వగైరా రంగాల్లో చలనం నిర్దిష్ట రూపాలను అధ్యయనం చేశారు. వస్తుగతంగా అస్థిత్వంలో ఉన్న ఈ సూత్రాలు ప్రపంచ దృక్పథాన్ని ఎలా పెంపొందిస్తున్నాయో నిరూపించారు. ప్రకృతి శాస్త్రాలను మార్క్సిజంలో ఇముడ్చుకోవటానికి ఈ రచన ఒక శాస్త్రీయమైన గైడ్. సాంకేతిక, సమాచార విప్లవం జరుగుతున్న ఈ కాలంలో దీనికి మరింత ప్రాసంగికత ఉంది.

ప్రకృతి గతి తార్కిక సూత్రాలపై ఏంగెల్స్ కృషి ప్రపంచ దృక్పథాన్ని, గతితార్కిక భౌతిక వాదం పద్ధతిని ప్రగాఢ మొనర్చింది.

## 21వ శతాబ్దంలో ఏంగెల్స్ ప్రాసంగికత

గత రెండు శతాబ్దాల కాలంలో ప్రపంచం ఎంతో మార్పు చెందింది. అయితే ఏంగెల్స్ మెథడాలజీ (అధ్యయనానికి అనుసరించే పద్ధతి) ప్రాసంగికతను కోల్పోలేదు. మనం సరికొత్త సాంకేతిక, సమాచార విప్లవంలో ప్రయాణిస్తున్నాం. మార్క్సిజం, సోషలిజంలో ఎదురవుతున్న కొత్త ప్రశ్నలకు సమాధానాలు అవసరం. సామాజిక పొందిక వేగంగా మార్పు చెందుతున్నది. కొత్త ఉత్పత్తి సాధనాలు, ఆదాన ప్రదానం, సమాచారం వేగంగా ఆవిర్భవిస్తున్నాయి. సోవియట్ యూనియన్, ఇతర 'అస్థిత్వ సోషలిజం' అనుభవం నూతన పరిస్థితుల్లో నూతన సమాజాన్ని నిర్మించటం ఎలా అని కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నది. కార్మికవర్గం కూర్పు మారుతున్నది. వారిలో పని చేసేందుకు కొత్త పద్ధతులు అవసరం. వర్గాలు, విభాగాలు మారుతున్నాయి, కొత్తవి ఆవిర్భవిస్తున్నాయి. పట్టణీకరణ వేగంగా పెరుగుతూ మధ్యతరగతి విభాగాలు ఎక్కువ ప్రాధాన్యత పొందు తున్నాయి. సమాచార సాంకేతికవిజ్ఞానం, ఎలక్ట్రానిక్ మీడియా కొత్త అంశాలు. 21వ శతాబ్దం గుణాత్మకంగా కొత్త వ్యూహం, ఎత్తుగడలను డిమాండ్ చేస్తున్నది. సైన్స్, టెక్నాలజీని మార్క్సిజం నూతన స్థాయిలో తనతో చేర్చుకోవాలని కూడా అది కోరుతున్నది. సిద్ధాంతం, ఆచరణను కొత్త స్థాయిలకు అభివృద్ధి చేయటానికి ఫ్రెడరిక్ ఏంగెల్స్ రచనలు, పద్ధతి గైడ్‌గా ఉపకరిస్తాయి. ❑

# వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమం

## సమీక్షకు ఇదే సమయం



డి. జయప్రకాష్

భారత కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమై వందేళ్ళు పూర్తి కావొస్తోందని చెప్పడానికి ఇప్పుడు వీలులేదు. ఎందుకంటే తాష్కెంట్‌లో 1920లోనే కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందని సీపీఎం చెబుతోంటే, మొదటి మహాసభ జరిగిన 1925 సంవత్సరాన్నే ప్రారంభంగా భావించాలని సీపీఐ అంటోంది. ఎంఎల్ పార్టీలు, ఇతర గ్రూపులకు కూడా ఈ విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ వివాదంలోకి పోకుండా భారత కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమై రేపో ఎల్లుండో వందేళ్ళు అవ్వనుందని అనుకుందాం. ఉద్యమం ఎప్పుడు ప్రారంభం అయ్యిందన్న వాదన కంటే, ఆ ఉద్యమం ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉందన్న వాస్తవ అంచనాకే అందరూ ప్రాధాన్యతనివ్వడం ఉపయోగకరం.

### వెలుగు...నీడలు

కార్మిక, కర్షక, విద్యార్థి, యువజనులను సంఘటితం చేయడంలోను, వలసవాద దోపిడీకి వ్యతిరేకంగా వారిని ముందుకు నడిపించడంలోనూ కమ్యూనిస్టు ఉద్యమం నిర్వహించిన పాత్ర నిర్వివాదాంశం. స్వాతంత్ర్య పోరాటంలో ప్రేక్షక పాత్ర పోషించిన పరివారం, నేడు దేశభక్తి పాఠాలను వల్లె వేస్తోన్న సందర్భంలో ఈ చరిత్రకు మరింత ప్రాధాన్యత ఉంది. అదే సందర్భంలో, నాడు జాతీయ స్థాయిలో ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఆవిర్భవించిన స్థితి నుండి ప్రజలను ప్రభావితం చేయడంలో ఎన్నడూ లేనంత బలహీన స్థితికి వామపక్షం చేరడం ఒక కాదనలేని వాస్తవం. ఈ ప్రయాణంలోని లోటుపాట్లను సరిగా అంచనా వేయకుండా సరికొత్త ప్రయాణం ప్రారంభించడమూ సాధ్యం కాదు. కమ్యూనిస్టు ఉద్యమం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, సాధించిన విజయాలను నెమరు వేసుకుంటూ పునరంకితమవుదామని ప్రతిజ్ఞలు చేస్తే సరి పోతుందా? చీలికలు, పీలికలు అవ్వడం వెనుక ఉన్న సైద్ధాంతిక సమస్యలను ఆకళింపు చేసుకుని, పునాదులను సరిచేసుకుని, సరికొత్తగా ముందుకు కదలాల్సిన అవసరాన్ని గుర్తించడమే ముఖ్యమా ?? ఇదే ఇప్పుడు కీలక ప్రశ్న. మొక్కుబడి ప్రయాణానికి సిద్ధపడితే మొదటి పద్ధతే సరైంది. సరికొత్త సవాళ్ళకు, అంతకుమించి సరికొత్త అవకాశాలకు తగ్గట్టుగా కార్యాచరణను సిద్ధం చేసుకోవాలంటే మాత్రం రెండో పద్ధతే ఏకైక మార్గం.

### శత్రువెవరు..?

లోతుల్లోకి వెళ్ళినప్పుడు అనేక సైద్ధాంతిక సమస్యలు ఎంతో గంభీరంగా కనిపిస్తాయి. ఆయా సమస్యల మూలం నుండి కాలగమనంలో కొంత ప్రయాణం జరిగినప్పుడు, వాస్తవాలు స్పష్టంగా కనిపించే పరిస్థితి ఏర్పడినప్పుడు, సులభమైన భాషలో చెప్పుకున్నప్పుడూ అవే గంభీర సమస్యలు ఆశ్చర్యకరంగానూ అనిపిస్తాయి. పార్టీ కార్యక్రమానికి సంబంధించి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో నెలకొన్న సమస్యా అలాంటిదే. దేశంలో ఇన్ని కమ్యూనిస్టు పార్టీలు, గ్రూపులు ఎందుకు ఉన్నాయి అన్న ప్రశ్నకు సులభమైన సమాధానం ఏమిటంటే... దేశంలో పీడిత ప్రజలకు శత్రువెవరు? అన్న విషయంలో ఆయా పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడమే. దేశంలోని పెట్టుబడిదారీ వర్గం దళారీ పాత్ర మాత్రమే పోషిస్తోన్నందున సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువని కొందరు, సామ్రాజ్యవాదంతో తమ ప్రయోజనాల మేరకే రాజీపడుతూ, స్వతంత్రంగా వ్యవహరిస్తోన్న గుత్త పెట్టుబడిదారీ వర్గమే ప్రధాన శత్రువని ఇంకొందరు, మినహాయింపులు లేకుండా స్వదేశీ, విదేశీ, పెద్ద, చిన్న పెట్టుబడిదారీవర్గమంతా శ్రామిక వర్గానికి వైరి వర్గమేనని మరి కొందరు భావిస్తున్నారు. మరో విధంగా చెప్పాలంటే ప్రధాన పోరాటం ఎవరిపైనన్న విషయంపైనే కమ్యూనిస్టు పార్టీలు నేటికీ ఒక ఉమ్మడి అవగాహనకు రాలేకపోయాయి. ఈ ప్రధాన సమస్యకు అనుబంధంగా అనేక ఉప సమస్యలు. అందుకే ఇన్ని గ్రూపులు. ఇటువంటి మౌలిక సమస్య పైనే ఏకాభిప్రాయం లేక ముక్కలు చెక్కలవ్వడం ఏవో కొన్ని పార్టీలు, గ్రూపులకు సంబంధించి కాక మొత్తంగా వామపక్ష ఉద్యమ సైద్ధాంతిక బలహీనతనే సూచిస్తోంది.

### మూలమెక్కడ..?

కోట్లాది మందిని పోరాట పంథాలో నడిపించిన, లక్షలాది మంది సమసమాజ సైనికులను తయారుచేసిన, వేలాది త్యాగధనులను తీర్చిదిద్దిన, వందలాది శ్రామికవర్గ ఉద్దండ నాయకులు, మేధావులను రూపుదిద్దిన ఉద్యమం.. నేడు ఇంతటి సైద్ధాంతిక గందరగోళంలో చిక్కుకుపోయి, బలహీనపడటానికి కారణమేమిటన్న ప్రశ్నకు ఎంతో ప్రాధాన్యత ఉంది. రష్యన్ విప్లవ స్ఫూర్తితో, వలసవాద వ్యతిరేక స్వాతంత్ర పోరాటంలో పురుడు పోసుకున్న కమ్యూనిస్టు ఉద్యమం.. ఆ తర్వాత తనదైన స్వతంత్ర కార్యక్రమాన్ని, పంథానూ రూపొందించుకోలేకపోయింది. రష్యన్ విప్లవం పాత్ర భారత ఉద్యమానికి స్ఫూర్తిని ఇవ్వడానికే పరిమితం కాలేదు. దేశంలో విప్లవ కార్యక్రమానికి సంబంధించి భారత ఉద్యమం రష్యా మార్గదర్శకత్వాన్ని కోరే పరిస్థితి ఏర్పడింది. ఒక

జ్వల పోరాట విజయం తాలూకూ పరిణామమిది. ఈ క్రమంలోనే కమ్యూనిస్టు ఉద్యమ చీలికలకు బీజం పడింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో భారత్ వంటి తృతీయ ప్రపంచ దేశాలకు కృశ్చేవ్ ప్రతిపాదించిన "శాంతియుత సహజీవన విధానం" మరొక విపరిణామం. 90వ దశకం ప్రారంభంలో రష్యాలో కమ్యూనిస్టు పార్టీ పాలన అంతం అయ్యే వరకూ ఏదో ఒక స్థాయిలో రష్యన్ విప్లవ ప్రభావం భారత ఉద్యమంపై కొనసాగుతూనే ఉందన్నది గమనార్హం. ఇదే విధంగా చైనా విప్లవ విజయమూ భారత వామపక్ష ఉద్యమాన్ని ప్రభావితం చేసింది. చైనా మార్గమా – రష్యా మార్గమా అన్న చర్చ నుండి, చైనా ఛైర్మనే మన ఛైర్మన్ అన్న నినాదం వరకూ జరిగిన పరిణామాల క్రమం తెలిసిందే.

మార్క్సిస్టు మూల సూత్రాలకు సంబంధించిన సాహిత్యం కూడా ఈ మొత్తం కాలంలో రష్యా నుండే దిగుమతి అవ్వడమూ వాస్తవం. నేరుగా మార్క్స్, ఎంగెల్స్ మౌలిక రచనలను అధ్యయనం చేయడానికి బదులుగా రష్యన్ ఉద్యమం రూపొందించిన పాఠ్య గ్రంథాలపైనే భారత ఉద్యమం స్థూలంగా ఆధారపడటం ఈ క్రమంలో జరిగిన యాదృచ్ఛిక పరిణామం. వ్యవసాయిక విప్లవం, పెట్టుబడిదారీ వ్యవస్థ తీరుతెన్నులకు సంబంధించిన మౌలిక అవగాహన, ఒక దేశంలో సోషలిజం సాధ్యాసాధ్యాలు, పార్లమెంటరీ పంథా – పరిమితులు, కార్మికవర్గ అంతర్జాతీయత ఇటువంటి ఎన్నో మౌలిక అంశాల పట్ల భారత ఉద్యమంలో ఒక శాస్త్రీయ మార్క్సిస్టు అవగాహన ఏర్పడకపోవడానికి తగినంతగా మూల గ్రంథాల అధ్యయనం లేకపోవడమే కారణమన్న విమర్శా ఉన్నది. వలసవాద వ్యతిరేక పోరులో పుట్టి పెరిగిన భారత కమ్యూనిస్టు ఉద్యమం తదనంతర కాలంలోనూ జాతీయవాద చట్రంలోనే కూరుకుపోయిందన్నది మరో ప్రధాన విమర్శ, ఫలితంగా, 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి ! అన్న నినాదాన్ని ఆచరణలో పెట్టడానికి బదులుగా.. 'దేశ స్వావలంబన', 'మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం' వంటి జాతీయవాద నినాదాలు ముందుకు వచ్చాయన్నది ఈ విమర్శ సారాంశం.

రెండవ ప్రపంచయుద్ధానంతరం పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వ్యవస్థలను నడిపించేందుకు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో పాలక వర్గాలు సరికొత్త విధానాలకు, ప్రయోగాలకు శ్రీకారం చుట్టాయి. ఒక వ్యవస్థీకృత పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య దేశంలో ఇప్పటివరకూ సోషలిస్టు విప్లవ ప్రయోగం విజయవంతమవ్వలేదన్న విషయం ఇక్కడ గమనార్హం. ఇటువంటి స్థితిలో, పాలక వర్గాల ఈ సరికొత్త ఎత్తుగడలను అధ్యయనం చేయడంలోను, వాటిని ఎదుర్కొనే కార్యాచరణను రూపొందించడం లోనూ వామపక్ష ఉద్యమం విజయం సాధించలేదు. ఇటువంటివి ఉద్యమ బలహీనతకు బాహ్య కారణాలు. స్థూలంగా ఈ బాహ్య, అంతర్గత కారణాలకూ లోతైన సంబంధముంది.

## వ్యవస్థ మార్పా ? వ్యవస్థలో మార్పా ??


మౌలిక సైద్ధాంతిక, విధాన విషయాలపై అస్పష్టత, గందరగోళం నిండి ఉన్నప్పుడు స్థూలంగా కమ్యూనిస్టు ఉద్యమం దిశారాహిత్యానికి గురవ్వడమూ సహజ పరిణామం. భారత వామపక్ష ఉద్యమంలో జరిగిందీ అదే. సైద్ధాంతిక స్పష్టత లేనప్పుడు ఆచరణలో ఐక్యత అసాధ్యం. అందుకే ఇన్ని గ్రూపులు, ఇన్ని అంచనాలు, ఇన్ని పంథాలు. ఉద్యమ ప్రారంభంలోని భౌతిక పరిస్థితులు (రష్యన్ విప్లవప్రభావం, వలసవాద వ్యతిరేక పోరాటం) పర్యవసానంగా ఏర్పడ్డ పలు సైద్ధాంతిక వైఖరుల కారణంగా భారత కమ్యూనిస్టు ఉద్యమ పయనం కూడా భిన్న లక్ష్యాల వైపు, విభిన్న పంథాల్లో కొనసాగుతోంది. ఫలితంగా ప్రతి కమ్యూనిస్టు పార్టీ తమది మాత్రమే నిజమైన కమ్యూనిస్టు ఉద్యమమని, మిగిలినవన్నీ మితవాద, అతివాద ఉద్యమాలేనని నిర్ధారించే పరిస్థితి ఏర్పడింది. ఆచరణలో అత్యధిక శ్రేణులు వ్యవస్థను సమూలంగా మార్చే లక్ష్యం స్థానంలో వ్యవస్థ లోపలే మార్పులు తీసుకువచ్చే లక్ష్యం దిశగా పయనిస్తున్నాయి. విప్లవ కార్యక్రమం ఆధారంగా పనిచేస్తున్నామని భావిస్తోన్న అనేక పార్టీలలోని సభ్యులకు, ఆచరణలో తమది సంస్కరణవాద కార్యక్రమేమని తెలిసే పరిస్థితి కూడా లేదు.

## సమీక్షే ఒక కార్యక్రమం

కమ్యూనిస్టు ఉద్యమం బలహీనమవ్వడానికి కారణమేమి టన్న విషయంపై ప్రస్తుతం లోతైన చర్చ జరుగుతోంది. ఇక్కడ ప్రస్తావించిన అంశాలు చాలా పరిమితం. సారంలో చాలా ప్రాథమికం. వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమాన్ని స్మరించుకోవడ మంటే నిజమైన అర్థంలో, ప్రయోజనంలో లోతుగా సమీక్షించడమే. ఆ సమీక్ష ఆధారంగా సరికొత్త కార్యాచరణను రూపొందించు కోవడమే. వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ ఆచరణ అనేక విజయాలను సాధించినప్పటికీ.. ఇన్ని గ్రూపులను తయారు చేసి, ఇంతగా ఉద్యమాన్ని బలహీనపర్చడం కళ్ళముందున్న వాస్తవం. ఫాసిస్టు ప్రమాదం ముంచుకు రావడం కాదనలేని సత్యం. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో సైతం.. మరోసారి పెద్ద ఎత్తున సోషలిస్టు భావజాలం (ఎన్నో పరిమితులు ఉన్నప్పటికీ) ముందుకు రావడమూ చూస్తున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థ పురోగమనంపై నేడు ఎన్నో ఎన్నెన్నో సందేహాలు వ్యక్తం చేస్తున్నది కమ్యూనిస్టులు కాదు. ఆర్థిక సంక్షోభాలు, అంతులేని నిరుద్యోగం, తీవ్ర అసమానతలు, పర్యావరణ విధ్వంసం తదితర పరిణామాల నేపథ్యంలో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, మేధావులే ఈ వ్యవస్థ మనుగడను శంకిస్తున్నారు. మరోవైపు మార్క్సిస్టు వ్యతిరేకులూ మార్క్స్ వైపు చూస్తున్నారు. ఇటువంటి సవాళ్ళు, సానుకూల పరిస్థితుల్లో భారత కమ్యూనిస్టు ఉద్యమం ఒక మెరుగైన కార్యాచరణను రూపొందించు కోవాలంటే, ముందుగా చేయవలిసిన పని వందేళ్ళ ఉద్యమ అనుభవాలను విమర్శనాత్మకంగా సమీక్షించడమే. అందుకే, ఇప్పుడు సమీక్షా ఒక కార్యక్రమమే. ❑


# మార్క్స్ థీసిజ్ ఆన్ ఫ్యూయర్బాక్
## (సంక్షిప్త వివరణ)

**సమీక్ష : వి. విజయకుమార్** **రావు కృష్ణారావు**



మారుతున్న పరిస్థితులు మార్క్స్ అధ్యయన ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నాయి. కాపిటల్ గ్రంథం తెలుగు పాఠకులకు అందుబాటులో వున్నా, భౌతిక వాదానికి ఆయువుపట్టు అయిన ఫ్యూయర్‌బాక్ మీద మార్క్స్ రాసుకున్న విలువైన విషయాలు తెలుగు పాఠకులకు అందుబాటులో లేవు. ఈ సంక్షిప్త వివరణలో ఆ కొరత తీర్చే ప్రయత్నం చేశారు సైద్ధాంతిక గ్రంథాల్ని తెలుగువారికి అందించటంలో సిద్ధహస్తులైన రావు కృష్ణారావు గారు.

నూతన ప్రపంచ దృక్పథాన్ని దర్శించిన తొలి సాధికారిక నోట్సుగా, ఎంతో చిక్కగా, గంభీరంగా రాసుకున్న మార్క్స్ నోట్సును ఒక పుస్తకం రూపంలో తేవడానికి ఎంగెల్స్ ఎందుకంత విలువ ఇచ్చాడో రాబర్ట్ చార్లెస్ టకర్ అనే అమెరికన్ రాజనీతిజ్ఞుడి మాటలు వింటే తెలుస్తుంది. మార్క్స్, మానవ సంబంధమైన దేన్నీ పరాయిగానో, ముక్కలు ముక్కలుగానో చూడకుండా, ఒక మొత్తంగా చూడటమూ, అలా అర్థం చేసుకుని వదిలేయకుండా, దాన్ని సమూలంగా మార్చాలనడమే కాదు, నిరంతరం మారుతూ వుండే చలనశీలతని ఆపాదించ డమూ, సిద్ధాంతమూ, ఆచరణల మధ్య వైరుధ్యాలున్నప్పటికీ ఐక్యత ఎలా తప్పనిసరి అగత్యమో రేఖా మాత్రంగా చూపడమూ, ఈ నూతన ప్రపంచ దృక్పథాన్ని ప్రతిభావంతంగా ఈ సిద్ధాంత ప్రతిపాదనల్లో ఒక సంక్షిప్త సారాంశంగా చూపడం వల్లేనని అంటాడు.




మార్క్స్ 27 ఏళ్ల వయసులో రాసుకున్న 11 థీసిజ్‌లు 43 ఏళ్ళ తర్వాత ఎంగెల్స్ వెలుగులోకి తెచ్చేవరకూ ప్రపంచానికి తెలియదు. ప్రపంచానికి నిర్వచనాలూ, భాష్యాలూ చెప్పడమే అప్పటిదాకా ఆనవాయితీగా వున్న భౌతికవాదానికి ఆచరణాత్మక, సామాజిక భౌతికవాదంగా మార్చిన ఈ పదకొండు కళాత్మక శకలాల్లో మార్క్స్ అసాధారణ ప్రజ్ఞ దాగివుంది.

ఫ్యూయర్‌బాక్‌కు వాస్తవికత అంటే ప్రకృతి యొక్క వాస్తవికత. మన ఉనికి ఇంద్రియాల ద్వారా తెలుసుకునేది. తత్వశాస్త్రం పని ఈ ప్రకృతిలో మమేకమై ఉన్న మనిషిని చదవడమే అంటాడు. మతాన్ని మనిషి తన తీరని అవసరాల్ని ప్రొజెక్ట్ చేయడంగా భావిస్తాడు. ఇతర జీవులనుండి మనిషిని వేరు చేసి చూపే సామర్థ్యం తనకి ఉన్న 'జాతి అస్తిత్వం' వల్లే అంటాడు. మనిషికి మనిషే అత్యున్నత అస్తిత్వమనీ, ఆలోచించే వాడూ, ఉనికిలో వుండేవాడూ వేరువేరు కాదంటాడు. మనసూ, శరీరం విడదీయలేని వాడే మనిషి అంటాడు. మనిషే దేవుణ్ణి సృష్టించాడనీ, మనిషే ప్రకృతిలో అత్యున్నత ఫలితమనీ, ప్రకృతిలో భాగమనీ, సామాజిక జీవిత ఫలితమనీ అంటాడు ఫ్యూయర్ బాక్.

కానీ దీన్ని హెగెల్ గుర్తించ లేదంటాడు బాక్. మొత్తం చలనానికీ, జీవితానికీ మూలం వైరుధ్యం అన్న హెగెల్ మార్క్స్, చలనమే ఏకైక వాస్తవం అని తత్వ శాస్త్ర 'విప్లవ ఆల్జీబ్రా' ని రూపొందించిన హెగెల్ చివరికి 'వాస్తవికత' ని ఆలోచన సృష్టిస్తుంది అనే భ్రమలో పడ్డాడు. కానీ వాస్తవం అనేది మన ఆలోచనకు వెలుపల కూడా వుంటుందన్న విషయంలో హెగెల్ విలువైన 'గతి తర్కం' కాస్తా తలకిందులై కూచుంది. దీన్ని కాళ్లపై నిలబెట్టిన వాడు ఫ్యూయర్ బాక్!

అన్ని మతాలూ ఏం చేశాయ్? "నిరుపేక్ష భావన" కి మనుషుల్నీ, ప్రకృతినీ దాసోహం చేశాయి ఇంచుమించుగా. ఫ్యూయర్ బాక్ 'భౌతిక ప్రపంచం' ఒక్కటే అన్న భావన మార్క్స్ కు కల్పించాడు. కాగా మార్క్స్, ఫ్యూయర్ బాక్ మరీ అతిగా ప్రకృతి వైపు శ్రద్ధపెట్టి వర్తమాన తత్వశాస్త్రంలో ముఖ్యమైన రాజకీయ అంశాన్ని నిర్లక్ష్యంతో చూశాడని భావించాడు. మనిషిని సంవేదనీయ వస్తువుగా చూసినందుకు ఫ్యూయర్‌ను మెచ్చుకున్నా, సామాజికంగా క్రియాశీలురైన మనుష్యులను నిర్దిష్టంగా

చూడనందుకు అసంతృప్తి చెందాడు మార్క్స్, ఎందుకంటే, భౌతికవాదమూ, చరిత్రా వేరుపడే ప్రమాదముందంటాడు.

పాత భౌతిక వాదానికి ఫ్యూయర్ బాక్‌ను ఛాంపియన్‌ని చేసిన మార్క్స్, ఊహాజనిత తాత్వికులనూ, ఈశ్వరవాదులనూ, అగ్నిపునీతులవడానికి ఫ్యూయర్ బాక్ అనే అగ్ని ప్రవాహంలో నడవాల్సిందే అని వక్కాణిస్తాడు. హెగెల్ మనిషికి 'స్వతంత్ర ప్రాథమిక అస్తిత్వం' ఇవ్వకుండా నిరపేక్ష ఆత్మ లో భాగం చేశాడు. ఫ్యూయర్ బాక్ సరిగ్గా వ్యతిరేకంగా భౌతికంగా ఉన్న మనిషిలో నుండి ఆత్మ పుట్టింది అంటాడు.

పాత భౌతిక వాదం ఇది సరిగ్గానే చెప్పినా, బయట మనం చూసే ప్రపంచాన్ని గ్రహించడంలో మనం జోక్యం చేసుకొని మార్చలేం అనే విషయంలో తప్పుగా వుంది. కాగా భావ వాదులు ఈ మనో కార్యకలాపం విషయంలో సరిగానే అర్థం చేసుకున్నా, మనసుకు నిరపేక్ష స్వతంత్రత ఆపాదించి ప్రమాదకర నిర్ధారణ కొచ్చారని భావించాడు మార్క్స్.

మార్క్స్, ఫ్యూయర్ బాక్ లిరువురూ మనిషి నుండే ప్రారంభించినా ఫ్యూయర్ బాక్ 'మనిషి' ఒక భావనాత్మక మనిషి, కాగా మార్క్స్ 'మనిషి' పేద, ధనిక, ఆదిమ, ప్రాంత,దేశ,యుగ లాంటి దేనికైనా చెందినవాడు. ఫ్యూయర్ బాక్ మనిషి, ప్రకృతిని గ్రహిస్తాడు కానీ దాన్ని మార్చడు. కానీ మార్క్స్ మనిషి, దాన్ని గ్రహించడమే కాదు మార్చుకుంటాడు. మానవ సంబంధాల కుండే మౌలిక మానవ ప్రత్యేకతను ఫ్యూయర్ బాక్ అర్థం చేసుకోలేదని, మానవ కార్యాచరణే వాస్తవికత అనీ, ఈ ప్రపంచం దాని కార్యాచరణ ఉత్పాదితమని, అది మనిషి భౌతిక కార్యకలాప మని తన మొదటి థీసిజ్ లో చెబుతాడు మార్క్స్.

రెండో థీసిజ్‌లో జ్ఞానం మనిషి క్రియాశీల ఆచరణలో భాగమనీ, ఈ ఆచరణ విషయం ఫ్యూయర్ బాక్ పట్టించుకోలేదనీ, అది ప్రకృతితో మనిషి సమిష్టిగా ఇంట్రాక్ట్ కావడం వల్లే సంభవం అంటాడు మార్క్స్. సత్యం దాని కది సత్యంగా వుండదనీ, అది నిరూపణ అయ్యేది సిద్ధాంతంలో కాదనీ ఆచరణలోననీ అంటాడు.

మూడో థీసిజ్ లో మనిషి పరిస్థితుల్లో మార్పు తెచ్చి, దాంతో తను మారడానికి చేసే ప్రయత్నమే విప్లవాత్మక ఆచరణ అంటాడు. ఫ్యూయర్ బాక్, సైద్ధాంతిక దృక్పథాన్ని అసలైన దృక్పథంగా భావించి, చరిత్రను భావవాదిలా చూశాడని విమర్శిస్తాడు మార్క్స్. కరిక్యులమ్ మార్చేస్తే చాలనుకునే ఊహాజనిత భౌతికవాదులకు భిన్నంగా విప్లవ కార్యాచరణ ఆవశ్యకతను చెబుతాడు. పరిస్థితులను మనిషే మార్చాలనీ, మారిన మేరకు మనిషీ మారతాడనీ చెబుతాడు. బోధకుడే, జ్ఞాన ప్రబోధకులే విద్యావంతులు కావాలి. సంస్కర్తలు మార్చలేరు సమాజాన్ని.

నాలుగో థీసిజ్ లో మతాన్ని ఫ్యూయర్ బాక్ లౌకిక పునాదిలో చూట్టాన్ని మెచ్చుకున్నా, దాన్ని వ్యక్తుల సెంటిమెంటుగా సరిపెట్టుకోవడాన్ని విమర్శిస్తాడు మార్క్స్. వాస్తవ జీవన పరిస్థితుల్ని మరుగుపరిచే మత్తుమందు మతానికి అసలు కారణం సామాజిక వ్యవస్థలో, ఉపరి నిర్మాణాల్లోని శత్రు వైరుధ్యాల్లో వెతకాలి, వాస్తవ పరిస్థితుల నుండి అర్థం చేసుకోవాలంటాడు. అలానే 'స్వీయ పరాయీకరణ' ని పూర్వపక్షం చేసింది ఈ థీసీజ్.

ఐదో థీసీజ్ లో ఫ్యూయర్ బాక్ ఆచరణాత్మక భౌతికవాది కానందుకు విమర్శిస్తాడు. ఎంపిక చేసిన సంవేదనాత్మక కార్యాచరణ నాడీ వ్యవస్థ అత్యున్నతంగా ఎదిగిన మానవుడ్ని తోటి జంతుజాలాల లాగే ప్రయోగశాల్లో చూసినట్టు కాకుండా సామాజిక పార్శ్వం నుంచి కూడా చూడాలన్న విషయం ఈ థీసీజ్‌లో స్పష్టం చేస్తాడు.

ఆరో థీసీజ్‌లో ఫ్యూయర్ బాక్ మత సారాన్ని మానవసారం గా భావించడంలోని తప్పుని ఖండిస్తూ, అది సామాజిక సంబంధాల సమగ్ర మొత్తంగా తీసుకోవాలంటాడు మార్క్స్. సమాజం అంటే కేవల వ్యక్తుల మొత్తమే కాదనీ, శ్రమా, ఉత్పత్తీ, భాషా, సహకారం లాంటి అనేక నిబిడీకృతమైన కార్యకలాపాల మొత్తంగా తీసుకోవాలంటాడు. అలానే వ్యక్తిని సార్వత్రికంగా, సామాజికంగా వుండే ఒక గొప్ప మొత్తంగా వాటి ఉత్పాదితంగా భావించాడు.

ఏడో థీసీజ్‌లో ఫ్యూయర్ బాక్, మతాన్ని మనిషి తన తీరని అవసరాల్ని, వాంఛల్ని, స్వైర కల్పనల్లో ప్రొజెక్ట్ చేయడంగా భావిస్తే, మార్క్స్ శ్రమ విభజన ఒకానొక నిర్దిష్టమైన దశకు చేరుకున్నప్పుడు అస్తిత్వంలోకి వచ్చేదిగా భావించాడు. దానికి ఒక చారిత్రక గతి ఆపాదించడానికేమీ వుండదు అంటాడు. అంటే ఒక్కో చారిత్రక దశలో ఒక్కో రకంగా ఉండటమే మత లక్షణం.

ఎనిమిదో థీసీజ్‌లో పరిష్కారం లేని సమస్యలు గానీ, సమస్యలకు మార్మిక పరిష్కారాలు గానీ లేని విషయాన్ని సూత్రీకరిస్తుంది. సామాజిక సందర్భం అనేదాన్ని విశ్లేషిస్తుంది. తెలుసుకోగలగడం అనేది వైయక్తికం కాదనీ అది ఉమ్మడి కార్యాచరణ అంటాడు మార్క్స్, అంతేకాదు, సైద్ధాంతిక ఆలోచనని ఆచరణ నుండి వేరుచేసి చూడటాన్ని మార్క్స్ వ్యతిరేకించాడు. ఆచరణ కోసమే సిద్ధాంతం అంటాడు మార్క్స్.

తొమ్మిదో థీసిస్‌లో, మారుతున్న పరిస్థితులనూ, మనుషులనూ, మనుష్యుల శ్రమ చేత నిర్మించబడ్డ ప్రపంచాన్ని వేర్వేరుగా చూసే పాత భౌతికవాదాన్ని తృణీకరిస్తూ, ఉత్పాదక కార్యకలాపమే సామాజిక సంబంధాలకు నిజమైన ప్రాతిపదికను చేశాడు మార్క్స్. సిద్ధాంతానికి అది పుట్టిన వ్యవస్థకు వ్యతిరేకంగా వుండే అవకాశం వున్నా, ఆ వ్యవస్థ కు అతీతంగా వుండజాలదు అని చెప్పడం వల్ల సర్వకాలాలకూ వర్తించే సిద్ధాంతాలు వుండవనే చెప్పినట్లైంది.

పదో థీసీజ్‌లో, పౌర సమాజాన్ని, కుటుంబ ఐకమత్యాన్ని సైతం

విచ్ఛిన్నం చేసిన వ్యక్తుల సమాజంగా, వ్యవస్థీకృత సంక్లిష్ట సముదాయంగా హెగెల్ చూడడాన్ని వ్యతిరేకించాడు. అంటే వ్యక్తిని వేరుగా, అతడు ప్రవేశించే సామాజిక సంబంధాల్ని వేరుగా చూడటం సరైంది కాదనీ, సమాజాన్ని నిర్వహిస్తున్న సంబంధాలూ, సాంప్రదాయాలూ వ్యక్తులు ప్రారంభించేవి గానీ, ఆపేవి గానీ కావనీ, దానికి భిన్నంగా మానవ సమాజ దృక్పథాన్ని ముందుకు తెచ్చాడు మార్క్స్.

పదకొండో థీసీజ్ లో, "తత్వవేత్తలు ప్రపంచానికి నిర్వచనం మాత్రమే చెప్పారనీ, విషయం దాన్ని మార్చడమే" నని చెప్పిన ఈ పదకొండో ప్రతిపాదన జగద్విదితమే. అయితే మానవ కార్యచరణకు చారిత్రికంగా హద్దులూ, పరిమితులూ వున్నాయనడాన్ని మార్క్స్ తోసిపుచ్చాడు. సంప్రదాయ తత్వశాస్త్రం లో లేని ఆచరణ కి పెద్దపీట వేశాడు. తత్వశాస్త్రం, తత్వశాస్త్రం కోసం కాదనీ, ఆచరణ కోసం అనీ అంటాడు. అంటే మార్క్స్‌ది క్రియాశీల తత్వశాస్త్రం. ప్రపంచాన్ని మార్చడం ఒక భౌతికవాద సూత్రమే అయినా ఆ మార్పు మంచి సమాజం కోసం అవ్వాలన్నది మార్క్స్ ఉద్దేశ్యం.

తర్వాత మార్క్స్ తత్వశాస్త్రం శీర్షిక కింద మార్క్స్ యొక్క సమగ్రమైన తాత్విక పునాదుల్ని పరిచయం చేశారు రచయిత. ఇందులో ప్రకృతిని మానవీకరించడం, మనిషిని సామాజీకరించడం, ప్రకృతి సైన్సుకు ఎలా ప్రాతిపదిక అయిందో, మనిషినీ శ్రమనీ ఒకవైపు నిలిపి, ప్రకృతినీ, దాని పదార్థాలనీ మరోవైపు పెట్టి ఎలా చూడాలో, మానవ సారాంశం అనే స్థిరమైన, మారని ఫ్యూయర్ బాక్ ని తిరస్కరించి, మనిషికీ, ప్రకృతికీ గల వ్యత్యాసాన్ని తన గతి తార్కిక రీతిలో మార్క్స్ ఎలా తొలగించ బూనాడో వివరించారు రావు గారు ఇందులో.


ప్రాక్సిస్, శ్రమ చాప్టర్లో ప్రపంచాన్ని మార్చే ఆచరణాత్మక కార్యకలాపమైన ప్రాక్సిస్ గురించీ శ్రమ గురించీ సరళంగా వివరించారు. భౌతికవాదం, నాస్తికవాదం శీర్షికలో అతి భౌతికవాద, భావవాద, సత్తాశాస్త్ర నిరూపణలకు మార్క్స్ భౌతికవాదం ఎలా భిన్నంగా వుందో చెప్పే ప్రయత్నం చేశారు. ఆకలినీ, దుఃఖాన్నీ తొలిగించే ఈ భౌతికవాద ప్రత్యేకతేమిటో చెప్పారు. కాంట్, లాక్, హెగెల్, ఫ్యూయర్ బాక్, పాత భౌతికవాదుల, సత్తా వాదుల భావనల్ని త్రోసిపుచ్చి పరిస్థితులు మనుషులను తయారు చేయడమే కాదు మనుష్యులు కూడా పరిస్థితులను తయారు చేస్తారన్న మార్క్స్ భావాన్ని ఇందులో చాలా సరళంగా వివరించే ప్రయత్నం చేశారు.


చరిత్ర అధ్యాయంలో, మనుషులు వునికిలో వున్నంతకాలం ప్రకృతి చరిత్రా, మనుషుల చరిత్రా పరస్పరం ఒకదాన్నొకటి తీర్చిదిద్దుకుంటాయంటాయనీ, ఆర్థికం యొక్క ప్రాకృతిక, సామాజిక అంశాల మధ్య సంబంధంలోనే మార్క్స్ భౌతికవాద మూలం ఇమిడి వుందనీ, ఈ సంబంధం యొక్క గతిశీలతలోనే చరిత్ర ఆవిర్భవిస్తున్నదని మార్క్సు భావించాడనీ, అందుకే మార్క్స్ భౌతికవాదాన్ని 'చరిత్ర గురించి భౌతికవాద భావన అనడం' అని అంటారు రచయిత.


జ్ఞాన సిద్ధాంత శీర్షిక కింద వివరించిన అంశాలు చాలా విలువైనవి. అతి సాధారణ పదాల్లో వివరించే ప్రయత్నం చేశారు. ఎవరో ప్రసాదించిన స్వతంత్ర వస్తువులనేవి ఏవీ లేవనీ, వస్తువులన్నీ సామాజిక నిర్మితులేననీ, చైతన్యం మరియూ ప్రాక్సిస్ ద్వారా నిర్మించబడ్డ ఈ వస్తువులే మనిషి పై ప్రతి చర్య జరిపి మనిషిని మార్చేస్తుంది అన్నదే సరైనదనీ, ఫ్యూయర్ బాక్‌తో సహా పాత భౌతికవాదులు భావించిన పరిస్థితుల, పెంపకాల వల్ల మార్పు జరగదనీ, మనిషిని కేవలం ప్రాకృతిక జీవిగా తలపోయడం తప్పనీ, మనుషులు ఏ మేరకు పరిస్థితులను తయారు చేస్తారో, ఆ మేరకు పరిస్థితులు మనుష్యులను తయారు చేస్తాయన్న మార్క్స్ వాదాన్ని ఇందులో సులభమైన మాటల్లో వివరించే ప్రయత్నం చేశారు రావుగారు.


ఫ్యూయర్ బాక్ ఈ పదకొండు థీసీజ్‌ల్ని సమకాలీన అంశాల్లో ప్రతిక్షేపించి చెప్పిన రావు కృష్ణారావు గారు ఎటువంటి క్లిష్టత లేకుండా వీటికి సుబోధకమైన రీతిలో విశ్లేషించే ప్రయత్నం చేశారు. విచిత్రమేమిటంటే, చదువుకుంటూ వెళుతున్నప్పుడు మీకెక్కడా క్లిష్టమైన భావన తలెత్తకుండా దాన్ని సామాజిక పరిస్థితులకు ఆపాదించి చూపడం వల్ల ఇలాంటి గ్రంథాల్ని కొంచెం బెరుకుతో చదివే వారికి ఒక చక్కని easeతో చదువుకునేలా ఈ రచనని ప్రతిభావంతంగా ఆవిష్కరించారు. పుస్తకం ఆసాంతం చాలా హాయిగా, ఒక క్లిష్టమైన తాత్విక సూత్రాల్ని అధ్యయనం చేస్తున్నామన్న స్పృహ లేకుండా సులభంగా అర్థం అయ్యేలా రాస్తూ పోయారు. పుస్తకాన్ని మొదలుపెట్టాక మీరు ఏక బిగిని చదువుకుంటూ వెళతారు. అతి ప్రాథమిక తత్వశాస్త్ర పారిభాషిక పదాలతో పరిచయమున్నవారు సైతం దీన్ని తేలిగ్గా అర్థం చేసుకోగలుగుతారు. ఇంచుమించు ప్రతి భావననీ, సమకాలీన అంశాల ఉల్లేఖనల ద్వారా సులభీకరించడం వల్ల పుస్తకం యొక్క పరమార్థం నెరవేరినట్లైంది. రావు కృష్ణారావు గారి గంభీరమైన శైలీ, సమ్మోహనకరమైన వారి పద ప్రయోగాలూ వారు చక్కని కథకులు కావడం వల్ల కావొచ్చు అవి సంక్లిష్టమైన సైద్ధాంతిక గ్రంథాల్ని తెలుగు పాఠకలోకానికి అందించే అద్భుతమైన వరాలుగా నప్పాయి ఈ గ్రంథంలో కూడా. వారి మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతమూ, మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతాలూ ఇప్పటికే తెలుగు మార్క్సిస్టు అధ్యయన కారులకు విలువైన కానుకలు కాగా ఈ గ్రంథాన్ని మరొక గొప్ప చేర్పు అనడంలో ఎటువంటి సందేహం అక్కర్లేదు. ఇంత విస్తృతమైన అధ్యయనంతో శ్రమకోర్చి రాసిన రావు కృష్ణారావు గారికి మార్క్సిస్టు అధ్యయనకారుల తరపున అభినందనలు. ❑

# కొత్త పుస్తకాలు


రోసా లక్సెంబర్గ్
సంస్కరణా, విప్లవమా?
తెలుగు:
ఎ. గాంధి
Rosa Luxemburg's
Reform or Revolution,
in Telugu
సంస్కరణా, విప్లవమా?
PEACOCK CLASSICS


రోసా లక్సెంబర్గ్
సంస్కరణా విప్లవమా?
ఎ. గాంధి పరిచయ ప్రసంగం
Introductory speech
on Reform or Revolution?
by A Gandhi in Telugu
సంస్కరణా, విప్లవమా? పుస్తకానికి
ఎ. గాంధి పరిచయ ప్రసంగం
వేదిక on line కార్యక్రమంలో నవంబరు, పద్నాలుగు, పదిహేను తేదీల్లో పీకాక్ క్లాసిక్స్ సంపాదకుడు, ఎ. గాంధి చేసిన ప్రసంగ పాఠం ఇది:
అంతర్జాతీయ విప్లవ నేతల్లో మరువలేని వ్యక్తుల్లో రోసా లక్సెంబర్గ్ ఒకరు. రివిజనిజానికి వ్యతిరేకంగా ఆమె ఎక్కుపెట్టిన మొట్టమొదటి బాణమే సంస్కరణా, విప్లవమా? అనే చిరు పుస్తకం. తెలుగులో ఇప్పుడు ఆ పుస్తకం వామపక్ష పుస్తక సంస్థల్లో మీకు దొరుకుతుంది. పాఠకులు దానిని మరింత తేలిగ్గా గ్రహించడానికి ఉపకరిస్తుందనే భావంతో ఈ పరిచయ ప్రసంగ పాఠాన్ని డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటి ప్రచురించి మీ ముందు ఉంచుతోంది.
డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటి



దారి తెలిసిన తూటా. దట్టించిన భావజాలం. వయసు మళ్లిన యవ్వనం. నేలదాగి మాగిన సైద్ధాంతిక పాతర... తదితరా లేవీ గమ్మునుండవు. గోటి గాటు కే ఉప్పెనలవుతాయి. పలుకు స్పర్శ కే విస్ఫోటిస్తాయి. కన్నీటి ఛాయకే కత్తులు దూస్తాయి. ఆ తదితరాల్లో ఇంకింకో ఒకానొక తీవ్రత రవిమారుతం. వేడి గాలీ అనల వాయువూ సూరీడి గాడుపూ కదా... అందుకే ఇది ఆగ్రహమూ ఆందోళనా ఉద్వేగమూ ఆలోచనా కలగలిపి మెలి పెట్టిన పాలికేక. అంతేకాదు... పూలవానలూ పరిమళాలూ పరవశాలూ పెనవేసుకున్న నెమలీక కూడా.

ఎవరి మీద కోపం. ఎందుకీ ఉద్రిక్తత. ఏ పాటలు పాడనుందీ స్వరం. ద్రవ్య అనాగరిక చిల్లర రాచరికాల మీద కోపం. విరటుకొల్వు చేరిన పాండవ పంచముల మీద కోపం. బార్బరీక వారసుల బుర్ర తక్కువ పాలక విన్యాసాలను సహించలేక ఉద్రిక్తత. మహమ్మారులనూ పేగు నకనకల నకిలీ మాయరోగాలనూ సర్దుబాటు చేయ లేని కిరీటాల కిరాతక నాటకాల్ని చూడలేక ఉద్రిక్తత. కాషాయ కషాయాలనూ, విరుగుడు దాచి విషాలను పందేరం చేసే క్రూర కనికరాలనూ మంట పెట్టేందుకు ఈ స్వరభాస్వరం.

కోపోద్రిక్త స్వరాన్ని వినాల్సిందే... సామాజిక ప్రాపంచిక రాజకీయ మానసిక కాల్పనిక ప్రహేళికా లోకంలో నిన్నూ నన్నూ మనందరినీ ప్రవేశ పెట్టి దారి తప్పకుండా ప్రతి మలుపులో క్లూలతో సిద్ధంగా ఉండే చూపుడువేళ్ల కోసం...

\- ప్రసేన్

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**